





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 61 | గురువారం | 29-01-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## విభేదాలున్నా దేశం కోసం
# ఐక్యంగా ఉండాలి

- రాష్ట్రపతి ముర్ము పిలుపు
- బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగం
- గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, వాజ్‌పేయి నామస్మరణ
- విబి–జి–రామ్ జి పథకంపై ప్రతిపక్షాల నిరసన



**న్యూఢిల్లీ:** వికసిత్ భారత్ సంకల్ప సిద్ధికి ఐక్యంగా ఉండాలని పార్లమెంటు సభ్యులకు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా లోక్‌సభ ఛాంబర్‌లో బుధవారం ఉదయం పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, అంబేద్కర్, సర్దార్ వల్లభాయ్ పటేల్, జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా, పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ,అతల్ బిహారీ వాజ్‌పేయి వంటి ప్రముఖులను స్మరించుకున్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు, భిన్న విశ్వాసాలు ఉన్నప్పటికీ ఈ మహా నాయకులంతా కొన్ని విషయాల్లో విభేదాలకు అతీతంగా ఐక్యంగా వ్యవహరించారని గుర్తుచేశారు. వికసిత్ భారత్, జాతీయ భద్రత, ఆత్మనిర్భర్, స్వదేశీ వస్తు వినియోగ ప్రచారం, దేశ ఐక్యత కోసం కృషి వంటి విభేదాలకు అతీతమైన లక్ష్యాల సాధనకు పార్లమెంటు సభ్యులు సంకల్పించుకుని తరువాయి 2లో

### ఏటా ఊకదంపుడే : ఖర్గే



బడ్జెట్ సమావేశాల ప్రారంభచిహ్నంగా రాష్ట్రపతి ఉభయ సభలనూ ఉద్దేశించి చేసిన ప్రారంభ ప్రసంగాన్ని కాంగ్రెస్‌పార్టీ తీవ్రంగా విమర్శించింది. గట్టిగా అరిచి చెబుతున్న ఆ ప్రసంగంలో ఇప్పటివరకూ ఎలాంటి స్పష్టమైన లక్ష్యాలూ నిర్దేశించలేదని ప్రతి సంవత్సరం ఒకటే ప్రసంగాన్ని చిన్న చిన్న మార్పులతో తెచ్చి పునఃప్రసంగంగా మారుస్తున్నారని ఎక్స్ వేదికగా కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టారు. ప్రతి సంవత్సరం అదే ఊకదంపుడు ప్రసంగాన్ని వినిపిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రపత్రి ప్రసంగాన్ని కేంద్ర ప్రభుత్వమే తయారు చేసి ఇస్తుంది. రాష్ట్రపతి ఆ ప్రసంగాన్ని చదివే బాధ్యత మాత్రమే నిర్వహిస్తారు. వికసిత్ భారత్ నినాదాన్ని కేంద్రం తరువాయి 2లో

### స్ఫూర్తిదాయకం : మోదీ



రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ప్రసంగం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రశంసించారు. దేశ భవిష్యత్‌కోసం చాలా స్పష్టమైన మార్గదర్శనం చేశారన్నారు. బడ్జెల్ సమావేశాలు చాలా స్ఫూర్తిదాయకమైన ప్రసంగంతో ప్రారంభమయ్యాయన్నారు. ''ఈరోజు రాష్ట్రపతి ప్రసంగం సమగ్రంగా ఉంది, స్ఫూర్తిమంతంగా ఉంది, భారతదేశం ఇటీవల సాగిస్తున్న గొప్ప అభివృద్ధికర ప్రయాణానికి అద్దంపట్టింది, సమష్టి సంకల్పాని ఆమె ఉద్ఘాటించారు'' అని ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు.



## మహారాష్ట్రలో
# పెను విషాదం

### విమాన ప్రమాదంలో డిప్యూటీ సిఎం
### అజిత్ పవార్ దుర్మరణం



- బారామతి విమానాశ్రయం సమీపంలో కుప్పకూలిన విమానం
- మరో నలుగురు వ్యక్తులు కూడా మృతి
- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు దిగ్భ్రాంతి

**బారామతి :** మహారాష్ట్రలో విషాదం చోటు చేసుకుంది. పుణె జిల్లాలో బుధవారం బారామతి విమానాశ్రయ సమీపంలో ఓ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. అదే విధంగా విమానంలో ఉన్న మరో నలుగురు వ్యక్తులు కూడా మరణించారు. ఫిబ్రవరి 5న జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల కోసం పుణె జిల్లాలో నిర్వహించే నాలుగు ర్యాలీలను ఉద్దేశించి ప్రసంగించేందుకు పవార్ ఉదయం ముంబై నుండి బయలుదేరారు. ప్రమాదంలో ఇద్దరు విమాన సిబ్బంది ఉన్నారని, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) బృందం ప్రమాద స్థలాన్ని సందర్శించి ప్రమాదంపై దర్యాప్తు చేస్తుందని ఒక అధికారి తెలిపారు. ఫ్లైట్ రాడార్ ప్రకారం, ఢిల్లీకి చెందిన విఎస్‌ఆర్ వెంచర్స్ నడుపుతున్న తరువాయి 2లో

### ఇయుతో ఎఫ్‌టిఎ
# భారత్‌కు హానికరం

- ఒప్పందానికి సంబంధించిన అన్నిరకాల చర్చలు, సంప్రదింపులు నిలిపివేయాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం డిమాండ్

**న్యూఢిల్లీ:** యూరోపియన్ యూనియన్ (ఇయు)తో చేసుకునే స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) భారత్‌కు ఎంతో హానికరమని భారత కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది. ఈ ఒప్పందానికి సంబంధించిన అన్ని రకాల చర్చలు, సంప్రదింపులను నిలిపివేయాలని బుధవారం ఒక ప్రకటనలో సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం డిమాండ్ చేసింది. ప్రతిపాదిత ఒప్పందం దేశ ఆర్థిక సార్వభౌమత్వం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తితో పాటు పౌరుల సంక్షేమానికి పెద్ద ముప్పుగా పరిణమిస్తుందని కేంద్రాన్ని హెచ్చరించింది. మేధోసంపతి, వ్యవసాయం, ప్రభుత్వ సేకరణ, నియంత్రణ ప్రమాణాలు తరువాయి 12లో

## దుర్గం శ్రీకాంత్
# తొలగింపు

- ఇందిరమ్మ లబ్ధిదారుల నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడిన ఔట్‌సోర్సింగ్ ఎఇ
- క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్ ప్రకటన
- ఎక్కడా ఉద్యోగం రాకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడి, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల ఔట్ సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గం శ్రీకాంత్‌ను ఉద్యోగం నుంచి తొలగించడంతో పాటు క్రిమినల్ కేసును నమోదు చేసినట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు. శ్రీకాంత్‌కు భవిష్యత్తులో ఎక్కడా ఉద్యోగం రాకుండా ఆయన తరువాయి 12లో

## 'విబి-జి రామ్ జి' చట్టం
# రద్దయ్యేదాకా పోరాటం

- ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి కుట్ర చేస్తున్న మోదీ
- కేంద్రం తీసుకొచ్చిన చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి
- తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

ప్రజాపక్షం/మెదక్



యుపిఎ ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడం కోసం తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం మార్చడమంటే పేదల పొట్టకొట్టడమేనని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ విమర్శించారు. మహాత్మ గాంధీ ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం ప్రధాని మోదీకి తగదన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని బొందపెట్టేందుకు తరువాయి 2లో

## వనమంతా
# జనమే



- భక్తజన కోటి మధ్య అత్యంత వైభవంగా ప్రారంభమైన మేడారం జాతర
- గద్దెలకు చేరిన సారలమ్మ, పగిడిద్దరాజు లక్షలాదిగా తరలి వస్తున్న ప్రజలు

ప్రజాపక్షం/మేడారం/ములుగు

భక్తజన కోటి మధ్య మేడారం మహాజాతర బుధవారం ఘనంగా ప్రారంభం అయింది. పండు వెన్నెల నడుమ కన్నెపల్లి నుండి సారలమ్మ రాకతో మహాజాతర వైభవంగా ప్రారంభమైంది. మొదటి రోజు సారలమ్మతో పాటు పూనుగొండ్ల నుండి పగిడిద్దరాజు గద్దెకు చేరుకున్నారు. మేడారానికి మూడు కిలోమీటర్ల దూరంలోని కన్నెపల్లిలో కొలువైన సారలమ్మ, గంగారం మండలంలోని పూనుగొండ్ల నుంచి పగిడిద్ద రాజు, ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజులను, నార్లాపూర్ నుంచి తరువాయి 2లో

## 3 నుంచి సిఎం
# ఎన్నికల ప్రచారం

మిర్యాలగూడలో బహిరంగసభతో షురూ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి షెడ్యూల్ ఖరారైంది. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి మిర్యాలగూడలో బహిరంగ సభతో సిఎం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఫిబ్రవరి 4న జగిత్యాల, 5న చేవెళ్ల, 6న భూపాలపల్లి, 7న మెదక్, 8వ తేదీన నిజామాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచార సభలను నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. దీంతో ఈ ఎన్నికల్లో సింహభాగం స్థానాలను కైవలం చేసుకునేందుకు తరువాయి 12లో




# నామినేషన్లు షురూ

- తొలిరోజే 902 దాఖలు
- అత్యధికం కాంగ్రెస్ అభ్యర్థులవే
- సిపిఐ నుంచి ఏడుగురు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల నామినేషన్ల పర్వం బుధవారం మొదలైంది. నామినేషన్ల తొలి రోజు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 902 నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్‌ల 2,996 వార్డులకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. మొదటి రోజు 890 మంది అభ్యర్థులు నామినేషన్లు తరువాయి 12లో




## 60 మంది వాణిజ్య బృందంతో.. బ్రిటన్ ప్రధాని చైనా పర్యటన

బీజింగ్: బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్‌మర్ మూడు రోజులు పర్యటన నిమిత్తం చైనాకు వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం ఆయన బీజింగ్‌కు చేరుకున్నారు. ఆయన వెంట 60 మంది వాణిజ్య ప్రతినిధులు కూడా చైనా పర్యటనలో ఉన్నారు. యూరప్ దేశాలు చైనాతో వాణిజ్యానికి తహ తహ లాడుతున్న తరుణంలో బ్రిటన్‌లో అతిపెద్దదైన చైనా దౌత్యకార్యాలయాన్ని నిర్మించేందుకు స్టార్‌మర్ దిగువసభ ఇటీవల ఆమోదం తెలియజేయడం, స్టార్‌మర్ వాణిజ్య ఒప్పంద పర్యటన ఎంతో అరుదైన ప్రాధాన్యతగల విషయంగా మారింది. 2018 లో థెరిసా మే తర్వాత బ్రిటన్ ప్రధానమంత్రి చైనాకు వెళ్ళడం మళ్ళీ ఇదే. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో స్టార్‌మర్ సమావేశంలో వాణిజ్య ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. ఈ వాణిజ్య పర్యటన బ్రిటన్‌కు ఎంతో మేలు జరుగుతుందని విమాన ప్రయాణ సమయంలో పాత్రికేయులతో స్టార్‌మర్ చెప్పారు. చాలామంది వ్యాపార దిగ్గజ సంస్థలకు చెందిన సిఇఓలు తనతో పాటు చైనా పర్యటనకు వస్తూ ఉండటమే తమ ఆశాభావానికి ఒక చిహ్నమని అన్నారు. బార్క్లేస్, జాగ్వార్ లాండ్ రోవర్, రాయల్ షేక్స్పియర్ సహా డజన్ల కొద్దీ ప్రముఖ సంస్థల సిఇఓలు ఆ విమానంలో ఆయన వెంట ఉన్నారు. ప్రపంచంలో కీలకమైన ఆర్థికవ్యవస్థలలో చైనా ఒకటిగా ఉన్నందువల్ల బ్రిటన్ ప్రయోజనం పొందుతుందని ఆశాభావంతో ఉన్నట్లు స్టార్‌మర్ చెప్పారు.

## రద్దయ్యేదాకా పోరాటం (మొదటి పేజీ తరువాయి)

ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బుధవారం మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం కోర్వి పల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పేరు మార్చడం పట్ల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావులు హాజరయ్యారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ, 2005 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కేంద్రంలో ప్రవేశపెట్టిందని తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం ఉపాధి హామీని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ పథకాన్ని బిజెపి కేంద్ర ప్రభుత్వం మోడీ పేరును మార్చడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. పేదలకు ఉపాధి కల్పించాలనే మంచి ఉద్దేశ్యం తో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో యుపిఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చి పని కల్పిస్తే దానిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం లోని మోడీ సర్కార్ కుట్ర చేస్తోందని ఆమె విమర్శించారు. వీబీజీరామ్ జీ చట్టం రద్దయ్యే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మ, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వందశాతం నిధులు వెచ్చిస్తూ పథకాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40శాతం భారాన్ని రాష్ట్రా లపైమోపడం అన్యాయమన్నారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్రప్రభావం చూపే నిర్ణయమని, కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ అతి జోక్యంతో ఇప్పటికే నిధుల లేమితో అల్లాడుతున్న చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని అమలు చేయకుండా ఎత్తేసే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు ఉన్న సమయంలో 60 రోజుల పాటు ఉపాధి హామీ పనులను ఆపటం వల్ల కూలీలు పని కోల్పోయే అవకాశం ఉంటుందని ఎత్తిచూపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ పిసిసి అధ్యక్షులు వి.హనుమంతరావు, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పిసిసి ప్రతినిధి అనిల్, పీసీసీ ప్రతినిధి ముబాకర్ అలీ ఖాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, దుబ్బాక ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల పురం జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, సర్పంచుల మాజీ మండల అధ్యక్షుడు అలావత్ మోహన్ నాయక్, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, సర్పంచ్ పుల్లారావు తోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

## ఏటా ఊకదంపుడే : ఖర్గే
(మొదటి పేజీ తరువాయి)

పదే పదే అరచి అరచి చెబుతోందని, దానికో లక్ష్యం, కాల పరిమితి, ఫలితాల సాధన లేకుండా పోయిందన్నారు. అభివృద్ధి పేరుతో గొప్పలు చెప్పారని, పేదలకు వ్యతిరేకంగా, ప్రభుత్వాన్ని అంటకాగిన వాణిజ్య వేత్తలకు అనుకూలంగా మోదీ ప్రభుత్వం నిర్ధాక్ష్యణ్యంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. గ్రామీణ పేదల పని కోసం ఈ చట్టాన్ని కాంగ్రెస్‌పార్టీ తెచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ కూడా ఈ ప్రసంగాన్ని విమర్శిస్తూ, పదే పదే చెప్పిన విషయాలే ఏటా ఏకరవు పెడుతున్నారన్నారు. '''అక్కడ ఏం లేదు, పునరుక్తి తప్ప, ఇంతకుముందు ఎన్నోసార్లు చెప్పారు, దానికో పరిమితి లేదు,అంతా డొల్ల, ప్రభుత్వం ఏదో సంప్రదాయబద్ధంగా ఈ ప్రసంగాన్ని తయారు చేస్తోంది, వట్టి బూటకపు వాగ్దానాలు చేస్తున్నారు'' అని విమ ర్శించారు. కాంగ్రెస్ ఎంపి మనీశ్ తివారీ మాట్లాడుతూ, కేంద్రం ఈ ప్రసంగాన్ని తయారు చేసిందని, మంత్రివర్గం దానికి ఆమోద ముద్ర వేసిందని విమర్శించారు.

## జనమే (మొదటి పేజీ తరువాయి)

నాగులమ్మను వారి వారి పూజారులు మేడారానికి తీసుకువచ్చారు. సాయంత్రం నుండి కన్నెపల్లిలోని సారలమ్మ పూజా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులంతా అక్కడే మోహరించగా సారలమ్మ ఆవహించిన వెంటనే ప్రధాన పూజారి తల్లి రూపాన్ని తీసుకుని కాలి నడకన మేడారానికి బయలు దేరారు. ఆయనతో పాటు పూజారులకు పోలీసు రోప్ పార్టీలు భారీ బందో బస్తు కల్పించాయి. జంపన్న వాగు గుండా సారలమ్మ మేడారం వైపునకు పయనమై గద్దెకు చేరుకున్నది. సమ్మక్క, సారలమ్మ వన దేవతలను దర్శించుకునేందుకు భక్త కోటి మేడారానికి బాట పట్టింది. చీమల దండును తలపిస్తూ వాహనాలు బారులు తీరాయి. ఇప్పుడు దారులన్నీ మేడారం వైపే సాగుతున్నాయి. ఆర్టీసి బస్సులు, ప్రైవేటు, సొంత వాహనాలలో జనం లక్షలాదిగా వస్తూనే ఉన్నారు. ఎడ్లబండ్ల నుండి ఈసారి కొంత తగ్గినప్పటికీ ములుగు, ఖమ్మం, కరీంనగర్, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ, పెద్దపల్లి జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్‌కు చెందిన గ్రామీణ ప్రాంత భక్తులు వివిధ వాహనాలలో మేడారానికి చేరుకున్నారు. దీంతో మేడారం చుట్టు ముట్టు నాలుగు గ్రామాలు కిక్కిరిసి పోయాయి. పార్కింగ్ స్థలాలు వాహనాలతో నిండి పోయాయి, ఎక్కడ చూసినా జనమే జనం. బుధవారం ఉదయం నుండి మొదలైన భక్త ప్రవాహం రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. జంపన్న వాగు పుణ్య స్నానాలతో శిగాలూగుతున్నది. దేవతల గద్దెలు మొక్కులు, ముడుపులతో నిండిపోతున్నాయి. సాయుధులైన పోలీసులు మేడారం నలుమూలల మోహరించి బందోబస్తు నిర్వహిస్తున్నారు. అధికారులు వారి వారి సెక్టార్‌లు, జోన్లలో విధులలో నిమగ్నం కాగా పారిశుధ్య కార్మికులు 24 గంటలు పనిచేస్తూనే ఉన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ , ఎస్పీ సుధీర్ రాజ్ కేకన్ జాతరను పర్యవేక్షిస్తున్నారు. జాతర సమాచారం కోసం తొలిసారి ప్రభుత్వం వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. 76589 12300 నెంబరు హాయ్ అని మెసేజ్ పంపితే రూట్ మ్యాప్, ట్రాఫిక్ తదితర పూర్తి వివరాలు అందుతున్నాయి. జాతరలో మొబైల్ నెట్ వర్క్స్ అంతరాయం కలగ కుండా 20శాశ్వత టవర్లు సతాత్కాలిక పద్ధతిలో టవర్లు.. 450వెరీ హై ఫ్రీక్వెన్సీ సెట్లను ఏర్పాటు చేశారు.విద్యుత్ సమస్య తలెత్తకుండా 19ట్రాన్స్‌ఫార్మర్లు. 911 విద్యుత్ స్థంబాలు, 65 75కి.మీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయగా, 350 మంది విద్యుత్ సిబ్బందిని వెకెడీజిల్ జనరేట ర్లను అందుబాటులో ఉంచారు.జంపన్నవాగు వద్ద భక్తులకు స్నాన ఘట్టాలు, మహి ళలు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, స్నానాలకు, తాగు నీటి కోసం బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ (బీవోటీ)లను ఏర్పాటు చేశారు.జంపన్నవాగులోకి లక్నవరం నుంచి నీటిని వదులటంతో పాటు మూడు ఫీట్లకు మించి ప్రవాహం లేకుండా ఇసుక చదును చేశారు. 200మంది గజ ఈతగాళ్లు వేసింగ రేణి రెస్క్యూ బృందాలు, 10 ఎస్ఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు.15 ఫైర్ బ్రిగేడ్ వాహనాలు, 8 ఫైర్ ఫైటర్లను అందు బాటులో ఉంచారు.జాతరలో మొత్తం 148ఎకరాల్లో పార్కింగ్ స్థలా లను ఏర్పాటు చేశారు.

# ఇరాన్‌కు సమీపంలో సైనిక విన్యాసాలు

### ఈసారి దాడి ఘోరంగా ఉంటుంది
### జాగ్రత్త : ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్ :** ఈసారి చేసే దాడి చాలా ఘోరంగా ఉంటుందని ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర హెచ్చరిక చేశారు.ట్రంప్‌తోపాటు ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూ కూడా విడిగా యుద్ధ హెచ్చరిక చేశారు. ఇరాన్‌లో అల్లర్లు ప్రారంభమైన నెల రోజుల తర్వాత ఆ దేశంపై అమెరికా దాడులు చేస్తుందన్న భయాలు పశ్చిమ ఆసియాలో విస్తరించాయి. దీంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత ఉద్ధృత రూపం దాలుస్తున్నాయి. అమెరికాతో ఒక ఒప్పందం చేసుకోవాలని లేకపోతే ఈసారి దాడి ఘోరంగా ఉంటుందని ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. క్లైవ్–లోవాలో జరిగిన ఒక ర్యాలీలో ట్రంప్ బుధవారం ఉదయం మాట్లాడుతూ, మరో విమాన వాహక యుద్ధ నౌక కూడా ఇరాన్ జలాలకు తరలివెళుతోందని ప్రకటించారు. వారు (ఇరాన్) ఒక ఒప్పందం చేసుకుంటుందని మేం ఆశాభావంతో ఉన్నాం..అని పదే పదే అన్నారు. అమెరికాతో వాణిజ్య చేసేందుకు ఒప్పుకుంటే అమెరికా సిద్ధంగా ఉందని అన్నారు. ఇజ్రాయెల్ సమీపంలో ఇప్పటికే అమెరికా విమానవాహక యుద్ధనౌక 'అబ్రహాం లింకన్'తో పాటు అనేక గైడెడ్ క్షిపణులను మోహరించింది. పశ్చిమ ఆసియా జలాల్లో గగనతల సైనిక విన్యాసాలు ప్రారంభమైనట్లు అమెరికా సైన్యం కూడా ఒక ప్రకటనలో తెలిపింది. ఇరాన్‌పై దాడి చేయకుండా ఉండాలంటే ప్రదర్శకులను అణచివేయకూడదని, వారిని ఉరి తీయకూడదని రెండు షరతులు ట్రంప్ విధించారు. ఇరాన్ కూడా ఇద్దరు ప్రదర్శకులను ఉరితీయకుండా ఉత్తర్వులు నిలిపివేసింది. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్ గనుక తమపై దాడిచేస్తే తీవ్ర తప్పిదం కాగలదని, అసాధారణమైన రీతిలో ఊహించని సైనిక పాటవంతో దాడులు చేస్తామని, తాము స్వతంత్రంగా వ్యవహరించి నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరిక చేశారు. దీంతో ఇరాన్ ప్రభుత్వం కూడా తీవ్రంగా స్పందించింది. తమ దేశాన్ని ఎలా కాపాడుకోవాలో తమకు బాగు తెలుసునని, ఊహించనిరీతిలో అమెరికా–ఇజ్రాయెల్ దేశాలకు గుణపాఠం చెబుతామని హెచ్చరించింది. ఇరాన్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయెల్ హెచ్చరిక చేసిన తర్వాత ఇరాన్ అనుకూల హిజ్బుల్లా, హౌతీ ఉగ్రవాద సంస్థలు కూడా ప్రతిహెచ్చరిక చేస్తూ, ఇజ్రాయెల్‌పై ఉగ్రవాద దాడులను ఉద్ధృతం చేస్తామని తిరిగి హెచ్చరించాయి.

ఇరాన్‌లో సరిగ్గా నెలరోజుల క్రితం (డిసెంబరు 28) ప్రజాందోళన, అల్లర్లు ప్రారంభమైన తర్వాత ప్రదర్శకులకు మద్దతు ఇస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించారు. ప్రదర్శకులను అణచివేస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. ఆ తర్వాత ప్రవాసంలో ఉన్న ఇరాన్ మాజీ రాకుమారుడు రెజా పహ్లావీని ట్రంప్ తెరమీదకు తెచ్చారు. దేశంలో హింసాత్మక ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని రెజా పహ్లావీ ఇరాన్ ప్రజలకు అజ్ఞాతం నుండే పిలుపు ఇవ్వడంతో జనవరి 8–9 తేదీలలో ఆ దేశంలో దారుణ హింస చెలరేగింది. ప్రభుత్వం కూడా వేలాదిమందిని హతమార్చి ఉద్యమాన్ని అణచివేసింది. ఇరాన్ నుండి ఖమేనీని వెళ్లగొట్టాలని ట్రంప్ పిలుపు ఇచ్చారు. రష్యా చేసిన హెచ్చరికతో అప్పుడు ట్రంప్ కొంత వెనకడుగు వేశారు. ఉద్యమకారులను ఉరితీయడం ఆపేస్తే ఎలాంటి చర్యలూ తీసుకోనని స్పష్టం చేశారు. ఇరాన్ కూడా ఉరిశిక్షలను వాయిదా వేసింది.

**ఇరాన్‌కు టర్కీ, సౌదీ సహా పలు దేశాల మద్దతు**

అమెరికా–ఇజ్రాయెల్ ఒకవైపు ఇరాన్ ఒంటరి చేసేందుకు ప్రయత్నం చేస్తుంటే పలు దేశాలు ఇరాన్‌కు మద్దతు ప్రకటించారు. సౌదీ అరేబియా, టర్కీ దేశాలు ఈ విషయంలో అగ్రభాగాన ఉన్నాయి. ఇరాన్‌కు వ్యతిరేకంగా తమ భూభాగాన్ని, గగన తలాన్ని ఉపయోగించుకునేందుకు ఎట్టి పరిస్థితుల్లో ఎవ్వరినీ అనుమతించబోమని సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌కు హామీ ఇచ్చారు.పశ్చిమ ఆసియాలో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న తరుణంలో పెజెష్కియన్–బిన్ సల్మాన్ మధ్య మంగళవారం ఫోన్ సంభాషణ జరిగింది. వివాదాన్ని పరిష్కరించేందుకు చర్చలకు తాము మద్దతుగా ఉంటామని, ప్రాంతీయ భద్రతను పటిష్టం చేసేందుకు మధ్యవర్తిత్వ ప్రయత్నం చేస్తామని భరోసా ఇచ్చారు. కువైట్ దేశం కూడా ఇరాన్‌కు మద్దతు ఇచ్చింది. ఇరాన్‌కు వ్యతిరేకంగా తమ భూభాగాన్ని, గగనతలాన్ని వాడుకునేందుకు అనుమతించబోమని స్పష్టం చేసింది. ఖతార్, ఒమన్, ఈజిప్టు, టర్కీ దేశాలు కూడా ఇరాన్–అమెరికా, ఇజ్రాయెల్ మధ్య యుద్ధజ్వాలలు రేగకుండా మధ్యవర్తిత్వం చేసేందుకు, సమస్య పెరగకుండా చూసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. మరోవైపు టర్కీ దేశం కూడా అమెరికాకు ఒక హెచ్చరిక చేసింది. ఇరాన్ జోలికి వెళ్ళవద్దని కోరింది. ఇరాన్ విషయంలో ఉద్రిక్తతలు చల్లార్చేందుకు దౌత్య చర్యల ద్వారా పరిష్కారం చేసుకోవాలని, మధ్యవర్తిత్వం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని టర్కీ ప్రభుత్వం అమెకాను కోరింది. యుద్ధ పరిస్థితే వస్తే ప్రపంచ ఇంధన భద్రతకు, ప్రాంతీయ స్థిరత్వానికి వినాశకరమైన పరిణామాలు ఎదురవుతాయని అమెరికాను హెచ్చరించింది.

**ఇజ్రాయెల్ గూఢచారిని ఉరితీసిన ఇరాన్**

ఇజ్రాయెల్ గూఢచారిని ఇరాన్ ప్రభుత్వం బుధవారం ఉరితీసింది. ఒకవైపు యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న తరుణంలో ఇరాన్ ఈ శిక్ష అమలు చేసింది. ఇరాన్‌లో ఇజ్రాయెల్ తరపున గూఢచారి చర్యలకు పాల్పడ్డాడని రుజువు కావడంతో హమిద్రెజా సబెత్ ఎస్మాయిల్ పూర్ అనే వ్యక్తిని బుధవారం తెల్లవారుజామున ఉరితీసినట్లు ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ వార్తాసంస్థ ప్రకటించింది. ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొస్సాద్‌కు దేశంలో ఉన్న సమాచారాన్ని చేరవేస్తున్నాడన్న కేసులో న్యాయస్థానం సబెత్‌ను దోషిగా నిర్ధారించింది. 2025 ఏప్రిల్‌లో అతడిని ఇరాన్ పోలీసులు అరెస్టు చేశారు. గడచిన జూన్ నెలలో ఇరాన్‌పై ఇజ్రాయెల్ 12 రోజుల యుద్ధం తర్వాత గూఢచర్యం నేరాలపై ఇప్పటివరకూ ఇరాన్ ప్రభుత్వం 12 మందిని ఉరితీసినట్లు హక్కుల సంఘాలు తెలిపాయి. ఈనెలలో జరిగిన అల్లర్లలో అరెస్టు చేసిన వారిలో చాలామందికి ఉరిశిక్షలు అమలు చేసే అవకాశం ఉందని హక్కుల సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ అల్లర్లలో ఇప్పటివరకూ 42,300 మంది అరెస్టయ్యారు. గడచన నెలరోజులుగా ఇరాన్‌లో జరిగిన అల్లర్లలో 6,221 మంది మరణించినట్లు వార్తలు చెబుతుండగా, దాదాపు 36 వేలమంది మరణించి ఉంటారని ఇంకా ధృవీకరించని అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. ఐతే ఇరాన్ ప్రభుత్వం మాత్రం అల్లర్లలో 3,117 మంది మరణించినట్లు ప్రకటించింది.

# ఇయుతో ఒప్పందం భారత్‌కే లాభం: అమెరికా

**న్యూయార్క్:** యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టిఎ) వల్ల భారతదేశానికే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని అమెరికా వాణిజ్య ప్రతినిధి జమైసన్ గ్రీర్ వ్యాఖ్యానించారు. భారత్–ఇయు మధ్య ఒప్పందం జరిగిన తర్వాత అమెరికా చేసిన మొదటి అధికారిక స్పందన ఇదే. ''ఈ ఒప్పందంలోని వివరాలను చూశా, ఇప్పటివరకూ తెలిసిన ప్రకారం నా ఉద్దేశంలో ఈ ఒప్పందంలో భారత్‌దే పైచేయిగా ఉంటుంది, నిర్మొహమాటంగా చెప్పాలంటే వారికి యూరప్ మార్కెట్లు చాలా బాగా అందుబాటులోకి వస్తాయి'' అని 'ఫాక్స్ బిజినెస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వాణిజ్య ఒప్పందంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.భారతీయులకు అదనంగా వలసలు వెళ్లే హక్కులు లభించినట్లు ఒప్పందం ద్వారా తెలుస్తోంది, కానీ ఖచ్చితంగా తెలియదు, ఐతే యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్ మాత్రం యూరప్‌లోకి భారతీయ కార్మికులు రాకపోకలు చేసే విషయం గురించి చెబుతున్నారు, దాన్నిబట్టి భారత్‌కే ఎక్కువ లాభం, ఆ దేశంలో కార్మికులకు వేతనాలు చాలా తక్కువ'' అన్నారు. అమెరికాలో కొన్ని ఆంక్షలు విధిస్తున్నందువల్ల యూరోపియన్ యూనియన్ ప్రపంచీకరణను చాలా ఉద్ధృతం చేయాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోందని అన్నారు.అమెరికాలో సుంకాల సమస్యలు ఎదురవుతున్నందువల్ల యూరప్ దేశాలు ఇతర మార్కెట్లను అన్వేషిస్తున్నాయన్నారు. అందువల్ల యూరోపియన్ యూనియన్ భారత్ వైపు మొగ్గుచూపించడం అంటే ఒక కొత్త పెద్దమార్కెట్‌ను వెతుక్కునే ప్రయత్నమేనని అన్నారు. యూరోపియన్ యూనియన్ చాలా ఎక్కువగా వాణిజ్యంపైనే ఆధారపడిందని, వారికి ఇతర మార్కెట్‌ల అవసరం చాలా ఉందని అన్నారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 25 శాతం సుంకాలు విధించడంపై ప్రశ్నించగా, భారత ప్రభుత్వం ఇప్పటికే ఈ అదనపు సుంకాలను అమెరికాకు చేసే ఎగుమతులకుగాను చెల్లిస్తూనే ఉందన్నారు. ఇప్పటికీ భారతదేశం రష్యా చమురు కొనుగోలు చేస్తోందా? అని ప్రశ్నించగా, ఈ విషయంలో మా వల్ల చాలా పురోగతి వచ్చిందన్నారు. భారత్ చాలా మేరకు రష్యా చమురు కొనుగోళ్ళను తగ్గించిందన్నారు. భారతదేశ వాణిజ్య ప్రతినిధులతో తాను ఎప్పటికప్పుడు సంబంధాలు కొనసాగిస్తూ సమాచారం సేకరిస్తున్నానని చెప్పారు. వారు కొంతమేరకు రష్యా చమురు కొనుగోలు చేస్తున్నారన్నారు. భారత్–యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన ఎఫ్‌టిఎ ఒప్పందం ద్వారా 200 కోట్ల ప్రజలతో ఒక ఉమ్మడి భారీ మార్కెట్ ఆవిర్భవించనున్నది. 99 శాతం భారతీయ ఎగుమతులపై టారిఫ్‌లు గణనీయంగా తగ్గిపోతాయి. యూరప్ నుండి భారత్‌కు వెళ్లే 97 శాతం ఎగుమతులపై సుంకాలు తగ్గిపోతాయి.

## పెను విషాదం
(మొదటి పేజీ తరువాయి)

లియర్‌జెట్ విమానం ఉదయం 8.10 గంటలకు ముంబయి నుండి బయలుదేరి ఉదయం 8.45 గంటలకు రాడార్ నుండి అదృశ్యమైంది. విమానం ఉదయం 8.50 గంటలకు కూలిపోయిందని ఒక పోలీసు అధికారి తెలిపారు. కూలిన వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. విమానం పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత వర్గాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన జరిగినట్లుగా తెలుస్తోంది. విమానం కూలిపోయినప్పుడు పవార్, ఆయన వ్యక్తిగత భద్రతా అధికారి, ఒక సహాయకుడు సహా ఐదు గురు ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది (పైలట్ ఇన్‌కమాండ్, మొదటి అధికారి) విమానంలో ఉన్నారని డిజిసిఎ అధికారి చెప్పారు. ప్రమాదం తర్వాత మంటలు చెలరేగాయని పోలీసు సూపరింటెండెంట్ సందీప్ సింగ్ గిల్ తెలిపారు. విమానంలో ఉన్నవారిని వెంటనే ఆసుపత్రికి తరలించారన్నారు. అజిత్ పవార్‌కు భార్య సునేత్ర (రాజ్యసభ సభ్యురాలు), ఇద్దరు కుమారులు పార్థ్, జే ఉన్నారు. అజిత్ పవార్ మృతికి సంతాపంగా ఈనెల 30 వరకు మహారాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల రాష్ట్ర సంతాప దినాలు ప్రకటించింది. ఈ సమయంలో అన్ని భవనాలపై జాతీయ జెండాను అవనతం చేస్తారు.

**1982లో రాజకీయ ప్రస్తానం :** అజిత్ పవార్ 1959 జులై 22న అహ్మదాబాద్ జిల్లా డియోలాలీ ప్రవరాలో జన్మించారు. ఆయన మాజీ సిఎం శరద్ పవార్ సోదరుడి కుమారుడు. డియోలాలీ ప్రవరాలోనే పాఠశాల విద్యాభ్యాసం జరిగింది. తండ్రి మరణంతో కాలేజీ విద్యను మధ్యలోనే వదిలేశారు. 1982లో అజిత్ పవార్ రాజకీయ ప్రస్థానం మొదలైంది. చక్కెర ఫ్యాక్టరీ సహకార బోర్డు ఎన్నికల్లో తొలిసారి గెలుపొందారు. ఆ తర్వాత పుణె జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా విజయం సాధించారు. ఆ పదవిలో ఆయన సుదీర్ఘకాలం పాటు కొనసాగారు. మొదటిసారి బారామతి ఎంపిగా గెలుపొందిన అజిత్ పవార్ 1991లో తన చిన్నాన్న శరద్ పవార్ కోసం ఎంపి పదవికి రాజీనామా చేశారు. అప్పుడు జరిగిన ఉపఎన్నికలో శరద్ పవార్ బారామతి ఎంపిగా గెలుపొంది పివి నర్సింహారావు కేబినెట్‌లో రక్షణ మంత్రిగా సేవలందించారు. అజిత్ పవార్ బారామతి నుంచి ఒకసారి ఎంపిగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆరుసార్లు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సేవలందించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఎక్కువకాలం సేవలందించిన వ్యక్తిగా ఆయన ఘనత సాధించారు. 2022–23 మధ్యకాలంలో మహారాష్ట్ర ప్రతిపక్ష నేతగా అజిత్ పవార్ కొనసాగారు. అజిత్ పవార్ 2019 నవంబర్ 23న తిరుగుబాటు చేశారు. శరద్ పవార్ సారథ్యంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని చీల్చి కొంతమంది ఎమ్మెల్యేలతో కలిసి బిజెపి–శివసేన సారథ్యంలోని సంకీర్ణ ప్రభుత్వంలో చేరారు. దేవేంద్ర ఫడణవీస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టా రు. అతని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) ఇటీవల పుణె, పింప్రి – చించ్వాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తన శరద్ పవార్ ఎన్‌సిపి (ఎస్‌పి) తో కలిసి పోటీ చేసింది.

**వెలుతురు సమస్యే కారణం: రామ్మోహన్ నాయుడు**

మహారాష్ట్ర విమాన ప్రమాదంపై పౌర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం కూలిపోయినప్పుడు, బారామతి విమానాశ్రయంలో వెలుతురు సరిగ్గా లేదని అన్నారు. ఈ విమాన ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని చెప్పారు.

**'పైలట్ల నుంచి మేడే కాల్ రాలేదు' : డిజిసిఎం**

ప్రమాదానికి ముందు పైలట్ల నుంచి మేడే కాల్ రాలేదని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వెల్లడించింది. ఘటన సమయంలో రన్‌వే గుర్తించడంలో పైలట్లు ఇబ్బంది పడినట్లు వివరించింది. తొలి ప్రయత్నంలో రన్‌వే కనిపించకపోవడంతో గాల్లోనే కాసేపు చక్కర్లు కొట్టిందని, రెండో ప్రయత్నంలో లాండ్ అయ్యేందుకు ప్రయత్నించి విఫలమైనట్లు డిజిసిఎం పేర్కొంది.

**రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు దిగ్భ్రాంతి**

అజిత్ పవార్ మరణం పట్ల అధ్యక్షురాలు ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, దేశవ్యాప్తంగా పార్టీలకు అతీతంగా అనేక మంది నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఎక్స్ పోస్టులో మహారాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా సహకార రంగంలో ఆయన చేసిన ప్రత్యేక కృషికి పవార్ ఎల్లప్పుడూ గుర్తుండిపోతారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. అజిత్ పవార్ బలమైన అట్టడుగు స్థాయి సంబంధాలతో కూడిన ప్రజా నాయకుడు, విమాన ప్రమాదంలో ఆయన మరణం అకాల, చాలా దిగ్భ్రాంతికరమైనదని ప్రధాని మోదీ అన్నారు. అజిత్ పవార్ మరణం ఎన్‌డిఎ కుటుంబానికి మాత్రమే కాకుండా తనకు కూడా వ్యక్తిగత నష్టం అని అమిత్ షా తన సంతాప సందేశంలో అన్నారు. ఈ సంఘటన గురించి విచారించడానికి మోదీ, షా కూడా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో మాట్లాడారు. అజిత్ పవార్ విషాద మరణం నమ్మశక్యం కాదని, తాను మంచి స్నేహితుడిని కోల్పోయానని ఫడ్నవిస్ అభివర్ణించారు. అజిత్ పవార్ మరణం ఎప్పటికీ పూడ్చలేని శూన్యతను మిగిల్చిందని ఆయన అన్నారు. 'కలిసి పనిచేసిన తర్వాత, ఆయన ఇక లేరనేది నమ్మశక్యం కాదు' అని ఫడ్నవిస్ విలేకరులతో అన్నారు. రాష్ట్రాన్ని బాగా తెలిసిన, మహారాష్ట్రలోని సమస్యలపై లోతైన అవగాహన ఉన్న ప్రజా నాయకుడిగా పవార్‌ను ఆయన అభివర్ణించారు. అటువంటి నాయకత్వాన్ని నిర్మించడానికి, స్థాపించడానికి చాలా సంవత్సరాలు పడుతుందని ఆయన అన్నారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కూడా తన సహచరుడి మరణాన్ని విచారకరంగా, దురదృష్టకరమని అభివర్ణించారు. విమాన ప్రమాదంపై దర్యాప్తు చేపడతామని చెప్పారు. వేరే మార్గాన్ని ఎంచుకుని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో చేరినప్పటికీ, అజిత్ పవార్ తమ సంబంధాన్ని తెంచుకోలేదని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే అన్నారు. తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ సిఎం కెసిఆర్‌లు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా, ఎన్‌సిపి (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ బారామతి విమానాశ్రయాన్ని, అజిత్ పవార్ మృతదేహాన్ని ప్రమాదం జరిగిన ప్రదేశం నుండి తీసుకెళ్లిన వైద్య కళాశాలను కూడా సందర్శించారు.

## ఐక్యంగా ఉండాలి
(మొదటి పేజీ తరువాయి)

ఐక్యంగా వ్యవహరించాలని, అలా ఐక్యంగా ఉండటమే రాజ్యాంగ స్ఫూర్తి అని పిలుపు ఇచ్చారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో మోదీ ప్రభుత్వం తెచ్చిన విబి–జీ–రామ్ జీ పథకాన్ని వెనక్కు మళ్ళించాలని, గాంధీ పేరిట ఉన్న పథకాన్ని పునరుద్ధరించాలని ప్రతిపక్షాలు పెద్దపెట్టున నినాదాలు చేయడంతో రాష్ట్రపతి తన ప్రసంగ ప్రవాహంలో కొద్ది విరామం తీసుకుని తిరిగి ప్రారంభించారు. అదే సమయంలో అధికారపక్ష ఎంపీలు బల్లలు చరుస్తూ, విబి–జీ–రామ్ జీ పథకానికి మద్దతు పలికారు. తమ ప్రభుత్వం దేశంలో సంస్కరణలను వేగంగా ముందుకు తీసుకువెళుతుందని రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రకటిస్తూ, 2047వ సంవత్సరం నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం తీసుకుంటున్న వివిధ ఆర్థిక,సామాజిక చర్యలు,పథకాలను ఏకరువు పెట్టారు. యూరోపియన్ యూనియన్ నాయకులతో కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఢిల్లీలో చేసుకున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాన్ని రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. దేశంలో సామాజిక న్యాయానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గడచిన పదేళ్ళలో పాతిక కోట్లమంది ప్రజలను పేదరికం నుండి బయటకు తెచ్చామని, అవినీతి, అక్రమాలను అరికట్టడంతో ప్రభుత్వం విజయవంతమైన చర్యలు తీసుకుందని, ప్రభుత్వ నిధులను సక్రమంగా ఖర్చు చేసేందుకు చర్యలు తీసుకుందని, ఈ 21వ శతాబ్దం మొదటి పాతిక సంవత్సరాలను దేశం అనేక విజయాలతో పూర్తిచేసిందని, ఘనమైన విజయాలు సాధించి, అసాధారణమైన అనుభవాలను కూడగట్టుకుందని ద్రౌపదీముర్ము చెప్పుకొచ్చారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని కేంద్ర ప్రభుత్వమే తయారు చేసి ఇస్తుంది. ఆ ప్రసంగాన్ని చదివే బాధ్యతను మాత్రమే రాష్ట్రపతి నిర్వహిస్తారు. విబి–జీ–రామ్ జీ పథకం కింద గ్రామీణ కార్మికులకు 125 పని దినాల భద్రత కల్పించేందుకు తమ ప్రభుత్వం చొరవ తీసుకుందని, ఈ పథకంలో అవినీతిని, లోపాలను అరికడుతుందని, గ్రామీణాభివృద్ధికి కొత్త ప్రోత్సాహాన్ని ఇస్తుందని చెప్పారు. ప్రతిపక్షాల ఎంపీలు ప్రభుత్వ గొప్పల పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. అదే సమయంలో అధికార పార్టీ ఎంపీలు బల్లలు చరుస్తూ మద్దతు తెలియజేశారు. ఈ పరిస్థితి మధ్య రాష్ట్రపతి ఒక్కనిమిషం ప్రసంగం ఆపేసి తిరిగి ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికుల పరాక్రమాన్ని, అంతర్జాతీయ అంతరిక్షకేంద్రం లో మొదటిసారి అడుగుపెట్టిన భారత వ్యోమగామి శుభాంషు శుక్లా సాధించిన చరిత్రాత్మక విజయాలను ఎంతగానో ప్రశంసించారు.

**ఎన్నికలు జరిగే రాష్ట్రాల దేశనేతలకు ప్రాధాన్యత**

ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, దేశ నాయకుల పేర్లు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ప్రసంగంలో ప్రముఖంగా చోటు చేసుకున్నాయి. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి సంయుక్త సమావేశంలో పార్లమెంటు సభ్యులను ఉద్దేశించి 62 నిమిషాలు ప్రసంగించారు. తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో తిరువళ్ళువర్ పేరును, తమిళనాట అత్యంత పురాతనమైన 2000 సంవత్సరాల క్రితంనాటి తిరుక్కురళ్ గ్రంథ ప్రాశస్త్యాన్ని ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. అదేవిధంగా ఈశాన్య ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి చర్యలను ప్రముఖంగా చెప్పారు. అసోంలోని ప్రముఖ నాయకుడు భూపేన్ హాజారికాపేరును ప్రస్తావించారు. 2019లో మోదీ ప్రభుత్వం ఆయనకు భారతరత్న ప్రదానం చేసింది. కేరళలోని ప్రముఖ తత్వవేత్త, ఆధ్యాత్మిక నాయకుడు, సాంఘిక సంస్కర్త శ్రీ నారాయణ గురు (1856–1928) పేరును ము ఖ్యం గా ప్రస్తావించారు. కేరళ రాష్ట్ర అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరగనున్నా యి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం,పుదుచ్చేరి రా ష్ట్రాలు రాబోయే నెలల్లో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్ళనున్నాయి. సిక్కుల తొమ్మిదవ గురువు గురు తేజ్ బహదూర్ 350వ ఆత్మార్పణ వార్షిక సంవత్సరం సందర్భంగా ఆయన పేరు ప్రముఖంగా ప్రస్తావించారు.

## రాష్ట్రపతి ప్రసంగం సత్యదూరం : సిపిఐ

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసినది సత్యదూరంఊకదంపుడు ప్రసంగమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్యానించారు. ఆధారాలు లేకుండా... ప్రగల్భాలకే పరిమితమన్నారు. 25 కోట్ల మందిని పేదరికంలో నుంచి బయటకు తెచ్చినట్లు ప్రభుత్వం చెప్పుకుంటున్నాగానీ 80 కోట్ల మంది ఉచిత రేషన్‌పై ఆధారపడే పరిస్థితి కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. పేదరికం నిర్మూలన మాటల్లో తప్ప చేతల్లో లేదని ఎక్స్ మాధ్యమంగా దుయ్యబట్టారు. ఆహార ధాన్యాలు కొనలేని వాస్తవిక పరిస్థితిని డి.రాజా గుర్తుచేశారు. దేశంలో పెరిగిపోయిన నిరుద్యోగం... యువతకు ఉపాధి/ఉద్యోగావకాశాలు కొరవడటం గురించి పాలకులకు పట్టడం లేదన్నారు. దేశంలోని వాస్తవ పరిస్థితులు, సంక్షోభాలను రాష్ట్రపతి ప్రసంగం విస్మరించిందని అన్నారు. మణిపూర్‌లో ఆగని హింస, జమ్మూకశ్మీర్‌లో నెలకొనని సామాన్య పరిస్థితులు, రూపాయి మారక విలువ క్రమంగా పడిపోతుండటం, ఎర్ర కోట సమీపంలో ఉగ్ర దాడి, కేరళ సహా ఇతర రాష్ట్రాలను వ్యూహాత్మకంగా ఆర్థికపరంగా ఒత్తిడికి గురిచేయడం వంటి అంశాల ప్రస్తావన కూడా రాష్ట్రపతి ప్రసంగంలో లేదని రాజా వెల్లడించారు. అలాగే మహిళలు, పిల్లలపై పెరుగుతున్న హింసపై, నిత్యజీవితాన్ని ప్రభావితం చేసే స్థాయికి పెరిగిన అభద్రతాభావంపై మౌనం మరింత ఆందోళన కలిగిస్తున్నట్లు తెలిపారు. మౌనం... జవాబుదారీతనానికి ప్రత్యామ్నాయంగా మారిందా అంటూ రాజా వ్యాఖ్యానించారు. రాష్ట్రపతికి ఉన్న అత్యున్నత రాజ్యాంగబద్ధ హోదాను మోదీ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చే కవచంగా వాడుతున్నారన్నారు. పాత నినాదాలను కొత్తగా ఇస్తూ సమాజాన్ని భయానక విభజనీకరణలోకి నెట్టే మాధ్యమంగా పార్లమెంటు మారిపోకూడదని నొక్కిచెప్పారు. నిజం తెలుసుకోవడం భారతీయులు హక్కు, మెప్పులు వార్షిక కసరత్తులు కావు అని డి.రాజా అన్నారు.

**ఊకదంపుడు ప్రసంగం: సందోశ్ కుమార్**

రాష్ట్రపతి ముర్ము చేసినది ఊకదంపుడు ప్రసంగమని సిపిఐ ఎంపి పి.సందోశ్ కుమార్ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. చెప్పిందే చెప్పుకోవడం మోదీ ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని దుయ్యబట్టారు. వాస్తవాలు... జవాబుదారీతనం... విశ్వసనీయత లేకుండా గొప్పలకే పరిమితమయ్యేలా రాష్ట్రపతి ప్రసంగం ఉండటం ఆందోళనకరమన్నారు. పేదరికం నిర్మూలన ప్రకటనలకే పరిమితమని, ఆహార ధాన్యాలు కొనలేని పరిస్థితులు ఉన్నప్పుడు పేదరికాన్ని తగ్గించినట్టా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు, ప్రత్యేకించి కేరళపై తీవ్ర ఆర్థిక వివక్ష గురించి రాష్ట్రపతి ప్రస్తావించనే లేదన్నారు. ఉద్దేశపూర్వకంగా రాష్ట్రాల రాజ్యాంగబద్ధ హక్కులను నిరాకరిస్తూ, వాటిపై ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరి సహకార సమాఖ్యవాదంపై దాడికి దారితీస్తున్నట్లు సందోశ్ కుమార్ తెలిపారు.

## నకిలీ బ్యాంక్ గ్యారంటీతో
# రూ.2కోట్ల మోసం

### అదానీ గ్రూప్ అనుబంధ సంస్థకు షాక్
### పంజాగుట్ట పోలీసుల కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నకిలీ బ్యాంక్ గ్యారంటీ చూపించి అదానీ గ్రూప్‌కు చెందిన సిమెంట్ సంస్థ ఎసిసి లిమిటెడ్ ను దాదాపు రూ.2 కోట్ల మేర మోసం చేసిన ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఈ ఘటనలో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్తపై చీటింగ్, ఫోర్జరీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎసిసి ప్రాంతీయ సేల్స్ మేనేజర్ చెన్నబసవ భూమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు, జెపి ఇన్‌ఫ్రా అండ్ ఇంజినీరింగ్ సంస్థ యజమాని జయప్రకాశ్ ఇనాన్‌పర్తి, అతని సహచరుడు పి. మన్మోహన్ కలిసి కంపెనీని మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు.బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2022 ఫిబ్రవరిలో నిందితులు హైదరాబాద్‌లోని ఎసిసి ప్రాంతీయ కార్యాలయాన్ని సంప్రదించి, పలు నిర్మాణ ప్రాజెక్టులకు సిమెంట్ సరఫరా చేయాలని కోరారు. ఇరువురి మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం, సిమెంట్ సరఫరాకు ముందుగా రూ.2 కోట్ల బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాల్సి ఉండగా, నిందితులు ఆ మేరకు పత్రాలు సమర్పించారు. అయితే, వారు అందించిన బ్యాంక్ గ్యారంటీ పశ్చిమ బెంగాల్ లోని హూగ్లీ జిల్లా – మండ్రా ప్రాంతంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్ పేరుతో నకిలీగా తయారు చేసినదిగా తేలింది. ఆ డాక్యుమెంట్ నిజమైనదిగా నమ్మిన ఎసిసి సంస్థ, 2022–23 మధ్యకాలంలో ఏడు పర్చేజ్ ఆర్డర్ల ద్వారా రూ.2 కోట్లకు పైగా విలువైన సిమెంట్‌ను సరఫరా చేసింది. తరువాత బ్యాంక్ గ్యారంటీ నకిలీదని గుర్తించడంతో సంస్థ మోసపోయిన విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, ప్రధాన నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

## రాష్ట్ర ఎక్సైజ్ శాఖలో మరో కుంభకోణానికి తెరలేచింది

### బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ఎక్సైజ్ శాఖలో మరో కుంభకోణానికి తెరలేచిందని, మైక్రో బ్రెవరేజ్‌ను దక్కించుకునేందుకు 110 దరఖాస్తులు వస్తే, ఇందులో 25 దరఖాస్తుల టెండర్లను ముఖ్యనేతకు, మంత్రికి ఇచ్చేందుకు సిద్ధమయ్యారని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ముఖ్యనేత కోటా కింద 21 టెండర్లను ఇచ్చేందుకు సిద్ధమయ్యారని, మిగిలిన నాలుగు మంత్రి కోటా కింద కేటాయించారన్నారు. ఒక్కొక్క బ్రెవరేజ్ వద్ద అనధికారికంగా రూ.1 కోటి 80 లక్షలు తీసుకునేలా ఒప్పందం చేసుకున్నారని, ఇందులో ఒక కోటి 50 లక్షల రూపాయలు ముఖ్య నేతకు వెళ్తాయని, మరో రూ.30 లక్షలు తోడుగా ఉన్న వ్యక్తికి వెళ్తాయని అన్నారు. వైన్స్ షాపుల లక్కీ డ్రాలో తీయకుండానే కొందరికి టెండర్లు వచ్చాయన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా లిక్కర్ సరఫరా చేసే సంస్థలకు రూ.4500 కోట్లు బకాయిలు పెండింగ్ లో పెట్టారని, 16 నెలల నుంచి సరఫరా చేసే కంపెనీలకు డబ్బులు చెల్లించడం లేదని, తద్వారా బ్రీజర్ సరఫరా రాష్ట్రంలో ఆగిపోయిందని, చాలా షాపుల్లో బ్రీజర్ సరఫరా ఆగిపోయిందని ఆరోపించారు.

# రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలు

### రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను పూర్తిగా పారదర్శకంగా అవినీతి రహితంగా ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక సంస్కరణలు అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబందాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయా కాంప్లెక్స్‌కు రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ,సమాచార పౌర సంబందాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యవంతంగా అత్యాధునిక సదుపాయాలతో కార్పొరేట్ స్థాయి ప్రమాణాలతో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా నిర్మిస్తున్నామన్నారు. మొదటి విడతగా ఔటర్ రింగ్ రోడ్ పరిధి లోపల ఉన్న 39 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఇంటిగ్రేటెడ్ కార్యాలయములో 11 కస్టర్లుగా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్ణయించామని తెలిపారు. ఇందులో భాగంగా నేడు సంగారెడ్డి జిల్లా కర్దనూర్ లో శంకుస్థాపన చేయడం జరిగిందిని తెలిపారు. దీనికి సుమారు మూడు ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందన్నారు. 20వేల ఎస్ఎఫ్టీలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం బారం పడకుండా ప్రైవేటు బాగస్వామ్య విధానంలో రాజ్ పుష్ప ఇన్‌ప్రాక్చర్ ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు నిర్మాణ బాద్యతలు అప్పగించినట్లు తెలిపారు. రాబోయే ఆరు నెలల్లో ఆధునాతన హంగులతో భవన నిర్మాణం పూర్తి చేయాలని సూచించినట్లు చెప్పారు. అలాగే కనీసం ఐదేళ్ల పాటు ఆయా భవనాల నిర్వహణ బ్యాదత కూడా నిర్మాణ సంస్థలదే ఉండేలా నిబంధనలు పొందుపరచామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో కొత్తగా పెళ్లి రిజిస్ట్రేషన్ కు వచ్చే జంటలకు చిన్న పిల్లలతో వచ్చే తల్లులకు ,దివ్యాంగుకు వయోవృద్ధులకు పేద ప్రజలకు అవసరమైన అన్ని ఆదునాతన హంగులతో ఫైవ్ స్టార్ వసతులతో భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా సామాన్య ప్రజలకు అందుబాటులో తేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో అన్ని సబ్‌రిజిస్టర్ కార్యాలయాలకు శంకుస్థాపనలు చేసి పూర్తి హంగులతో భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.
మంత్రి గడ్డం వెంకటేశం స్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి పటాన్‌చెరు పారిశ్రామిక హబ్‌గా మారిందని చెప్పారు. ముఖ్యమంత్రి దావోస్ పార్యటనలో తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా 3ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాదించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. దేశాన్ని ప్రపంచంలో మూడో స్థానానికి తీసుకు రావాలంటే భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణ తీర్చి దిద్దాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా ఆ సమస్యలకు పరిష్కారం లబిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్లు అండ్ స్టాంప్స్ శాఖ కమీషన్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం సుమారు రూ14,500 కోట్ల ఆదాయం సమకూరుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాశ్‌రెడి ,తెలంగాణ రాష్ట్ర పుడ్ కార్పోరేషన్ చైర్మన్ ఫయూామ్ జిల్లా రిజిస్టార్ సబ్ రిజిస్ట్రార్లు, ఆర్డీఓ జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారి రాజపుష్ప ,ఇంపాస్ట్రక్చ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అధికారులు సంబందిత శాఖల అధికారులు డాక్యుమెంట్ రైటర్లు ప్రజాప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఐద్వా జాతీయ అధ్యక్షురాలిగా పి.కె.శ్రీమతి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ అధ్యక్షురాలుగా పి.కె. శ్రీమతి మరోసారి ఎన్నికవ్వగా, ప్రధాన కార్యదర్శిగా కనినికా బోస్ ఘోష్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో బుధవారం నాడు ఐద్వా 14వ జాతీయ మహాసభలు ముగిశాయి. మహాసభలో 109 మంది సభ్యులతో కొత్త కేంద్ర కార్యనిర్వాహక కమిటీ(సిఇసి) ఎన్నికైంది. కోశాధికారిగా తపసి ప్రహరాజ్, ప్ర్యాట్రన్స్‌గా బృందా కారాత్, బనాని బిస్వాస్, రేఖాగోస్వామి, మాలిని భట్టాచార్య,రమాదాస్‌లను ఎన్నుకున్నారు. ఐద్వా జాతీయ కార్యదర్శులలో ఒకరిగా తెలంగాణకు చెందిన మల్లు లక్ష్మి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా మీడియాతో పి.కె.శ్రీమతి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు, తమ పిల్లలకు మరింత మెరుగైన జీవితాన్ని అందించేందుకు మహిళలు తమ హక్కుల కోసం మరింత గళం విప్పాలని పిలుపునిచ్చారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం లింగ సమానత్వ దృక్పథంతో ముందుకు సాగుతోందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో మనుస్మృతిని అనుసరించే శక్తులు మహిళల జీవించే హక్కును లాక్కుంటున్నాయని విమర్శించారు.కనినిక ఘోష్ బోస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు చివరి వరకు పోరాడుతామన్నారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేదలు, దళితులు, ఆదివాసీలు, అణగారిన వర్గాల హక్కులను హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారానికి ఐద్వా నిరంతరం పోరాడుతుందన్నారు. ఐద్వా మహాసభల విజయవంతమయ్యాయని, ఇందుకు సహకరించిన వారికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.
**నూతన కమిటీ :** ఐద్వా అధ్యక్షురాలుగా పి.కె. శ్రీమతి , ప్రధాన కార్యదర్శిగా కనినికా బోస్ ఘోష్, కోశాధికారిగా తపసి ప్రహరాజ్. ఉపాధ్యక్షులుగా సుభాషిని అలీ, మరియం దావ్‌లే, ఎస్.పుణ్యవతి, యు. వాసుకి, సుధా సుందరరామన్, జహనర ఖాన్, కె.కె.శైలజ, సతిదేవి, సుసన్ కొడి, పి.కె. జయినబ, కిర్తి సింఘ్, రాంపారి, డిబొలినా హెంబ్రమ్ ,జగమతి సంగ్వన్, మదుగర్గ్, బృందా దేవ్‌వర్మ, ప్రమీల, సలేఖ, కార్యదర్శులుగా కృష్ణరక్షిత్, సి.ఎస్.సుజాత, ఎన్.సుఖన్య, ఆషాశర్మ, ప్రచి హతివ్‌లేకర్, టిఎన్.సీమ, మల్లు లక్ష్మి , మొనలిసా సిన్హా, ఎ.రాధిక, స్వప్నదత్, సహాయక కార్యదర్శులుగా దేవి, సవిత, అర్చన ప్రసాద్, మేత్రేయి మిశ్ర, వి.సావిత్రి ఎన్నికయ్యారు.

## హెచ్‌సిఎకు భారీ షాక్..

### హెచ్‌సిఎకు చివరి అవకాశం ఇచ్చిన బాంబే హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిసిఐలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) సభ్యత్వ వివాదంపై కీలక పరిణామం చోటు చేసుకుంది. బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బిసిసిఐ) ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)కు బాంబే హైకోర్టు చివరి అవకాశం ఇచ్చింది. ఈ మేరకు మార్చి 9కి ముందే రెండు పక్షాలు తమ తమ అఫిడవిట్లు దాఖలు చేయాలని బాంబే హైకోర్టు బుధవారం ఆదేశించింది. జస్టిస్ భారతి డాంగ్రే, జస్టిస్ మంజూషా ఏ. దేశ్‌పాండే లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ కేసును విచారించింది. బిసిసిఐ జారీ చేసిన దీర్ఘకాలిక ఆదేశాలను అమలు చేయడంలో హెచ్‌సిఎ నిరంతరం విఫలమవుతోందంటూ టిసిఎ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు పరిశీలించింది.టిసిఎ తరఫు న్యాయవాది వివేక్ కాంతవాలా వాదనలు వినిపిస్తూ, 2025 మార్చి 21న బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను హెచ్‌సిఎ పూర్తిగా విస్మరించిందని తెలిపారు.

# మేడారం మహాజాతరకు పటిష్ట ఏర్పాట్లు


### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడారంలో బుధవారం నుంచి నిర్వహిస్తున్న సమ్మక్క–సారలమ్మ మహాజాతర సందర్భంగా రాష్ట్ర ప్రజానీకానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.గిరిజనుల ఆరాధ్య దేవతలైన సమ్మక్క–సారలమ్మలు ధైర్యసాహసాలు, త్యాగస్ఫూర్తి, ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందిన మేడారం మహాజాతర తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ వైభవాన్ని ప్రతిభింబించే మహోత్సవమని ఆయన అన్నారు.ఈ పవిత్ర మహోత్సవం సందర్భంగా సమ్మక్క–సారలమ్మల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరి కుటుంబాల్లో ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

# రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### మంత్రుల భేటీపై అనవసర చర్చ
### మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు
### మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఒక ప్రత్యేక ప్రణాళికతో పాలన సాగుతుందని ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు 2047 విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. బుధవారం మధిరలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ మంత్రుల భేటీ గురించి కొందరు ఇష్టానుసారంగా రాస్తున్నారని ఉప ముఖ్యమంత్రినైనా నన్ను కలవక పోతే మిమ్మల్ని కలుస్తారా అని మంత్రుల భేటీపై రాసిన వారిని విక్రమార్క ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో లేనప్పుడు కొన్ని సూచనలు, సలహాలు మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు తదితర అంశాలపై చర్చించేందుకు సమావేశం జరిగిందని అంతే తప్ప మరొకటి కాదని ఆయన స్పష్టం చేశారు.యావత్ రాష్ట్ర మంత్రి వర్గం ఐక్యంగా ఉందని ఒక కుటుంబంలా పనిచేస్తూ ప్యూర్ క్యూర్ రేర్ సమగ్ర విధానంతో 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశామని ఆయన తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ బాధ్యులు ఐక్యంగా పనిచేసి అత్యుత్తమ ఫలితాలను సాధించాలన్నారు. నగరాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశామని తెలిపారు. తెలంగాణ తలరాతను మార్చే విద్యపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్‌లో పోటీ చేసేందుకు ఎక్కువ మంది ఉత్సుకత చూపుతారని వీరంతా ప్రజాదరణ ఉన్న కాంగ్రెస్ ద్వారా సేవ చేయాలని కోరుకుంటున్న వారని ఆయన తెలిపారు. పోటీ పడటం తప్పు కాదని అభ్యర్థుల ఎంపికలో సరైన నిర్ణయం తీసుకోవాలని స్థానిక నేతలకు ఆయన సూచించారు.


## ప్రభుత్వ విద్యా సంస్థల్లో బోధన నాణ్యత ప్రమాణాలు పెంచాలి

### విద్యా శాఖ ఉన్నతాధికారులకు సిఎస్ ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాల స్థాయి వరకు ప్రతి విద్యా సంస్థలో విద్యా బోధన నాణ్యత ప్రమాణాలు పెంచే దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యాశాఖ పై సంబంధిత ఉన్నతాధికారులతో బుధవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, డిజిటల్ విద్య, ఇంటర్మీడియట్, డిగ్రీ కాలేజీల్లో పనితీరు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం, తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఉన్నత విద్యా సంస్థలు, కళాశాలలో, విశ్వ విద్యాలయాలలో పనిచేసి బోధన చేసి రిటైర్ట్ అయిన మంచి అనుభవం కలిగిన ప్రొఫెసర్స్, లెక్చరర్స్, టీచర్స్ తో విద్యార్థులకు తరుచుగా మూఖాముఖి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.
త ద్వారా విద్యార్థుల్లో సృజానాత్మకతతో పాటు మంచి ఆలోచనలు పెరిగి వారు తమ భవిష్యత్ కు సంబంధించి ప్రణాళికలు ఏర్పపర్చుకొనే అవకాశం ఉంటుందని అన్నారు. అదే విధంగా కెజిబివి, వివిధ సంక్షేమ వసతి గృహాలలో ఒక వసతి గృహాన్ని ఎంపిక చేసుకొని అందులో సోలార్ మోడల్ తరహా కిచెన్, స్టోరేజ్ రూమ్స్, మౌలిక వసతులు, త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్, ఇంటర్నెట్ అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి దానిని ఒక మోడల్ హాస్టల్ గా రూపొందించాలని సిఎస్ అధికారులకు సూచించారు. దానిని ఆదర్శంగా తీసుకోని భవిష్యత్ లో మిగితా వసతి గృహాలలో కూడా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. కళాశాలల స్థాయిలో కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలని, బిఇడి కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం క్రింద ప్రభుత్వ పాఠశాలలో బోధన చేయించాలని, విద్యార్థులలో ఆసక్తి, నైపుణ్యాలు పెంచే విధంగా అనుభవం కలిగిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, మార్గదర్శకులతో తరగతులు నిర్వహిస్తే విద్యార్థులకు మంచి ప్రయోజనం కలుగుతుందని అన్నారు.
ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ దేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.


# కోర్టు విచారణకు రావాల్సిందే

### ఇద్దరు ఐఎఎస్‌లకు హైకోర్టు ఆదేశం
### నవీన్ మిట్టల్, సందీప్ కుమార్ ఝాలకు నోటీసులు
### బదిలీ పేరుతో బాధ్యతల నుంచి తప్పించుకోలేరన్న బెంచ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తాము ఆదేశించిన తర్వాత బదిలీ అయ్యామని చెప్పి బాధ్యతల నుంచి తప్పించుకోజాలరని హైకోర్టు చెప్పింది. కోర్టు ఆదేశాలు వెలువడ్డాక అమలు చేయకుండా ఇప్పుడు బదిలీ అయ్యామని, తమకు సంబంధం లేదంటే కుదరదని తేల్చింది. కోర్టు ఆదేశాల్ని ఫైళ్లలో పెట్టేసి బదిలీపై వెళ్లిపోయామంటే ఎలాగని ప్రశ్నించింది. మిడ్‌మానేరు ప్రాజెక్ట్ కోసం పిటిషనర్ నుంచి సేకరించిన భూమికి మూడు నెలలో పరిహారం చెల్లిస్తామని హైకోర్టుకు ఇచ్చిన హామీని అమలు చేయని అప్పటి రెవెన్యూ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్. అప్పటి సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మార్చి 24న వ్యక్తిగతంగా హైకోర్టు విచారణకు హాజరుకావాల్సిందేనని తేల్చి చెప్పింది. విచారణకు స్వయంగా హాజరై వివరణ ఇవ్వాల్సిందేనంది. ఎనిమిది వారాల్లో పరిహారం చెల్లించాలని ఆదేశించింది. మిడ్‌మానేరు ప్రాజెక్టు ముంపునకు గురైన 2.01 ఎకరాల భూమిని అధికారులు 2010లో భూసేకరణ ద్వారా స్వాధీనం చేసుకున్నారు. తనకు పరిహారంగా ఇంటి జాగా, వ్యవసాయేతర భూమి 2783 చదరపు గజాలు ఇవ్వలేదంటూ బి రామవ్వ పిటిషన్ దాఖలు చేశారు. మూడు మాసాల్లో పరిహారం చెల్లిస్తామని అధికారుల హామీని గతంలో హైకోర్టు రికార్డుల్లో నమోదు చేసి పిటిషన్‌పై విచారణను ముగించింది. ఐదు నెలలు అయినా పరిహారం చెల్లించకపోవడంతో రామవ్వ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయడాని జస్టిస్ ఎస్.వి. శ్రవణ్ కుమార్ మంగళవారం విచారించారు. గత విచారణలో ఆదేశించిన మేరకు ఇద్దరు ఐఏఎస్ అధికారులు విచారణకు హాజరుకాకపోవడంతో ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. హాజరీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సీసీఎల్‌ఏ లోకేష్ కుమార్, సిరిసిల్ల కలెక్టర్ గరిమా అగర్వాల్ వేసిన పిటిషన్లను అనుమతించారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ, నవీన్ మిట్టల్, సందీప్ కుమార్ బదిలీ అయ్యారని చెప్పడంపై న్యాయమూర్తి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంపై స్పందించాలన్నారు. పిటిషనర్ న్యాయవాది స్పందిస్తూ, పిటిషనర్‌కు చెందిన స్థలాన్ని 2010లోనే తీసుకున్నారని, ఇది ప్రస్తుతం ముంపునకు గురైందని చెప్పారు. దీనిపై హైకోర్టు, మూడు నెలల్లో పరిహారం చెల్లిస్తామన్న హామీని ఎందుకు అమలు చేయలేదని నిలదీసింది. పిటిషనర్ వయసు 75 ఏండ్లని గుర్తు చేసింది. ఎనిమిది వారాల్లో పరిహారం చెల్లించాలని ఆదేశించింది. హాజరు మినహాయంపు కోరుతూ సీసీఎల్ఏ, కలెక్టర్లు దాఖలు చేసిన పిటిషన్లను అనుమతించింది. ఆర్డీవో విచారణకు హాజరయ్యారు. నవీన్ మిట్టల్, సందీప్ కుమార్ మార్చి 24న జరిగే విచారణకు స్వయంగా హాజరుకావాల్సిందేనని తేల్చి చెప్పింది.

## ‘తెలంగాణ రైజింగ్- 2047’కు సహకరించండి : సిఎం రేవంత్‌రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హార్వర్డ్ విశ్వవిద్యాలయ ఉప వైస్ ప్రొవొస్ట్ అధిపతి ప్రొఫెసర్ డస్టిన్ టింగ్‌లే, హార్వర్డ్ కెన్నెడీ డీన్ ప్రొఫెసర్ జెరెమీ వెయిన్‌స్టిన్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ‘తెలంగాణ రైజింగ్ 2047ను’ వివరించారు. రైజింగ్‌కు సహకారం అందించాలని ఆయన వారిని కోరగా, ఆ ఇద్దరు ప్రొఫెసర్లు సానుకూలంగా స్పందించారు. అలాగే విస్తృత స్థాయిలో విద్యా నాణ్యతను మెరుగుపరచేందుకు అవసరమైన వివిధ విద్యా రూపకల్పన, విధానాలు, ఆధునిక నైపుణ్యాభివృద్ధి, మానవ వనరుల అభివృద్ధి, ఆర్థిక వృద్ధిపై చూపే ప్రభావం తదితర అంశాలపైన కూడా చర్చించారు.

## సినిమా టిక్కెట్ ధరల పెంపు వివాదం సింగిల్ జడ్జి వద్ద తేల్చుకోండి

### షైన్‌స్క్రీన్ అప్పీలుపై హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సినిమా టిక్కెట్ ధరల పెంపు వ్యవహారంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యానికి హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. ఈ వ్యవహారంపై పిటిషన్ ఇంకా సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉందని గుర్తుచేసింది. కాబట్టి ఈ వ్యవహారాన్ని అక్కడే తేల్చుకోవాలంది. ‘మన శంకర వరప్రసాద్’ ‘రాజాసాబ్’ సినిమా టిక్కెట్ ధరలను పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ న్యాయవాది చంద్రబాబు వేసిన పిటిషన్‌లో సింగిల్ జడ్జి టిక్కెట్ ధరల పెంపు మెమోను రద్దు చేశారు. ఒకవేళ టిక్కెట్ల రేట్లను పెంపు నిర్ణయం తీసుకుంటే తీసుకుంటే 90 రోజుల ముందుగా తీసుకోవాలని ఆదేశించారు. ఈ మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ షైన్ స్క్రీన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎల్ఎల్‌పీ అప్పీల్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిని చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదిస్తూ, టిక్కెట్ ధరల పెంపును సవాల్ చేస్తూ ఒక వ్యక్తి వేసిన పిటిషన్‌లో సింగిల్ జడ్జి ప్రజాహిత వ్యాజ్యంలో మాదిరిగా ఆదేశాలిచ్చారని చెప్పారు. దీనిపై హైకోర్టు ప్రస్తుతం టిక్కెట్ ధరల పెంపునకు సంబంధించిన పిటిషన్‌లు సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉన్నందున ఈ వివాదాన్ని అక్కడే తేల్చుకోవాలంది. ఇప్పటికే విడుదలైన ‘మన శంకర వరప్రసాద్’ సినిమాపై మధ్యంతర ఉత్తర్వుల ప్రభావం ఏమీ లేదని గుర్తుచేసింది. ఈ పిటిషన్‌లపై సింగిల్ జడ్జి వీలైనంత త్వరగా తేల్చాలని సూచన చేసింది. అప్పీలుపై విచారణను మూసివేసింది.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-49, ఎస్ఎల్‌పి జోన్ : జిహెచ్ఎంసి.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No.47/EE/CIR-49/SLPZ/GHMC/2025-26 తేది: 27.01.2026
**పని కేటగిరి:** బిటి ప్యాచెస్ పనులు, **అంచనా విలువ:** రూ.47.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 29.01.2026న మ. 03.00గం.ల నుండి 05.02.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఇఇ, సర్కిల్-49, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి. సెల్: 9000115410.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-49, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 14543-PP/CL/ADVT/1/2025-26, Date: 27-01-2026

**తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్**
జిల్లా మేనేజర్ కార్యాలయము :: మంచిర్యాల
టెండరు ప్రకటన (స్టేజ్ - II)
లేఖ నం: PDS/Stage-II/Tenders/2026-28 తేది: 27.01.2026
తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, జిల్లా కార్యాలయము, మంచిర్యాల వారు మండల స్థాయి గోదాముల నుండి సంబంధిత మండలములలో గల చౌక ధరల దుకాణములకు బియ్యం మరియు ఇతర నిత్యావసర సరుకులు రవాణా చేయుటకు, MDM బియ్యం స్కూల్ పాయింట్ వద్దకు మరియు ICDS బియ్యం అంగన్వాడీ కేంద్రాల వరకు 2026-2028 సంవత్సరమునకు అనగా 01-04-2026 నుండి 31-03-2028 వరకు గాను ఫ్లాట్ రేట్ ప్రకారము (క్వింటాలు ఒక్కంటికి దూరంతో సంబంధం లేకుండా) ఈ దిగువ తెలుపబడిన అన్ని MLS POINTSకు టెండర్లు కోరుచున్నారు. **మండల స్థాయి గోదాములు: 1. మంచిర్యాల, 2. లక్షెట్టిపేట, 3. బెల్లంపల్లి, 4. తాండూర్, 5. చెన్నూర్, 6. కోటపల్లి** ఆసక్తి గలవారు, టెండరు ఫారములు (బదిలీకి వీలులేని) మరియు నియమ నిభంధనల కొరకు రూ.20,000/-(తిరిగి చెల్లించబడనివి) చొప్పున District Manager, TSCSCL Mancherial గారి పేరు మీద D.D చెల్లించి **eprocurement.telangana.gov.in** లో రిజిస్టర్ చేయించుకుని డౌన్‌లోడ్ చేసుకోగలరు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ కోసం ప్రారంభ తేది : 28.01.2026, 11.30 AM. ఆన్‌లైన్‌లో టెండర్ సమర్పణకు చివరి తేదీ: 06.02.2026, 05:00 PM. టెండరు ప్రతులు జిల్లా కార్యాలయాలో సమర్పణకు చివరి తేదీ: 07.02.2026, 05.00PM, ప్రీ బిడ్ మీటింగ్ 30.01.2026 11.00 AM.
సంప్రదింపు వివరములు : 7995050719
సం/- అదనపు కలెక్టర్ మరియు అధికార రీత్యా కార్యనిర్వహణ అధికారి
తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్, మంచిర్యాల
DIPR R.O. No. : 14550-PP/CL/ADVT/1/2025-26, Date: 27-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

| ఐటమ్ నెం. | పని పేరు | అమౌంట్ (రూ. లక్షలలో) | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది | అధికారి పేరు & చిరునామా సెల్ నెం. |
|---|---|---|---|---|
| 1 | 2026-27 సంవత్సరానికి జిహెచ్ఎంసి, ఆదిభట్ల సర్కిల్-15, తొర్రూర్, 53వ వార్డులోని వర్షపు నీటి కాలువలు, డ్రెయిన్లు మరియు కుంట కాలువల్లో పూడికతీత పనులు. | 79.00 | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 28.01.2026న మ.3.00గం.లకు, డౌన్‌లోడ్ ఆఖరి తేది: 03.02.2026న మ.3.00గం.ల వరకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 03.02.2026న మ.3.00గం.ల వరకు, బిడ్స్ ప్రారంభ తేది: 03.02.2026న మ.3.30గం.ల నుండి. | శ్రీ డి. కిష్టప్ప, సూపరింటెండింగ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, హైదరాబాద్. 9849906776 |
| 2 | 2026 సంవత్సరానికి జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్, బడంగ్‌పేట్ సర్కిల్ 16, నాదర్‌గుల్, 57వ డివిజన్‌లోని వివిధ కాలువల్లో వర్షపు నీటి కాలువల వార్షిక పూడికతీత మరియు నిర్వహణ పనులు. | 63.00 | | |
| 3 | 2026 సంవత్సరానికి జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్, బడంగ్‌పేట్ సర్కిల్ 16, బడంగ్‌పేట్, 61వ డివిజన్‌లోని వివిధ కాలువల్లో వర్షపు నీటి కాలువల వార్షిక పూడికతీత మరియు నిర్వహణ పనులు. | 55.00 | | |
| | మొత్తం | 197.00 | | |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శంషాబాద్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 14598-PP/CL/ADVT/1/2025-26, Date: 28-01-2026



## పకడ్బందీగా ఎన్నికలు : కలెక్టర్

**ప్రజాపక్షం/హాలియా:** మున్సిపాలిటీలలో జరగనున్న ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ హాలియా మున్సిపాలిటీలోని మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను, నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆయన హెల్ప్ డెస్క్‌ను,రిటర్నింగ్ అధికారి గదిని పరిశీలించారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులకు నామినేషన్ల స్వీకరణ,ఓట్ల లెక్కింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. నామినేషన్ల సందర్భంగా వీడియోగ్రఫీ చేయించాలని ఎప్పటికప్పుడు టీ పోల్లో అప్లోడ్ చేయాలన్నారు.హాలియా మున్సిపాలిటీలో ఉన్న 12 వార్డులలో రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు.ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, హాలియా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐని గెలిపిద్దాం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/కోదాడ:** పేదల పక్షాన పోరాడే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ని మున్సిపల్ ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ కార్యాలయంలో కోదాడ పట్టణ, రూరల్ కమిటిల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పోత్తుతో 6 వార్డులలో పోటీ చేయడానికి సిపిఐ సిద్దంగా ఉందని వారు అన్నారు. కాంగ్రెస్‌తో కలిపి పోటీ చేయాలని సమావేశంలో నిర్ణయించడమైనది, పొత్తుల వ్యవహారం వచ్చినప్పుడు చర్చల ద్వారా కొన్ని స్థానాలు తగ్గించుకుని పోటీ చేయాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు బత్తినేని హనుమంతరావు, ఎస్‌కె లతీఫ్, పయిడిమర్రి వెంకటనారాయణ, అల్వాల్‌పురం సర్పంచ్ పోతురాజు సత్యనారాయణ, బొల్లు ప్రసాద్, కోటినారాయణ, గోపినాయక్, ఉప్పతల శ్రీనివాస్, లింగయ్య, ఎస్‌కె నాగుల్‌మీరా, కోటేశ్వరరావు, రాంబాబు, మోసిన్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో పాఠశాల అభివృద్ధి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో కీలకమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలిశ్రీపాల్ రెడ్డిపేర్కొన్నారు. బుధవారం నకిరేకల్ మండలం నోముల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారంతో నిర్మించిన నూతన ఆడిటోరియంను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలిశ్రీపాల్ రెడ్డి కలిసి నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యాసంస్థలబలోపేతమేసమాజాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని, పూర్వ విద్యార్థుల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఇతర గ్రామాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు.

## నిప్పుల కణికల్లో నీలకంఠుడి నామస్మరణ

చెర్వుగట్టులో అగ్నిగుండాల ఘట్టం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** కొలిచిన వారికి కొంగు బంగారం గా విరాజిల్లుతున్న నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం తెల్లవారుజామున అగ్నిగుండాల ఘటంను ఆలయ అధికారులు,పోలీస్ శాఖ సమన్వయంతో ఘనంగా నిర్వహించారు.బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన స్వామివారి కళ్యాణానంతరం అగ్నిగుండాలకు అంతటి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ అగ్ని గుండాలలో భక్తులు నడిచినచో పాపాలు వైదోలుగునని,అనారోగ్య సమస్యలు తీరునని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అగ్ని గుండాల కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు శివసత్తులు పాల్గొని,ఒకరికొకరు పోటీపడుతూ అగ్ని గుండంలోని నిప్పుల మీద నడుచుకుంటూ వెళ్లడానికి భక్తులు పోటాపోటీపడ్డారు.చెరువుగట్టు ప్రాంతం అంతయు శివనామస్మరణతో మారుమోగింది.
అగ్నిగుండంలోని నిప్పులపై నడిచే భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్తగా డిఎస్పి శివరాం రెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ చర్యలు చేపట్టింది. ఈకార్యక్రమంలో ఆర్‌డిఓ అశోక్ రెడ్డి,ఉత్సవ కమిటీ చైర్మన్ వారాల రమేష్,ఆలయ ప్రధాన అర్చకులు పోతులేటి రామలింగేశ్వర శర్మ,బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి కృష్ణ,ఆలయ కార్యనిర్వాన అధికారి మోహన్ బాబు,ధర్మకర్తలు పాల్గొన్నారు.

## పోచంపల్లిలో 2 నామినేషన్లు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఫిబ్రవరి 11న జరగనున్న రెండవ సాధారణ మున్సిపాలిటీ ఎన్నికలు 2026లో భాగంగా పోచంపల్లి పట్టణ మున్సిపాలిటీ కేంద్రం వినోద మందిరంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల కేంద్రంలో మొదటిరోజు బుధవారం 13 వార్డులకు గాను నామినేషన్లు మొదలయ్యాయి. కౌన్సిలర్ అభ్యర్థులుగా 5వ వార్డు నుండి బిఆర్ఎస్ పార్టీ తరపున బాత్క లింగస్వామి ఒక నామినేషన్, 9వ వార్డు నుండి బిజెపి తరపున వలందాసు మాధవి మొత్తం (02) నామినేషన్లు స్వీకరించినట్లు ఎలక్షన్ అధికారి మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి తెలిపారు.

## నల్లగొండ జిల్లాలో మొదటి రోజు 44 నామినేషన్లు దాఖలు

హాలియాలో నిల్..మిగతా ఆరు మున్సిపాలిటీలలో 44 నామినేషన్లు




**ప్రజాపక్షం/నల్లగొండ :** మున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన మొదటి రోజు ఆయా మున్సిపాలిటీల్లో నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ప్రారంభం రోజే 44 నామినేషన్లు దాఖలు చేశారు. నల్లగొండ జిల్లాలో నకిరేకల్ మినహా మిగతా చిట్యాలలో,చండూరు,దేవరకొండ, హాలియా, నందికొండ, మిర్యాలగూడ మున్సిపాలిటీలు,నల్లగొండ కార్పొరేషన్‌లోని 162 వార్డులకు ఎన్నికలు జరగుతున్నాయి. సందర్భంగా మొదటి రోజు బుధవారం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా గాను వివిధ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు 44 నామినేషన్లు దాఖలు చేశారు. నల్లగొండ కార్పొరేషన్‌లో48 డివిజన్లకు గాను 11,మిర్యాలగూడలో48 వార్డులకు గాను 4,దేవరకొండలో 20 వార్డులకు గాను 10, నందికొండలో 12 వార్డులకు గాను 6, చిట్యాలలో 12 వార్డుకు గాను 9,చండూరులో 10 వార్డులకు గాను 4 నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ వెల్లడించారు. అదేవిధంగా హాలియాలో 12 వార్డులకు గాను మొదటి రోజు నామినేషన్లు ఎవరు దాఖలు చేయలేదని అధికారులు వివరించారు. మొదటి రోజు నామినేషన్లు ప్రశాంతంగా దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఇందులో కాంగ్రెస్ నుంచి 14,బిజెపి నుంచి 9,బిఆర్ఎస్ నుంచి16,స్వసంత్రలు అభ్యర్థులు 3నామినేషన్లు దాఖలు.

**మొదటి రోజు 10 నామినేషన్లు దాఖలు**

**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ మునిసిపాలిటీ ఎన్నికల్లో భాగంగా మొదటి రోజు 10 నామినేషన్లు దాఖలైనట్లు దేవరకొండ మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్ బుధవారం తెలిపారు. మొదటి రోజు పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల పర్వాన్ని ఏర్పాట్లను దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, తహశీల్దార్ మధుసూధన్‌రెడ్డిలు పరిశీలించారు.

## సూర్యాపేటలో ఐదు మున్సిపాలిటీలలో 24 నామినేషన్ల దాఖలు

సూర్యాపేటలో 13, తిరుమలగిరిలో 9, కోదాడలో 1, నేరేడుచర్లలో 1...

హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో నిల్...



**ప్రజాపక్షం/సూర్యాపేట:** మున్సిపల్ ఎన్నికల్లో బుధవారం నామినేషన్ దాఖలు షురూ అయ్యాయి. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో మొదటి రోజు మొత్తం 24 నామినేషన్లు దాఖలు కాగా ఇందులో సూర్యాపేటలో 13, తిరుమలగిరిలో 9, కోదాడలో 1, నేరేడుచర్లలో 1 దాఖలు అయినట్లు అధికారులు అధికారికంగా వెల్లడించారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మున్సిపాలిటీలో 48 వార్డులకు గాను 13 మంది నామినేషన్లు దాఖలు చేయగా, ఇందులో కాంగ్రెస్ పార్టీ నుండి 5, బిఆర్ఎస్ నుండి 4, బిఎస్‌పి నుండి 2, స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. కోదాడ మున్సిపాలిటీలో మొత్తం 35 వార్డులు ఉండగా ఒక్క నామినేషన్ దాఖలైంది. ఇది కూడా స్వతంత్ర అభ్యర్థి దాఖలు చేశారు. తిరుమలగిరి మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉండగా 9 నామినేషన్లు దాఖలు కాగా బిజెపి నుండి 4, కాంగ్రెస్ 3, బిఆర్ఎస్ 1, స్వతంత్రులు ఒక్కరు నామినేషన్ వేశారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉండగా ఒక్క నామినేషన్ దాఖలు అయ్యింది, బిఆర్ఎస్ అభ్యర్థి ఈ నామినేషన్ వేయగా, హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో 28 వార్డులు ఉండగా ఎవరూ కూడా నామినేషన్ దాఖలు చేయలేదు.

**భువనగిరి మున్సిపాలిటీలో 5 నామినేషన్లు దాఖలు**

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మున్సిపాలిటీలో మొదటి రోజు నాలుగు నామినేషన్లు దాఖలు చేశారు. దాఖలు చేసిన వాటిలో వార్డు నెంబర్ 13కు బిజెపి ఒక సెట్ నామినేషన్ దాఖలు, 13వ వార్డుకు కాంగ్రెస్ నుం చి ఒక సెట్ నామినేషన్, వార్డు నెంబర్ 11లో టిఆర్ఎస్ నుంచి రెండు నామినేషన్లు దాఖలు, వార్డు నెంబర్ 4కు ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. వార్డు నెంబర్ 28కి ఒక సెట్టు నామినేషన్‌లు దాఖలయ్యాయి.

## గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. మండలంలోని సర్వేపల్లి గ్రామంలో వాటర్ ఫిల్టర్ ప్రారంభించి, సంఘబంధ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో జరుగుతున్న హనుమాన్ దేవాలయం వారోత్సవాలో పాల్గొని ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. కొరటికల్ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసి, గౌడ సంఘ భవనాన్ని ప్రారంభించారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సంఘ బంధ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఉప్పలపహాడ్ గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్, అంగన్వాడి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టి.రేపాకలో గ్రామ సంఘ బంధం కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళల అభివృద్ధి కోసం గ్రామ సంఘ కార్యాలయాల నిర్మాణాలకు ప్రభుత్వం ఎక్కువ నిధులు కేటాయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ లావణ్య, ఎంపీడీవో రాముల నాయక్, సర్పంచ్‌ల పోరం అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, కొరటికల్, పోతిరెడ్డిపల్లి, ఉప్పలపహాడ్, టి.రేపాక సర్పంచ్‌లు కట్టెకోల సుశీల హనుమంతు, నాగుల సత్యనారాయణ యాదవ్, చిన్నం బీరప్ప, బండ శీను, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి ముద్దసాని సిద్ధులు, మాజీ జెడ్పిటిసి నరేందర్ గుప్తా, పిఏసిఎస్ మాజీ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## బోన్లు, డ్రోన్ల సాంకేతికత ద్వారా పులిని గుర్తిస్తున్న అటవీశాఖ

పులి సంచారం, ప్రజా భద్రతపై డిఏస్‌పి అవగాహన

పులిని రిజర్వ్ ఫారెస్టులోకి పంపడానికి ప్రయత్నాలు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** పులి దురదృష్టవశాత్తు మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అడవి నుండి తప్పించుకుని, గత 10 రోజులుగా యాదాద్రి జిల్లాల్లోని తుర్కపల్లి మండలం, యాదగిరిగుట్ట మండల ప్రాంతాల్లో సంచరిస్తోందని యాదగిరిగుట్ట డీఏస్పీ పి.శ్రీనివాస్ నాయుడు తెలిపారు. బుధవారం తుర్కపల్లి మండలంలోని దత్తాయిపల్లి, ఇబ్రహీంపూర్ దయ్యంబండ తండా గ్రామాలకు చెందిన సర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు, గ్రామ పెద్దలతో కలిసి ఇటీవల ఈ ప్రాంతాల్లో సంచరిస్తూ పశువులపై దాడి చేసిన ప్రదేశంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏస్పీ మాట్లాడుతూ అటవీ శాఖ అధికారులు బోనులు, ఎర, డ్రోన్లు ఇతర సాంకేతిక పద్ధతులను ఉపయోగించి పులిని తిరిగి రిజర్వ్ ఫారెస్ట్‌కి పంపడానికి నిరంతర ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. పులి ఏ మనుషులపైనా దాడి చేయదని, కేవలం పశువులపై మాత్రమే దాడి చేస్తుందని, పశువుల మేపు వారు, రైతులు అప్రమత్తంగా ఉండాలని,రాత్రి వేళల్లో బయటికి వెళ్లరాదని తెలియజేశారు. వన్యప్రాణి (సంరక్షణ) చట్టం, 1972, పులుల సంరక్షణ నిబంధనల ప్రకారం, ఏ వ్యక్తికీ పులికి హాని చేసే హక్కు లేదని ఆయన వివరించారు. పులి జాతీయ జంతువు కాబట్టి, దానికి ఏ విధమైన హాని కలిగించినా అది జాతీయ స్థాయిలో తీవ్రమైన నేరం అవుతుందని, అందుకు బాధ్యులైన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యా దగిరిగుట్ట రూరల్ సిఐ ఎం.శంకర్, తుర్కపల్లి ఎస్ఐ మహ్మద్ తక్యుద్దీన్, డీఎఫ్ఆర్ఓ, రమేష్ నాయక్, ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, ప్రజాప్రతినిధులు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



## జోనల్ అధికారులు కీలక పాత్ర కీలకం



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మున్సిపల్ ఎన్నికలను జిల్లాలో పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జోనల్ అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన జోనల్ అధికారులు, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, విఎస్‌టి, వ్యయ పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి జోన్ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లపై జోనల్ అధికారులు నేరుగా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, సిబ్బంది నియామకం, ఓటర్లకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి ఉల్లంఘనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకుని శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత జోనల్ అధికారులపై ఉందన్నారు. పోలింగ్ రోజున ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చూసుకోవాలని, ఫిర్యాదులకు తక్షణ స్పందన అందించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, పెళ్లిళ్లకు సంబంధించి ఆసుపత్రికి వెళ్లే వారి విషయంలో ఉదాసీనతతో వ్యవహరించాలని, నగదు, మద్యం పట్టుబడితే వీడియోగ్రఫీ ద్వారా చిత్రీకరించాలన్నారు. శిక్షణ కార్యక్రమానికి ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, వ్యయ పరిశీలకులు నోడల్ అధికారి ప్రవీణ్ కుమార్, మాస్టర్ ట్రైనర్ రమేష్, జోనల్ అధికారులు, ఎఫ్ఎస్‌టి, వ్యయ పరిశీలకులు హాజరయ్యారు.

## ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేస్తాం : ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. బుధవారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల కేంద్రాల వద్ద అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించి బందోబస్తు పర్యవేక్షణ చేసి మీడియాతో మాట్లాడారు. నామినేషన్ కేంద్రాలు పూర్తిగా సిసి కెమెరాల నిఘాలో ఉన్నాయన్నారు. ఎన్నికల నియమావళిలో భాగంగా పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు సద్వినియోగం చేసుకునేలా భద్రత కల్పిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు అమలు చేస్తున్నామని, 100 మీటర్ల పరిధిలో బారికేడింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో గుంపులుగా చేరవద్దన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ప్రతి మున్సిపాలిటి పరిధిలో 2 చెక్‌పోస్టులు, తనిఖీ టీమ్స్ ఉంటాయన్నారు. రూ.50వేలకు మించి తీసుకువెళ్ళవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందస్తుగా రూ.5లక్షల వరకు బైండోవర్ చేస్తున్నామని, బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే పూచీ నగదును జరిమానా కట్టిస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట ఆర్‌డిఓ వేణుమాధవ్, డిఎస్‌పి ప్రసన్న కుమార్, తహశీల్దార్ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, పోలింగ్ నామినేషన్ పరిశీలన అధికారులు ఉన్నారు.

## నామినేషన్ ప్రకియను జెసి తనిఖీ

**ప్రజాపక్షం/దేవరకొండ:** నగర పంచాయతీ ఎన్నికలలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, నల్గొండ రిటర్నింగ్ అధికారి కార్యాలయం ( దేవరకొండ నగర పంచాయతీ)ని ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం తనిఖీలో భాగంగా నామినేషన్ ప్రక్రియ విధానంను రిటర్నింగ్ అధికారులతో చర్చించారు. డిఆర్‌సి రూంలను పరిశీలించారు. తనిఖీలో దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, తహశీల్దార్ మధుసూధన్‌రెడ్డి, కమిషనర్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు రాజకీయ పక్షాలు సహకరించాలి

6 మున్సిపాలిటీలు, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు:జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ :** మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా,సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ పేర్కొన్నారు.బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికలపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు మంగళవారం షెడ్యూల్ జారీ చేసిందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని 6 మున్సిపాలిటీలు, నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని,జిల్లాలో మిర్యాలగూడ, దేవరకొండ, నందికొండ, హాలియా, చిట్యాల, చండూరు మున్సిపాలిటీతో పాటు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కలుపుకొని 3 లక్షల 9 వేల 97 మంది ఓటర్లు ఉన్నారని ,162 వార్డులు, 475 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు కల్పించడం జరిగిందన్నారు. వార్డు సభ్యులకు నిర్వహించే ఎన్నికల నామినేషన్ వేసే జనరల్ అభ్యర్థులు డిపాజిట్ కింద 2500, ఎస్‌సి, ఎస్‌టిలురూ.1550, మున్సిపల్ కార్పొరేషన్‌లో జనరల్ అభ్యర్థులు 5000, ఎస్‌సి, ఎస్‌టి,బీసీలు రూ.2500 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, కార్పొరేషన్ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థి లక్షల 50 వేల వరకు,మున్సిపాలిటీలో పోటీ చేసే అభ్యర్థులు లక్ష రూపాయల వరకు ఎన్నికలలో ఖర్చు చేసేందుకు అనుమతి ఉంటుందని తెలిపారు. పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు నామినేషన్లు ఉప సంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటించే లోపు ఏ,బి ఫారం లు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్‌డిఓ అశోక్ రెడ్డి,పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**మీడియా సెంటర్‌ను ప్రారంభం :** మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా మీడియాకు తక్షణ సమాచారం అందించేందుకు ప్రత్యేక మీడియా సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు.ఎన్నికల ఫిర్యాదులు,సమాచారం స్వీకరణకు నల్లగొండ జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్,జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తో కలిసి మీడియా సెంటర్‌ను ప్రారంభించారు.

## సజావుగా నామినేషన్ల ప్రక్రియ : ఎస్‌పి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్చితంగా అమలు అవుతుందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ పేర్కొన్నారు.జిల్లాలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని,నల్లగొండ మున్సిపల్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని బుధవారం జిల్లా ఎస్‌పి పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో అమలులో ఉన్న ఏర్పాట్లు, అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అనుసరిస్తున్న విధానం, ప్రవేశ నిష్క్రమణ మార్గాలు, క్యూలైన్లు, పోలీస్ బందొబస్త్, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ అభ్యర్థులు వారి ప్రతినిధులు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగాలని అధికారులకు సూచనలు ఇచ్చారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులపై కఠినంగా వ్యవహరించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి,ఎస్‌బి సిఐ రాము,టూటౌన్ ఎస్ఐ సైదులు సిబ్బంది పాల్గొన్నారు.



## బిజెపి అహంకారం సంప్రదాయాలను విచ్ఛిన్నం చేస్తుంది : అఖిలేష్



**లక్నో :** శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి ప్రయాగ్‌రాజ్‌లోని మాఘమేళా నుండి పవిత్ర స్నానం చేయకుండా వెళ్ళిపోవడంపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అధికార బిజెపిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గంగా, యమున, పౌరాణిక సరస్వతి నదుల సంగమంలో పవిత్ర స్నానం చేయకుండా స్థానిక పరిపాలన అడ్డుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధువు జనవరి 18 నుండి శంకరాచార్య శిబిరం వెలుపల తన నిరసనను ముగించి, 'భారమైన హృదయంతో' ఉత్సవ మైదానం నుండి బయలుదేరాడు. దీనిపై ఎక్స్‌లో అఖిలేష్ స్పందిస్తూ బిజెపి 'అహంకారం' అనాది కాలం నుండి కొనసాగుతున్న సంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేసిందని అన్నారు. 'జగద్గురు శంకరాచార్య జీ పవిత్ర భూమి అయిన ప్రయాగ్‌రాజ్‌లో పవిత్ర స్నానం చేయకుండా మాఘమేళా నుండి వెళ్ళిపోవడం చాలా అరిష్ట సంఘటన' అని ఆయన అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మొత్తం సనాతన సమాజం బాధపడటమే కాకుండా భయంతో నిండిపోయింది. ప్రపంచ సనాతన సమాజం తీవ్ర బాధతో, అనిశ్చిత భావనతో నిండి ఉంది అని ఆయన అన్నారు. 'బిజెపి, దాని సహచరులు కోరుకుంటే, వారు అధికార అహంకారాన్ని విడిచిపెట్టి, ఆయనను తమ భుజాలపై మోసుకుని త్రివేణి సంగమంలో ఆయన పవిత్ర స్నానం చేయించి, తద్వారా ఆయన గౌరవాన్ని నిలబెట్టేవారు' అని ఆయన అన్నారు. అవినీతి మార్గాల ద్వారా సంపాదించిన అధికారం గర్వంతో బిజెపి మత్తులో ఉందని, అది దానిని అలా చేయకుండా ఆపుతోందని విమర్శించారు. సాధువులను బాధపెట్టడం ఎప్పటికీ శ్రేయస్సును తీసుకురాదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అన్నారు.

## పార్లమెంట్‌లో 'ఎంజినరేగా, సర్'కు నిరసన

### ధన్య వాద తీర్మానం, కేంద్ర బడ్జెట్‌పై చర్చలో ప్రజాస్వామ్యబద్ధంగా అసమ్మతి వ్యక్తీకరణ

### ఏకాభిప్రాయానికి వచ్చిన ఇండియా కూటమి నేతలు



**న్యూఢిల్లీ:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో 'ఎంజి నరేగా' రద్దు, 'సర్' అంశాలను లేవనెత్తాలని ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం, కేంద్ర బడ్జెట్‌పై చర్చలో పాల్గొంటూ వాటిపై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేయాలని ఏకభిప్రాయానికి వచ్చాయి. ఇండియా కూటమిలోని అనేక ప్రతిపక్ష పార్టీల నాయకులు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే గదిలో సమావేశమై బడ్జెట్ సమావేశానికి ప్రతిపక్ష వ్యూహాన్ని చర్చించారని వర్గాలు తెలిపాయి. ధన్యవాద తీర్మానంపై చర్చ సమయంలో, కేంద్ర బడ్జెట్ సమర్పణ, చర్చ సమయంలో కూడా నాయకులు నిరసన తెలియజేయాలని నిర్ణయించుకున్నారు. 'ఎంజి నరేగా' పునరుద్ధరణను డిమాండ్ చేయడానికి ప్రతిపక్షం అన్ని ప్రజాస్వామ్య మార్గాలను ఉపయోగిస్తుంది' అని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో తెలిపారు. లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగం సందర్భంగా నాయకులు నిరసన వ్యక్తం చేసిన తర్వాత, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రతిపక్షాన్ని విమర్శించారు. ఇది సిగ్గుచేటు అని అన్నారు. 'వందేమాతరం' 150వ వార్షికోత్సవం సందర్భంగా బంకిం చంద్ర చటోపాధ్యాయకు నివాళులు అర్పిస్తుండగా, ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించాయి. దేశం వారి త్యాగాలను గుర్తుంచుకోవాల్సిన సమయంలో సభను అంతరాయం కలిగించాయి' అని ఆయన అన్నారు. కాగా, టిఎంసి, ఆప్ నాయకులు ఖర్గే గదిలో జరగిన సమావేశంలో లేరు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శులు రమేష్, కెసి వేణుగోపాల్, డిఎంకెకు చెందిన టిఆర్ బాలు, శివసేన (యుబిటి)కి చెందిన అరవింద్ సావంత్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన జావేద్ అలీ ఖాన్, ఆర్‌జెడికి చెందిన ప్రేమ్‌చంద్ గుప్తా, సిపిఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్, సిపిఐకి చెందిన పి సందోష్, ఆర్‌ఎస్‌పికి చెందిన ఎన్ కె ప్రేమ్‌చంద్రన్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం మళ్లీ చర్చించడానికి నిరాకరించినప్పటికీ, పార్లమెంటు బడ్జెట్ సమావేశంలో ఎంజి నరేగా, ఎస్ఐఆర్‌కు సంబంధించిన అంశాలను లేవనెత్తాలని కాంగ్రెస్ అగ్ర నాయకులు నిర్ణయించిన ఒక రోజు తర్వాత ఈ విపక్ష సమావేశం జరిగింది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ నివాసంలో మంగళవారం జరిగిన పార్టీ పార్లమెంటరీ వ్యూహాత్మక బృందం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో లోక్‌సభ, రాజ్యసభలోని ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ఖర్గే కూడా పాల్గొన్నారు.

## నరేగా పునరుద్ధరణకు ప్రజాస్వామ్య మార్గాలను అనుసరిస్తాం : కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తున్న సమయంలో ప్రతిపక్ష పార్టీలు 'ఎంజి నరేగా'ను బుల్డోజ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ గౌరవప్రదమైన రీతిలో నిరసన తెలిపాయని కాంగ్రెస్ పేర్కొంది. యుపిఎ కాలం నాటి చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేయడానికి అన్ని ప్రజాస్వామ్య మార్గాలను ఉపయోగిస్తామని తెలిపింది. పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో ప్రతిపక్ష పార్టీల నిరసనలు చెలరేగాయి. చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. వికసిత్ భారత్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) (విబి–జి రామ్ జి) 125 రోజుల పనికి హామీ ఇస్తుందని, అవినీతి, లీకేజీలను కూడా ఆపివేస్తుందని రాష్ట్రపతి తన ప్రసంగంలో అన్నారు. ఇది గ్రామీణాభివృద్ధికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని కూడా ఆమె నొక్కి చెప్పారు. విబి–జి రామ్ జి చట్టం గురించి రాష్ట్రపతి ప్రస్తావనను ట్రెజరీ బెంచీలు బల్లలు చప్పట్లు కొడుతూ స్వాగతించగా, ప్రతిపక్ష సభ్యులు చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కాగా, ఎంజి నరేగా పునరుద్ధరణను డిమాండ్ చేయడానికి ప్రతిపక్షం అన్ని ప్రజాస్వామ్య మార్గాలను ఉపయోగిస్తుంది అని పోస్ట్‌లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ నొక్కి చెప్పారు. ప్రతిపక్షాలు 'వాపస్ లో' (చట్టాన్ని వెనక్కి తీసుకోండి) వంటి నినాదాలు చేయడంతో ముర్ము తన ప్రసంగం మధ్యలో ఆగిపోయారు. ఈ చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలోకి రానుంది. విబి–జి రామ్ జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, ఎంజినరేగాను ను దాని అసలు రూపంలో హక్కుల ఆధారిత చట్టంగా, పని చేసే హక్కు, పంచాయతీల అధికారాన్ని పునరుద్ధరించాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమయంలో, కొత్త చట్టం గ్రామీణ ఉపాధి హామీని మరింత బలోపేతం చేస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

## గగనతలంలో పెను విషాదాలు

### విమాన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ప్రముఖులు

**న్యూఢిల్లీ:** భారతదేశ చరిత్రలో చోటుచేసుకున్న పలు విమాన, హెలికాప్టర్ ప్రమాదాలు దేశాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టాయి. ఈ దుర్ఘటనల్లో రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలు, సినీ ప్రముఖులు సహా అనేకమంది ప్రముఖులు తమ ప్రాణాలను కోల్పోయారు. తాజాగా, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో ల్యాండింగ్ అవుతుండగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తోపాటు మరో ఐదుగురు మృతి చెందారు. ఈ నేపథ్యంలో, ఇప్పటివరకు విమాన ప్రమాదాల్లో మరణించిన వారిని పరిశీలిస్తే...



**ఎయిర్‌ఇండియా ప్రమాదంలో గుజరాత్ మాజీ సిఎం మృతి**

తీవ్ర విషాదాన్ని నింపిన అహ్మదాబాద్ ఎయిర్‌ఇండియా విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ దుర్మరణం పాలయ్యారు. లండన్‌లో నివసిస్తున్న ఆయన కుమార్తె రాధికను కలిసేందుకు జూన్ 12న అహ్మదాబాద్ నుంచి విజయ్ రూపానీ బయలుదేరారు. అయితే అయిన కొన్ని క్షణాల్లోనే విమానం మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలోని 242 మంది పాటు విద్యార్థులు కలిపి సుమారు 270 పైనే ఉన్నట్లు గుజరాత్ ప్రభుత్వం తెలిపింది.

**నల్లమల అడవుల్లో వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2009 సెప్టెంబర్ 2న బెల్–430 హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. నల్లమల అటవీ ప్రాంతంలో ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ అదుపుతప్పి కూలిపోయింది.

**అరుణాచల్‌లో సిఎం మరణం**

అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి దోర్జీ ఖండు 2011 ఏప్రిల్ 30న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. తవాంగ్ నుంచి ఇటానగర్‌కు ప్రయాణిస్తున్న సమయంలో వెస్ట్ కామెంగ్ జిల్లాలో ఈ ప్రమాదం జరిగింది.

**పైలట్ల తప్పిదం హోమీ బాబా విమానం క్రాష్**

భారత అణు కార్యక్రమానికి పునాది వేసిన మహానుభావుడు డాక్టర్ హోమీ భాభా. 1966 జనవరి 24న ఆయన ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా ఫ్లైట్–101 స్విట్జర్లాండ్‌లోని మోంట్ బ్లాంక్ పర్వత శ్రేణుల్లో కూలిపోయింది. పైలట్లు, జెనీవా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మధ్య సమన్వయ లోపమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని దర్యాప్తులో తేలింది.

**సంజయ్ గాంధీ ఏరోబాటిక్స్ చేస్తుండగా**

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ 1980 జూన్ 23న విమాన ప్రమాదంలో మరణించారు. అనుభవజ్ఞుడైన పైలట్ అయిన ఆయన, ఢిల్లీ ఫ్లయింగ్ క్లబ్‌కు చెందిన చిన్న విమానంలో సఫ్దర్‌జంగ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఏరోబాటిక్స్ చేస్తుండగా అకస్మాత్తుగా నియంత్రణ కోల్పోయి కూలిపోయారు. 1977లో ఎన్నికల ప్రచార సమయంలో ఆయనపై జరిగిన హత్యాయత్నం నుంచి తప్పించుకున్నప్పటికీ, ఈ ప్రమాదం నుంచి మాత్రం బయటపడలేకపోయారు.

**వాతావరణం ప్రతికూలించి మాధవ్‌రావ్ సింధియా విమానం**

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి మాధవరావు సింధియా విమాన ప్రమాదంలో 2001 సెప్టెంబర్ 30న కన్నుమూశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు ఎన్నికల సభకు వెళ్తుండగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయన ప్రయాణిస్తున్న 10 సీట్ల ప్రైవేట్ విమానం మైన్‌పురి సమీపంలో కూలిపోయింది.

**హెలికాప్టర్ కూలడంతో జిఎంసి బాలయోగి మృతి**

మాజీ లోక్‌సభ స్పీకర్ జిఎంసి బాలయోగి 2002 మార్చి 3న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. భీమవరం నుంచి బయలుదేరిన ప్రైవేట్ హెలికాప్టర్ కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలోని చెరువులో కూలిపోయింది.











**సైప్రియన్ సంగ్మా: షిల్లాంగ్ దుర్ఘటన**

మేఘాలయ రాష్ట్ర మంత్రి సైప్రియన్ సంగ్మా సహా మరో తొమ్మిది మంది 2004 సెప్టెంబర్ 22న పవన్ హాన్స్ హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. గువాహటి నుంచి షిల్లాంగ్‌కు వెళ్తుండగా, బారాపానీ సరస్సు సమీపంలో హెలికాప్టర్ కూలిపోయింది.

**సినీ లోకాన్ని శోకసంద్రంలో ముంచిన ప్రమాదం**

ప్రముఖ సినీ నటి సౌందర్య 2004 ఏప్రిల్ 17న విమాన ప్రమాదంలో మృతి చెందారు. బెంగళూరు జక్కూర్ ఎయిర్‌ఫీల్డ్ నుంచి కరీంనగర్‌కు బయలుదేరిన సెస్నా సింగిల్ ఇంజిన్ విమానం అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. అప్పటికి ఏడు నెలల గర్భిణిగా ఉన్న ఆమెతో పాటు నలుగురు ఈ ప్రమాదంలో మరణించారు.


**పారిశ్రామికవేత్త ఓం ప్రకాశ్ జిందాల్ మరణం**

ప్రముఖ పారిశ్రామికవేత్త, హరియాణా మంత్రి ఓం ప్రకాశ్ జిందాల్ 2005 మార్చి 31న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. దిల్లీ నుంచి చండీగఢ్‌కు వెళ్తుండగా, ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్ సమీపంలో హెలికాప్టర్ కూలిపోయింది.

**బిపిన్ రావత్: భారత తొలి సిడిఎస్‌కు దేశం నివాళి**

భారతదేశ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ 2021 డిసెంబర్ 8న హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. సూలూర్ నుంచి వెల్లింగ్టన్‌కు వెళ్తుండగా, తమిళనాడులోని కూనూర్ సమీపంలో హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన భార్యతో పాటు మరో 11 మంది మరణించారు.







### భారత్‌కు ఇయు కూటమి ఎగుమతుల విషయంలో...

## సుంకాలు తగ్గించడంపై కాంగ్రెస్ ఆందోళన

**న్యూఢిల్లీ:** భారత్‌యురోపియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన అనంతరం బుధవారం కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళనలను వ్యక్తంచేసింది. కార్బన్ బోర్డర్ అడ్జస్ట్‌మెంట్ మెకానిజం నుండి భారతదేశ అల్యూమినియం, ఉక్కు తయారీదారులకు మినహాయింపు ఇవ్వడంలో నరేంద్రమోదీ ప్రభుత్వం విఫలం కావడం కూటమి భారతదేశానికి చేసే 96శాతానికి పైగా ఎగుమతులపై సుంకాల తగ్గింపు లేదా ఉపశమనం వంటి ఆందోళనలను కాంగ్రెస్ లేవనెత్తింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి ఇన్ కమ్యూనికేషన్స్ జైరామ్ రమేశ్ మాట్లాడుతూ యురోపియన్‌కు సంబంధించిన కఠినమైన ఆరోగ్య, ఉత్పత్తి భద్రతా నియమాల గురించి కూడా ఆందోళనలు ఉన్నాయని, ఎఫ్‌టిఏ తర్వాత కూడా భారతీయులపై ఇవి అమలులో ఉంటాయని, అలాగే భారతదేశంలో అతిపెద్ద ఎక్స్‌పో యురోపియన్ యూనియన్‌శుద్ధి చేసిన ఇంధనాల గురించి ఆందోళనలు ఉన్నాయని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. ఈ ఇంధనంలో ఎక్కువ భాగం రష్యా నుంచి లభిస్తుందని, వాషింగ్టన్ డిసి ఒత్తిడి మధ్య ఈ వాణిజ్య మార్గాల భవిష్యత్తుపై స్పష్టత అవసరమని కాంగ్రెస్ ముఖ్యనాయకుడు జైరామ్ రమేశ్ అన్నారు. భారతదేశం, 27దేశాల కూటమి యురోపియన్ యూనియన్ 2007 జూన్‌లో తొలిసారిగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం (ఎఫ్‌టిఏ) చర్చలు ప్రారంభించాయని ఆయన నొక్కిచెప్పారు. 16 రౌండ్ల చర్చలు జరిగాయని, కానీ అనేక దిగుమతి అంశాలపై ఒప్పందం కుదరకపోవడంతో 2013 మే లో చర్చలను నిలిపివేయడం జరిగిందని జైరామ్ రమేశ్ తెలిపారు. 2022 జూన్ వరకూ చర్చలు నిలిపివేయబడి , ఆ తర్వాత తిరిగి ప్రారంభం అయ్యాయని ఆయన పేర్కొన్నారు.

## అజిత్ పవార్ మృతిలో కుట్రకోణం...

### బెంగాల్ సిఎం మమత సంచలన వ్యాఖ్యలు



**కోల్‌కతా:** విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ ప్రాణాలు కోల్పోయిన ఘటనపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. అజిత్ మృతిలో కుట్రకోణం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం దేశంలో రాజకీయ నాయకుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్‌ చేశారు. అజిత్ మృతి చెందిన వార్త తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని మీడియాతో మాట్లాడుతూ మమతా బెనర్జీ అన్నారు. బిజెపిని వీడాలని ఆయన ఆలోచిస్తున్నారని ఇటీవల జరిగిన ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, రాజకీయ నాయకులకు సైతం భద్రత లేకుండా పోతోందన్నారు. ఈ ఘటన అనేక ప్రశ్నలకు తావిస్తోందన్నారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో మాత్రమే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానం మీద మాత్రమే తమకు నమ్మకం ఉందని, మరో ఇతర దర్యాప్తు సంస్థలపైన విశ్వాసం లేదని, దర్యాప్తు సంస్థలు తమ స్వేచ్ఛ కోల్పోయాయని ఆరోపించారు. కాగా, బారామతి విమాన ప్రమాదంపై విచారణ జరిపించాలని పలువురు రాజకీయ నేతలు సైతం డిమాండ్ చేశారు. అజిత్ పవార్ మృతికి సంతాపం తెలుపుతూ ఇందుకు దారితీసిన ప్రమాద ఘటనపై పారదర్శకమైన దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్, ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, వంచిత్ బహుజన్ అఘాడి నేత ప్రకాష్ అంబేద్కర్ తదితరులు కోరారు.

## జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ పదవీ కాలం పొడిగిస్తూ

### 'సుప్రీం' 'బెంచ్' కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ:** మణిపూర్‌లో ప్రజ్వరిల్లిన జాతి హింస బాధితుల సహాయ, పునరావాస చర్యలను పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ గీతామిట్టల్ కమిటీ పదవీకాలాన్ని బుధవారం అత్యున్నత న్యాయస్థానం జూలై 31వరకు పొడిగించింది. గత ఏడాది జూలైలో కమిటీ పదవీకాలం ముగిసిందని సమాచారం అందుకున్న తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ సారథ్యంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ ద్విసభ్య ధర్మాసనం కమిటీ పదవీ కాలాన్ని పొడిగిస్తూ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. బాధితుల పునరావాసానికి సంబంధించిన వివిధ అంశాలపై ప్యానెల్ ఇప్పటివరకూ 42 నివేదికలను సుప్రీంకోర్టుకు సమర్పించిందని ధర్మాసనానికి సమాచారం అందింది. 'జులై 2025 నుండి అధికారికంగా పొడిగింపు మంజూరు చేయనందున కమిటీ కొనసాగింపును క్రమబద్ధీకరిస్తారు. 2026 జులై 31 వరకూ గడువు ఇవ్వబడుతుంది' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. 2023 ఆగస్టు 7న బాధితులకు సహాయం, పునరావాసం, వారికి పరిహారం చెల్లించేందుకు ముగ్గురు మాజీ మహిళా హైకోర్టు న్యాయమూర్తులతో కూడిన కమిటీని ఏర్పాటుచేయాలని, క్రిమినల్ కేసులో దర్యాప్తును పర్యవేక్షించాలని మహారాష్ట్ర మాజీ పోలీస్ చీఫ్ దత్తాత్రేయ్ పద్సల్గికర్‌ను ఆదేశించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. జాతి కలహాలను పర్యవేక్షిస్తున్న కేసులను పర్యవేక్షిస్తున్న అత్యున్నత న్యాయస్థానానికి నేరుగా తన నివేదికలను సమర్పించే అధికారం కమిటీకి ఉంది. మాజీ జమ్మూ కశ్మీర్ హైకోర్టు చీఫ్ జస్టిస్ గీతా మిట్టల్ నేతృత్వంలోని ఈ ప్యానెల్‌లో బాంబే హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి రిటైర్డ్ జస్టిస్ షాలినీ పి.జోషి, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఆశామీనన్ సహా ఉన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్న ఒక వీడియో 'తీవ్ర కలతపెట్టేది' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన కొన్ని రోజుల తర్వాత ముగ్గురు సభ్యుల ప్యానెల్ ఏర్పాటు చేయబడింది. ధర్మాసనానికి సమాచారం అందింది. 2023 మే 3న మణిపూర్‌లో జాతిహింస మొదటి సారి చెలరేగినప్పటి నుండి 200మందికి పైగా మరణించారు. అనే క వందల మంది క్షతగాత్రులయ్యారు, వేలాది మంది నిరాశ్రయులయ్యా రు. మెజారిటీ మెయితీ కమ్యూని టీ ఎస్‌టి హోదా కోసం చేసిన డిమాండ్‌కు వ్యతిరేకంగా'గిరిజన సాలిడారిటీ మార్చ్' నిర్వహించబడింది.

## చండీగఢ్‌లో స్కూళ్లకు బాంబుబెదిరింపు మెయిల్స్

**చండీగఢ్ :** చండీగఢ్‌లోని దాదాపు 26 స్కూళ్లకు బుధవాం బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులను ఖాళీ చేయించారు. పోలీసు అధికారులు విధ్వంస నిరోధక తనిఖీలు చేపట్టారు. చండీగఢ్ సీనియర్ ఎస్‌పి కన్వర్‌దీప్ కౌర్ మాట్లాడుతూ ఇప్పటివరకు 10 పాఠశాలల్లో విధ్వంస నిరోధక తనిఖీలు నిర్వహించామని, అక్కడ అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని, మిగిలిన పాఠశాలల్లో కూడా ఇలాంటి తనిఖీలు జరుగుతున్నాయని చెప్పారు. వరుస బాంబు బెదిరింపు ఇ–మెయిల్స్ తర్వాత, చండీగఢ్ పరిపాలన ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, భయపడవద్దని సూచించింది. బుధవారం ఉదయం పాఠశాల అధికారులు బాంబు బెదిరింపు ఇ–మెయిల్స్ గురించి పోలీసులకు సమాచారం ఇచ్చిన తర్వాత, పోలీసులు పాఠశాల ప్రాంగణానికి చేరుకుని విద్యాసంస్థలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారని వారు తెలిపారు. 25, 19, 45, 16, ఇతర ప్రాంతాలలో ఉన్న అనేక ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బెదిరింపు ఇ–మెయిల్స్ వచ్చాయి. విద్యార్థులు, సిబ్బందిని ఖాళీ చేయించామని, పాఠశాలల చుట్టూ భద్రతను పెంచామని వారు తెలిపారు. పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులను ఇంటికి తిరిగి పంపించారని వారు తెలిపారు.బుధవారం ఉదయం తమకు బాంబు బెదిరింపు ఇ–మెయిల్స్ వచ్చాయని, ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందించామని పాఠశాల అధికారులు పోలీసులకు తెలిపారు. బాంబు బెదిరింపు ఇమెయిల్‌ల గురించి 26 పాఠశాలల నుండి కాల్స్ వచ్చాయని ఎస్ఎస్‌పి కౌర్ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. కంట్రోల్ రూమ్ 112 కు సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసు బృందాలు, అగ్నిమాపక దళాలు, అంబులెన్స్‌లు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లు స్పందించాయని ఆమె చెప్పారు. ఈ ఇ–మెయిల్స్ ఒక జిమెయిల్ ఖాతా నుండి వచ్చాయని, చండీగఢ్ పోలీసుల సైబర్ బృందం దానిని పరిశీలిస్తోందని ఆమె చెప్పారు. ఈ ఇ–మెయిల్ పాఠశాలలకు సంబోధించబడిందని ఆమె ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సెక్టార్ 17 పోలీస్ స్టేషన్‌లో ఈ విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయబడిందని ఎస్ఎస్‌పి తెలిపారు. బాంబు బెదిరింపు ఇ–మెయిల్‌లు అందని పాఠశాలలు తెరిచి ఉన్నాయని ఎస్ఎస్‌పి తెలిపారు. ప్రజలకు బెదిరింపు కాల్స్ వస్తే 112 అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్‌కు డయల్ చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ధృవీకరణ లేకుండా పాఠశాలలకు సెలవులు ప్రకటించవద్దని సూచించారు. ఎందుకంటే ఇటువంటి చర్యలు విద్యార్థులు, తల్లిదండ్రులు, సాధారణ ప్రజలలో నివారించదగిన భయాందోళనలకు దారితీయవచ్చన్నారు.




## ఇండోర్‌లో మరో వ్యక్తి మృతి



**ఇండోర్ :** మధ్యప్రదేశ్‌లో పరిశుభ్రనగరంగా పేరొందిన ఇండోర్‌లో కలుషిత నీటి కలకలం కొనసాగుతూనే ఉంది. మరణాలు ఇంకా ఆగడడం లేదు. తాజాగా భగీరత్‌పురా ప్రాంతంలో 62 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. అయితే కలుషితమైన తాగునీరు వల్ల కలిగే విరేచనాల కారణంగా ఆయన మరణించారని కుటుంబం బుధవారం పేర్కొంది. ఈ కేసుతో సహా, ఒక నెల క్రితం ఈ ప్రాంతంలో కలుషితమైన తాగునీరు వల్ల సంభవించిన విరేచనాల వ్యాప్తిలో ఇప్పటివరకు 29 మంది ప్రాణాలు కోల్పోయారని స్థానికులు పేర్కొన్నారు. అయితే, మంగళవారం మధ్యప్రదేశ్ హైకోర్టు ఇండోర్ బెంచ్‌కు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన 'డెత్ ఆడిట్' నివేదిక భగీరత్‌పురాలో 16 మంది మరణాలకు నీటి సంబంధిత ఆరోగ్య సంక్షోభం సంబంధం ఉండవచ్చని సూచించింది. భగీరత్‌పురా నివాసి ఖుబ్‌చంద్ బంధయ్య కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారన్నారు. బంధయ్య కుమారుడు రోహిత్ పిటిఐకితో మాట్లాడుతూ 'నా తండ్రి కలుషితమైన తాగునీరు కారణంగా గత 1520 రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. మేము ఆయనను భగీరత్‌పురాలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లాము. అక్కడ ఆయనకు మందులు ఇచ్చారు. మంగళవారం మా ఇంట్లో ఆయన మరణించారు' అని చెప్పారు. తన తండ్రిని ఆసుపత్రిలో చేర్చమని ఆరోగ్య కేంద్రంలోని అధికారులను కోరానని రోహిత్ పేర్కొన్నాడు, కానీ ఇంటికి అంబులెన్స్ పంపలేదన్నారు. ఇదిలా ఉండగా, భగీరత్‌పుర నీటి సమస్యపై న్యాయ విచారణ నిర్వహించడానికి మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ హైకోర్టు హైకోర్టు మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుశీల్ కుమార్ గుప్తా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. న్యాయ విచారణ చర్యలు ప్రారంభమైన తేదీ నుండి నాలుగు వారాల్లోపు మధ్యంతర నివేదికను సమర్పించాలని హైకోర్టు కమిషన్‌ను ఆదేశించింది.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు పెద్దపీట వేయాలి

### ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం సముచిత ప్రాధాన్యం కల్పించాలని భువనగిరి ఎంపి చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫెడరల్ స్ఫూర్తిని కాపాడుతూ అన్ని రాష్ట్రాలకు సమన్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఎంపి అసహనం వ్యక్తం చేశారు. 'డబుల్ ఇంజన్ సర్కార్' అనే నినాదంతో కేంద్రం కేవలం తమ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు, ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలకు మాత్రమే నిధులను మళ్లించడం సరైంది కాదన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా అభివృద్ధి ప్రాతిపదికన నిధుల పంపిణీ జరగాలని ఆయన కోరారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా, విభజన చట్టంలోని పలు హామీలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమయ్యాయని గుర్తుచేశారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం వంటి అంశాలకు నిధులు కేటాయించాలన్నారు. ట్రిబుల్ ఆర్, కొత్త రైల్వే లైన్లు, ఫ్యూచర్ సిటీ, మూసి పునర్జీవం, మెట్రో విస్తరణ కోసం కోరారు నిధుల కేటాయింపు ఉండాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి చెందితే అది దేశాభివృద్ధికే దోహదం చేస్తుందని, కేంద్ర బడ్జెట్ నుంచి చాలా అంచనాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దేలా ఈసారి కేటాయింపులు ఉండాలని, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌లో తెలంగాణ ఆకాంక్షలను గుర్తిస్తారని ఆశిస్తున్నట్లు చామల కిరణ్ రెడ్డి పేర్కొన్నారు.

## బంగారు పొరనే దోచుకున్నారు...

### శబరిమల బంగారం చోరీ కేసులో కీలక పరిణామం

**తిరువనంతపురం:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శబరిమల గర్భగుడి బంగారు తాపడం చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గర్భగుడి తలుపులను మార్చలేదని, వాటిపై ఉన్న రాగి రేకుల మీద నుంచి బంగారు పొరను నేర్పుగా దోచుకున్నారని శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. ఈ మేరకు విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (విఎస్ఎస్‌సి) శాస్త్రవేత్తలు సమర్పించిన నివేదికను, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) బుధవారం కేరళ హైకోర్టుకు సమర్పించింది. గర్భగుడికి ఉన్నవి అసలైన రాగి రేకులేనని, వాటిని మార్చలేదని విఎస్ఎస్‌సి శాస్త్రవేత్తలు తమ నివేదికలో స్పష్టం చేశారు. తలుపుల చెక్క ఫ్రేమ్‌వర్క్ కూడా పాతదేనని నిర్ధారించారు. దొంగిలించబడింది ఘనమైన బంగారం కాదని, రాగి రేకులపై ఉన్న బంగారు పొర మాత్రమేనని తేల్చారు. కొన్ని రేకులపై బంగారం శాతం గణనీయంగా తగ్గడాన్ని బట్టి, రసాయనాలను ఉపయోగించి బంగారాన్ని వేరుచేసి ఉంటారని అంచనా వేశారు. రేకులపై కనిపించిన మార్పులవల్ల వాటిని పూర్తిగా మార్చేసి ఉంటారని ఇప్పటివరకు ప్రచారం జరిగింది. అయితే బంగారం వెలికితీతకు ఉపయోగించే పాదరసం వంటి రసాయనాల ప్రయోగం వల్లే వాటి ఉపరితలంలో మార్పులు వచ్చాయని, భౌతికంగా వాటిని మార్చలేదని శాస్త్రవేత్తలు వెల్లడిచేశారు. దాంతో అసలు రాగి రేకులను అంతర్జాతీయ ముఠాలకు విక్రయించి ఉంటారన్న ఊహాగానాలకు తెరపడినట్టు అయ్యింది. ఈ కేసుకు సంబంధించి మరిన్ని విశ్లేషణలు కొనసాగుతున్నాయని, పాత గర్భగుడి తలుపుల నమూనాలతో పోల్చి తుది నివేదికను త్వరలోనే సమర్పిస్తామని విఎస్ఎస్‌సి అధికారులు సిట్‌కు తెలిపారు. ఈ శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తునకు స్పష్టమైన దిశానిర్దేశం లభించింది. గర్భగుడి నిర్మాణాలను మార్చకుండా, కేవలం రసాయన ప్రక్రియ ద్వారా బంగారాన్ని ఎలా దొంగిలించారు..? ఈ నేరం వెనుక ఉన్నదెవరు..? అనే కోణంలో ఇప్పుడు విచారణ జరగనుంది.

SHRIRAM Finance

**వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS11EL 0610 | Sampelly Ramesh | INDICA VISTA AURU 1.3 DIESEL 5 SEATER | 2011 |
| 2 | TS06EY 7299 | Anudeep Thatipamula | HECTOR SHARP DIESEL 5 SEATER | 2019 |
| 3 | TS25F 6914 | Devender Midimilla | MAHINDRA 415 DI XP PLUS | 2021 |

AUCTION DATE : 31.01.2026

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
H.No :4-316,4-317,4-318, Ground Floor, Opp : Fire Station, Parkal, Warangal District Cell : 9666726222, 9989766426

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
గురువారం
29-01-2026
www.prajapaksham.in



# వికసిత్ భారత్ కోసం పార్లమెంటేరియన్‌ల ఐక్యత

''వికసిత్ భారత్ సంకల్పం, భారతదేశ భద్రత, ఆత్మనిర్భరత, స్వదేశీ ప్రచారం, జాతీయ ఐక్యత పరిరక్షణ, స్వచ్ఛత తదితరాలు దేశానికి సంబంధించినవి. వీటిపై పార్లమెంటేరియన్‌లు ఐక్యంగా నిలబడాలి. అదే రాజ్యాంగ స్ఫూర్తి'' అని ఉద్ఘాటించారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆమె బుధవారం ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. సంవత్సరారంభంలో తొలి సమావేశం సందర్భంగా పార్లమెంటులో రాష్ట్రపతి, శాసనసభల్లో గవర్నర్‌లు ప్రసంగించటం సాంప్రదాయం. మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగ పాఠాలను చదవటమే వారు చేయవలసిన పని. ఆ ప్రసంగాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాము చేసిన మంచి పనులను, అభివృద్ధి సాధన, సామాజిక న్యాయం తదితర అన్ని విషయాలలో సాధించిన ఫలితాలను, ఆలోచనలను తమ దృష్టికోణం నుంచి దేశ, రాష్ట్ర ప్రజల ముందు ఉంచుతారు. రాష్ట్రపతి ముర్ము దేశ ప్రజలందరికీ సంబంధించిన అంశాలపై పార్లమెంటేరియన్‌ల మధ్య రాజకీయ ఐక్యతకు విజ్ఞప్తి చేశారంటే అది మోదీ ప్రభుత్వ భావన. అటువంటి ఐక్యతకు జాతీయ సామరస్యం అవసరం. నరేంద్రమోదీ నాయకత్వంలో 2014 లో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చింది లగాయితూ మతోన్మాద, విభజనవాద రాజకీయాలను అనుసరిస్తుండగా ప్రభుత్వం – ప్రతిపక్షాల మధ్య అట్టి ఐక్యత లేదా సామరస్యం ఎలా సాధ్యం? రాజ్యాంగం, ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా అన్నీ ఏకపక్ష నిర్ణయాలే కదా? ఏనాడైనా ఏ అంశంపైనయినా ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకున్నారా? రాష్ట్రపతి తమ ప్రసంగంలో కొన్ని పేరాగ్రాఫ్‌లు చదవకపోయినా లేదా సొంత అభిప్రాయాలు చేర్చినా మోదీ ప్రభుత్వం సహిస్తుందా? లేదు. అటువంటప్పుడు తమిళనాడు, కేరళ, కర్నాటక గవర్నర్‌లు ఈ సాంప్రదాయాన్ని ధిక్కరించి ఒంటెత్తు పోకడ పోతుంటే కేంద్రం వారిని తొలగించిందా, కనీసం మందలించిందా? లేదే! రాష్ట్రపతి హోంమంత్రిత్వశాఖ సిఫారసుపై గవర్నర్‌లను నియమిస్తారు. ఆమె లేదా ఆయనకు సంతృప్తికరంగా పనిచేసినంతవరకే వారు పదవిలో ఉంటారు. పైన ప్రస్తావించిన ముగ్గురిపై కేంద్రం ఎటువంటి చర్యా తీసుకోలేదంటే వారి పనితో సంతృప్తికరంగా ఉన్నట్టే కదా! ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను గవర్నర్‌ల ద్వారా, కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా, చట్టరీత్యా ఇవ్వాల్సిన నిధుల విడుదలను తొక్కిపెట్టటం ద్వారా వేధించే రాజకీయం నడుపుతూ, సంపూర్ణ అధికారంకోసం అహర్నిశలు పరితపిస్తున్న మోదీ ప్రభుత్వం రాష్ట్రపతి ప్రసంగం ద్వారా జాతీయ ఐక్యతకు విజ్ఞప్తి చేయటంలో నిజాయితీ లేదు.

స్వతంత్ర భారత తొలి ప్రధాని, క్రాంతదర్శి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను జనాల స్మృతిపథం నుంచి మరుగుపరచటమే తమ మతవాద, మితవాద రాజకీయాల మనుగడకు అవసరంగా ఆయన్ను నిందించటమే పనిగా పెట్టుకున్న పాలకపార్టీ రాష్ట్రపతి ప్రసంగంలో ఆయన పేరు ప్రస్తావించటం గమనార్హమైన విశేషం. ముర్ము తమ ప్రసంగంలో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, బాబా సాహెబ్ అంబేద్కర్, సర్దార్ వల్లభ్ భాయి పటేల్, జయప్రకాశ్ నారాయణ్, రాం మనోహర్ లోహియా, పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అతల్ బిహారీ వాజ్‌పేయి పేర్లు ప్రస్తావించి, ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమని, కొన్ని అంశాలు భేదాభిప్రాయాలకు అతీతమని వారు భావించారని చెప్పారు.

మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో విబి జి రామ్ జి చట్టం తెచ్చిన మోదీ ప్రభుత్వం జాతిపిత మహాత్మా గాంధి స్మృతిని గౌరవిస్తుందనుకోవాలా? కొత్త చట్టాన్ని రద్దుచేసి ఎంజి నరేగాను పునరుద్ధరించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ప్రభుత్వం తిరస్కరించింది. రాష్ట్రపతి తమ ప్రసంగంలో కొత్త చట్టం గూర్చి గొప్పలకు పోయినపుడు ప్రతిపక్షాలు నిరసన తెలియజేశాయి. దాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

ఇక షరా మామూలుగా ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా తాము ఎన్నో గొప్పలు సాధించినట్లు చెప్పుకుంది. అయితే ఈ శతాబ్దం తొలి 25 సంవత్సరాల్లో, ముఖ్యంగా గత 11 ఏళ్లలో దేశం ఎంతో పురోగతి సాధించినట్లు ఏకరువు పెట్టింది. పాతిక కోట్లమందిని దారిద్ర్యం నుంచి పైకి తెచ్చామని, అవినీతిని అంతం చేశామని, ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలో నాల్గవ స్థానానికి తెచ్చామని, రైతులను సంపన్నులను చేశామని, కార్మికుల మేలుకోసం నాలుగుకోడ్‌లు తెచ్చామని వగైరా వగైరా చెప్పింది. అవి కార్పొరేట్‌లకు కాకుండా రైతులు, కార్మికులకు మేలు చేసేవే అయితే దేశానికి వెన్నెముక అయిన కార్మికులు – కర్షకులు ఎందుకు ఏళ్ల తరబడి ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం ఎందుకు స్పందించటం లేదు? ఈ సమావేశాల్లో ఎంజి నరేగా, ఓటర్ల జాబితాల ప్రక్షాళన(ఎస్ఐఆర్) పేరుతో పేదలు, మైనారిటీల ఓట్లు పెద్ద ఎత్తున తొలగిస్తూ బిజెపికి లబ్ది చేకూర్చే విధంగా పనిచేస్తున్న ఎన్నికల కమిషన్‌పైన ఇండియా కూటమి దాడి ఎక్కుపెడుతున్నది.

రాష్ట్రపతి ముర్ము తమ ప్రభుత్వాన్ని 'సంస్కరణ ఎక్స్‌ప్రెస్'గా అభివర్ణించారు. సంస్కరణలు అంటేనే దేశ సంపదను స్వదేశీ, విదేశీ గుత్తపెట్టుబడిదారులకు దోచిపెట్టటం. అభివృద్ధి అంకెల గారడీ చేయటం. మోదీ చెప్పుకునే అభివృద్ధి, వృద్ధి రేటు లెక్కలు సరైనవి అయితే సామాన్య ప్రజల జీవితాలు ఎందుకు మెరుగుపడటం లేదు, అసమానతలు ఎందుకు పెరుగుతున్నాయి? 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేలక్ష్యం సామాజిక న్యాయంతో నెరవేరాలని, అందుకు తగిన కార్యాచరణపై మోదీ ప్రభుత్వం 'పార్లమెంటేరియన్‌ల ఐక్యత'కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆశించుదాం!



## కేరళలో ఎల్‌డిఎఫ్ ఓట్లు పెరుగుతాయి

**కేరళలో ఎల్‌డిఎఫ్‌కు స్థానిక సంస్థల ఎన్నికల కంటే శాసనసభ ఎన్నికల నాటికి ఓట్ల శాతం పుంజుకునే ప్రత్యేకమైన సామర్థ్యం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్రులు,చిన్న పార్టీల అభ్యర్థులకు పడిన ఓట్లు అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎల్‌డిఎఫ్ వైపే ఎక్కువ మొగ్గ చూపుతున్నట్లు చరిత్ర సూచిస్తుంది. ప్రతి 2010లో లోకల్ బాడీ ఎన్నికల్లో ఓడిపోయిన ఎల్‌డిఎఫ్ అసెంబ్లీ ఎన్నికల నాటికి 5.4 శాతం ఓట్లు అధికంగా సాధించింది. 2015–16ఎన్నికల్లో 5.7 శాతం, 2020–21 ఎన్నికల్లో 4.1 శాతం ఓట్లు పెరిగాయి. అదే యుడిఎఫ్‌కు చాలా తక్కువ పెరుగుదల కనిపిస్తోంది. గత ఎన్నికల ఫలితాల సగటు తీసుకుంటే లోకల్ బాడీ ఎన్నికల కంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువగా ఎల్‌డిఎఫ్‌కు 5.1శాతం, యుడిఎఫ్‌కు 1.4 శాతం మాత్రమే ఓట్లు పెరిగాయి.**

ఎన్నికల విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్ట్ ప్రణయ్ రాయ్



# డిజిటల్ తెరపై మీరు చూస్తున్నది నిజమేనా?!

డిజిటల్ తెరపై కనిపించే ప్రతిదీ సత్యమేనన్న భావన నేటి సమాజంలో వేగంగా వ్యాపిస్తోంది. ఒక వీడియో వైరల్ అవుతుందంటే అది నిజమేనని, లక్షలాది చందాదారులున్నారంటే అది విశ్వసనీయతకు ముద్రనని భావించే పరిస్థితి ఏర్పడింది. అయితే అల్గోరిథంల ఆధారంగా నడిచే డిజిటల్ ప్రపంచంలో సంఖ్యలు ఆకర్షణీయంగా కనిపించినంత మాత్రాన వాటి వెనుక ఉన్న వాస్తవం కూడా అంతే బలంగా ఉంటుందన్న గ్యారంటీ లేదు. సమాచార విప్లవం ప్రజల కు అవగాహన పెంచుతున్నప్పటికీ, అదే సమయంలో అప్రమత్తత లేకపోతే అవాస్తవాలకూ అవకాశం కల్పిస్తోంది. అందువల్ల మనం స్వీకరిస్తున్న సమాచారాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించడం నేటి అత్యవసర అవసరంగా మారింది.

**గణాంకాల ప్రభావం.. విశ్వసనీయత ప్రశ్నార్థకం:**

భారతదేశంలో యూట్యూబ్ వినియోగం విస్తృతంగా పెరుగుతున్నది అన్నది నిర్వివాద సత్యం. కోట్లాదిమంది ఈ వేదికను వార్తలు, వినోదం, అభిప్రాయాల కోసం వినియోగిస్తున్నారు. ప్రముఖ మీడియా సంస్థలు, సంగీత సంస్థలు భారీ సంఖ్యలో చందాదారులతో ముందంజలో ఉన్నాయి. అయితే చందాదారుల సంఖ్యకు, వాస్తవంగా వీడియోలను నిరంతరం వీక్షించే వారి సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఉంటుందని అనేక డిజిటల్ విశ్లేషణలు సూచిస్తున్నాయి. అందువల్ల కేవలం గణాంకాల ఆధారంగా ఒక వ్యక్తి లేదా వేదిక ప్రభావాన్ని అంచనా వేయడం సరైన ప్రమాణం కాదన్న అభిప్రాయం బలపడుతోంది. నాణ్యమైన కంటెంట్, విశ్వసనీయత, వీక్షకులతో ఏర్పడే అనుబంధమే దీర్ఘకాలిక ప్రభావానికి కీలకంగా మారుతోంది.

**డిజిటల్ వేదికలు.. చట్టపరమైన పరిధి:**

డిజిటల్ మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తిని నియంత్రించేందుకు భారత ప్రభుత్వం సమాచార సాంకేతిక నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. ప్రజా శాంతి, జాతీయ భద్రతకు భంగం కలిగించే కంటెంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం సంబంధిత సంస్థలకు ఉంది. గత కొన్నేళ్లలో నిబంధనలను ఉల్లంఘించిన పలు డిజిటల్ ఛానళ్లపై చర్యలు తీసుకున్నట్లు అధికారిక ప్రకటనలు వెలువడ్డాయి. ఇది డిజిటల్ మీడియా రంగం పూర్తిగా నియంత్రణల వెలుపల కాదన్న విషయాన్ని స్పష్టం చేస్తోంది. కాబట్టి కంటెంట్ సృష్టించే వారు చట్టపరమైన పరిమితులను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం మరింత పెరిగింది.

యూట్యూబ్ వంటి వేదికల ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా చట్టబద్ధమైన వృత్తిపరమైన ఆదాయంగానే పరిగణిస్తారన్న అవగాహన క్రమంగా పెరుగుతోంది. సంబంధిత పన్ను నిబంధనల ప్రకారం కొన్ని రకాల డిజిటల్ ఆదాయాలపై పన్ను బాధ్యత ఉంటుంది. ఇది డిజిటల్ కంటెంట్ రంగాన్ని క్రమబద్ధమైన ఆర్థిక వ్యవస్థలో భాగంగా నిలబెడుతోంది. సరైన లెక్కల నిర్వహణ, పారదర్శక ఆర్థిక వ్యవహారాలు క్రియేటర్ల కు దీర్ఘకాలిక భద్రతను అందిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. చట్టబద్ధంగా వ్యవహరించడం ద్వారా మాత్రమే ఈ రంగంలో స్థిరమైన ఉపాధి సాధ్యమవుతుందన్న వాస్తవం ఇక్కడ స్పష్టమవుతోంది.

**తప్పుడు సమాచారం.. సామాజిక సవాలు:**

కృత్రిమ మేధ ఆధారిత వీడియోలు, ధృవీకరణ లేని సమాచారం, సంచలనాత్మక శీర్షికలు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అధిక వీక్షణల కోసం బాధ్యతారాహిత్యంగా రూపొందించే కంటెంట్ వ్యక్తిగత జీవితాలపైనా, సామాజిక శాంతిపై నా ప్రభావం చూపవచ్చు. ఈ పరిస్థితుల్లో సమాచారాన్ని అందించే క్రియేటర్ల నైతిక బాధ్యతతో పాటు, దాన్ని స్వీకరించే వీక్షకుల విజ్ఞత కూడా సమానంగా అవసరం. డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించుకోవడం ద్వారానే తప్పుడు సమాచార ప్రభావాన్ని తగ్గించవచ్చు.

డిజిటల్ వేదికలు సమాజ మార్పుకు శక్తివంతమైన సాధనాలుగా ఎదిగాయి. అయితే అవి సత్యం, బాధ్యత, చట్టపరమైన అవగాహనతో నడిచినప్పుడే నిలకడగా ఉంటాయి. కాపీరైట్, మేధో సంపత్తి హక్కులను గౌరవిస్తూ స్వంత సృజనాత్మకతతో రూపొందిన కంటెంట్‌కే దీర్ఘకాలిక గుర్తింపు లభిస్తుంది. మనం చూస్తున్నది నిజమా కాదా అన్న ప్రశ్నకు సమాధానం వెతకడమే నేటి డిజిటల్ యుగంలో అత్యవసరమైన సామాజిక బాధ్యత. వాస్తవాలను గౌరవిస్తూ, చట్టబద్ధంగా సాగే డిజిటల్ ప్రయాణమే దేశ అభివృద్ధికి నిజమైన తోడ్పాటునందిస్తుంది.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# ఉపాధి హామీ చట్టంపై దాగుడు మూతలు



జీన్ డ్రెజ్
విజిటింగ్ ప్రొఫెసర్,
ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్,
రాంచీ యూనివర్సిటీ

వికసిత్ భారత్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) చట్టం (విబి – జి రామ్ జి చట్టం) అని విచిత్రంగా పేరు పెట్టడం పట్ల ఇటీవల వారాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. కొంత మంది వ్యాఖ్యాతలు దీనిని సమర్థించారు. వారిలో ఎక్కువ మంది కేంద్ర ప్రభుత్వంతో అనుబంధం ఉన్న వారే. అయినప్పటికీ, వారి వాదనలు పస లేనివిగా భావించబడ్డాయి.

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ జాతీ య దినపత్రికలలో రెండు కథనాలు రాయడం ద్వారా ఈ విషయం లో నాయకత్వం వహించారు. కేంద్ర ప్రభుత్వం తరపున విబి – జి రామ్ జి చట్టానికి అనుకూలంగా వాదనను వినిపించడం ద్వారా ఆయన ప్రజలకు గొప్ప సేవ చేశారు. దురదృష్టవశాతు ఆయన వాదన ఆకట్టుకోలేదు. విబి – జి రామ్ జి చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నరేగా)– 2005 తరహాలోనే అదే పనిని హామీ అందిస్తుందని, 100 రోజులకు బదులు గా ప్రతి ఇంటికి సంవత్సరానికి 125 రోజుల మెరుగైన అవకాశం కల్పిస్తుందని చౌహాన్ పేర్కొన్నారు. అయితే, ఇప్పటికే పలువురు ఎత్తి చూపినట్లుగా చట్టంలోని సెక్షన్ 5(1)లో పొందుపరిచిన 'స్విచ్ ఆఫ్' నిబంధనను ఆయన వాదన విస్మరిస్తుంది. 'కేంద్రం నోటిఫై చేసిన రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతంలోనే' ఉపాధి హామీ వర్తిస్తుందని ఇందులో పేర్కొనబడింది. ఈ ఎత్తుగడ ఉపాధి హామీ ఉద్దేశ్యాన్ని ఓడిస్తుంది. ఇది హామీ ఉంటుందనే హామీ లేకుండానే పని హామీని అందించడం లాంటిది.

హామీపై షరతులు అమలులో ఉండగానే విబి – జి రామ్ జి చట్టం పనిని 125 రోజులకు పొడిగిస్తుంది. కానీ, ఎలాంటి చట్ట సవరణ అవసరం లేకుండానే ఎంజి నరేగా కింద దీన్ని అమలు చేయవచ్చు. ఇది విబి – జి రామ్ జి చట్టాన్ని సమర్థించుకునేందుకు సరైన వాదన కాదు. నిజానికి, కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే ఎంజి నరేగా కింద 125 రోజులకు హామీ ఇస్తున్నాయి.

**అనర్హత వ్యవహారం**

జి రామ్ జి చట్టం ఎంజి నరేగాను పరిమితం చేయడం కంటే, దానికి విస్తరణ అనే వాదనను చౌహాన్ వివరిస్తూ, విబి – జి రామ్ జి చట్టంలో మునుపటి 'అనర్హత నిబంధనలు' తొలగించినట్లు పేర్కొన్నారు. దీనిపై స్పష్టమైన వివరణ లేకపోవడంతో చాలా మంది పాఠకులు ఇది దేని గురించి అని ఆశ్చర్యపోతున్నారు. విబి – జి రామ్ జి చట్టాన్ని సమర్థిస్తున్న ఇతర నేతలు కూడా ఇదే విషయాన్ని చెప్పినందున, దానిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఎంజి నరేగాను రూపొందించే సమయంలో అనవసరమైన పని దరఖాస్తులు వచ్చే అవకాశాల గురించి స్వల్ప ఆందోళన తలెత్తింది. అంటే పని చేయాలనే ఉద్దేశ్యం లేని వ్యక్తుల నుండి దరఖాస్తులు. ఉదాహరణకు, వారిలో కొందరు వారికి కల్పించే పనికి బదులుగా నిరుద్యోగ భృతి పొందాలనే ఆశతో అలా చేయవచ్చు. అనవసర దరఖాస్తుల నుండి రక్షణగా, దరఖాస్తు చేసిన తర్వాత ఎవరైనా కల్పించిన పని తిరస్కరించినట్లయితే, వారు మూడు నెలల కాలానికి నిరుద్యోగ భృతికి అర్హతను కోల్పోతారనే నిబంధనను చేర్చటం జరిగింది. ఆషామాషీ పని దరఖాస్తులకు వ్యతిరేకంగా ఇది బలహీనమైన రక్షణ. అయినప్పటికీ అదేమి పెద్దగా హానీ చేయదు. ఏదో కారణం చేత, ఈ నిబంధనను 'కొన్ని పరిస్థితులలో నిరుద్యోగ భృతి పొందేందుకు అనర్హత(డిజ్ ఎన్‌టైటిల్‌మెంట్)' అని పిలిచారు.

ఆషామాషీ పని దరఖాస్తులు ఊహాజనిత సమస్య అని తేలింది. గత 20 ఏళ్లలో ఈ సమస్య అంత గంభీరంగా ఎన్నడూ ముందుకు రాలేదు. 'అనర్హత నిబంధన'ను ఎప్పుడూ వినియోగించలేదు. నిజానికి ఇది ఆచరణలో నిరుపయోగమైంది. (దరఖాస్తు చేసుకున్న తర్వాత పని అవకాశాన్ని వదులుకొనే వ్యక్తికి నిరుద్యోగ భృతి చెల్లించాల్సిన అవసరం లేదనే ప్రత్యేక నిబంధన మాదిరిగా కాకుండా). విబి – జి రామ్ జి చట్టం ఈ నిబంధనను తొలగించిందనే వాస్తవం ఇందులో గాని లేదా అందులో గానీ లేదు. విబి – జి రామ్ జి చట్టం 'కార్మికుల హక్కును తిరస్కరించే ప్రభావం చూపిన పనిని వదులుకునే నిబంధనలను' తొలగిస్తుందని శ్రీ చౌహాన్ చేసిన వాదన గాలిబుడగే తప్ప అందులో ఏమీ లేదు.

**కేటాయించబడిన నిధులు**

మెరుగైన వాదనలను పరిశీలిస్తే, విబి – జి రామ్ జిలో ప్రధానంగా ఆకర్షించే అంశాలలో ఒకటి 'పాత డిమాండ్ ఆధారిత విధానానికి విరుద్ధంగా కేటాయించిన నిధులకు మారడం' అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గ్రూప్ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ పేర్కొన్నారు. విబి – జి రామ్ జి ఉపాధి హామీ సూత్రాన్ని సంరక్షిస్తుందనే సాకు మౌనంగా వదిలివేయబడింది. నిజానికి, ఉపాధి హామీ ఉంటే, అందుకు నిధులు 'డిమాండ్ –ఆధారితం'గా ఉండాలి. చాలా రాష్ట్రాలు కేంద్రం నిర్ణయించిన 'ప్రాథమిక కేటాయింపుల'కు మించి ఖర్చు చేయవు అని ఊహించుకుంటున్నారు. అది నిజంగా సహేతుకమైన ఊహా. విబి – జి రామ్ జి విమర్శకులు వాదిస్తున్నట్లుగా 'కేటాయించిన నిధులు' అనేవి వాస్తవ బడ్జెట్‌కు పరిమితి విధింపుగా మారే అవకాశం ఉంది.



'కేటాయించిన నిధులు' అని వాదించేవారు బడ్జెట్ పరిమితి అంశాన్ని అనుకూలంగా వినియోగించుకుంటారు. ముఖ్యంగా, రాష్ట్రాల మధ్య వ్యయాలను మరింత సమానంగా పంపిణీ చేయడానికి నిధులు సహాయపడతాయని వారు వాదిస్తున్నారు. మెరుగైన రాష్ట్రాలకు అనుకూలంగా ఎంజినరేగా ఖర్చులో అసమతుల్యత ఉందని ఆరోపించిన కారణంగా ఈ ఆందోళన తలెత్తుతుంది. వాస్తవానికి, గ్రామీణ కుటుంబాలకు ఎంజినరేగా ఉపాధి, పేదరికం ప్రాథమిక స్థాయిలు, లేదా తలసరి ఖర్చుల విషయంలో రాష్ట్రాల మధ్య ఎటువంటి గణాంక పోలిక లేదు. పేద రాష్ట్రాలలో (ఉదాహరణకు, ఛత్తీస్‌ఘఢ్) అలాగే సాపేక్షంగా బాగా ఉన్న రాష్ట్రాలలో (ఉదాహరణకు, తమిళనాడు) పెద్ద స్థాయిలో ఎంజి నరేగా పనులను ఉపయోగించుకోవడం కనిపిస్తుంది. అలాగే పేద , మెరుగైన రాష్ట్రాలలో (ఉదాహరణకు, బిహార్, గుజరాత్) తక్కువ స్థాయిల వినియోగించుకోవడం కనిపిస్తుంది. అయితే, రాష్ట్రాల మధ్య ప్రాథమిక స్థాయి పేదరికం, ఎంజినరేగా ఉపాధి మధ్య బలమైన సానుకూల సంబంధం ఉండాలని ఎవరైనా ఇప్పటికీ కోరుకోవచ్చు. బిహార్, జార్ఖండ్ వంటి పేద రాష్ట్రాలు ఎంజినరేగా ఉపాధి కల్పన, వ్యయాల్లో ఎక్కువ వాటాను కలిగి ఉంటే అది కచ్చితంగా ఉపయోగకరంగా ఉంటుంది. కానీ, బడ్జెట్ పరిమితులను విధించడం, ఖర్చులో భాగస్వామ్యం కోరటం వారికి సహాయపడదు. పేద రాష్ట్రాలలో ఎంజినరేగా వేతన రేట్లను పెంచడం చాలామంచి విధానమై ఉండేది. అది చాలాకాలంగా ఎదురుచూస్తున్న విషయం.

ఉపాధి హామీ అనేది భారతదేశానికే కాకుండా ప్రపంచానికే ఎంతో ఆశాజనకంగా ఉండే ఒక సాహసోపేతమైన ఆలోచన. భారతదేశంలోని కొన్ని మెరుగైన పాలన రాష్ట్రాలు దీనిని మిగతా వాటి కంటే మరింత సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నాయనడంలో ఆశ్చర్యమేమి లేదు. భారతదేశంలో పాఠశాలలో మధ్యాహ్న భోజనం నుండి ప్రసూతి ప్రయోజనాల వరకు అనేక సామాజిక కార్యక్రమాలు దక్షిణ భారతదేశంలో ప్రారంభమయ్యాయి. కాలక్రమంలో అవి మొత్తం దేశానికి విస్తరించబడ్డాయి. ఎంజినరేగా కూడా ప్రస్తుతానికి దక్షిణ భారతదేశంలో మెరుగ్గా పనిచేస్తుంటే, భయాందోళన వ్యక్తం చేస్తూ, బడ్జెట్ పరిమితులు విధించడానికి హేతువు లేదు. అన్నింటికంటే, ఎంజినరేగా బడ్జెట్ అంత పెద్దదేమీ కాదు. అది భారతదేశ జిడిపిలో కేవలం 0.25% మాత్రమే.

**విచ్చలవిడి వాదనలు**

విబి – జి రామ్ జికి అనుకూలంగా చెప్పే మరొక వాదన ఏమిటంటే, ఈ కొత్త చట్టం అవినీతిని నిర్మూలిస్తుంది. ఎలా? ఇందులో పారదర్శకత, సామాజిక తనిఖీలు, తదితరాలు ఎంజినరేగాలో మాదిరిగానే ఉంటాయి. ఈ చట్టంలో ప్రధానమైన వినూత్న ఆవిష్కరణ ఏమిటంటే అధునాతన డిజిటల్ సాంకేతిక టెక్నాలజీని వాడుకోవాలని పదే పదే వెంటపడటం. వదిలేయబడిన ఎంజి నరేగాలో ఇప్పటికే డిజిటల్ టెక్నాలజీని వాడుతున్నారు.ఈ సాంకేతికతలకు మిశ్రమ రికార్డు ఉంది. కొందరు కార్మికుల హక్కులను దెబ్బతీసి, ఎంజినరేగాపట్ల వారి ఆసక్తి ని తగ్గించారు, ఈ ప్రక్రియలో తరచుగా అవినీతికి ఆజ్యం పోశారు. సాంకేతిక లోపాలతో (2017లో జరిగినట్లుగా, వారి వేతనాలను ఎయిర్‌టెల్ వ్యాలెట్‌లకు మళ్లించడం వంటివి) కార్మికులు విసుగు చెందినప్పు డు, నిబంధనల ప్రకారం పనిచేయడం మానేసి, దోపిడీ లో వాటా కోసం ఎంజినరేగా నిధులను స్వాహా చేయడానికి తమ జాబ్ కార్డులు, బ్యాంకు ఖాతాలను ఉపయోగించే అవినీతిపరుడైన మధ్యవర్తికి సహకరించడం వారికి ఆసక్తి కలిగిస్తుంది. ఈ వైఫల్యాల నుండి పాఠా లు నేర్చుకునే బదులు, విబి – జి రామ్ జి చట్టం డిజిటల్ టెక్నాలజీపై అంధ విశ్వాసాన్ని శాశ్వతం చేస్తుంది. నేను విబి – జి రామ్ జి చట్టం మద్దతుదారుల తీవ్రమైన వాదనలపై దృష్టి సారించడం ద్వారా వారి పట్ల ఉదారంగా ఉండటానికి ప్రయత్నించాను. అయితే, వారిలో కొందరు అసత్యాలు, అబద్ధాల లో కూడా మునిగితేలుతున్నారు. ఉదాహరణకు, వారు ఎంజినరేగా నుండి కాపీపేస్ట్ చేయబడిన లేదా అటుఇటు మార్చి రూపొందించిన నిబంధనల ఘనతను విబి – జి రామ్ జి చట్టానికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉదాహరణకు, భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రతినిధి తుహిన్ సిన్హా చేసిన ఈ ప్రకటనను పరిశీలించండి: 'ఆలస్యంగా వేతనాల చెల్లింపు ఎంజినరేగా అత్యంత ప్రమాదకరమైన వైఫల్యాలలో ఒకటి, ఇది వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. విబి – జి రామ్ జి పక్షం రోజులు గరిష్ట కాలావధితో ప్రతివారం వేతన చెల్లింపులను తప్పనిసరి చేయడం ద్వారా దీనిని నేరుగా పరిష్కరిస్తుంది'. కచ్చితంగా, ఈ 'హెడ్ ఆన్' నిబంధన ఎంజి నరేగా నుండి కాపీ చేయబడిందని ఆయనకు తెలుసా? అదేవిధంగా, విబి – జి రామ్ జి చట్టంలోని సెక్షన్ 20 'సామాజిక తనిఖీలను బలోపేతం చేస్తుంది' అని చౌహాన్ పేర్కొన్నప్పుడు, అది ఎంజినరేగా సెక్షన్ 17కి కాస్త అటు ఇటుగా సారూప్యత ఉందని ఆయన తెలుసుకోవాలి.

క్లుప్తంగా చెప్పాలంటే, ఎంజినరేగా స్థానంలో విబి – జి రామ్ జి చట్టం తీసుకురావటంపై ఇటీవలి వాదనలలో విషయం చాలా తక్కువగా ఉంది. కొత్త చట్టం ప్రధాన ప్రయోజనం ఆ పథకాన్ని నడిపిస్తున్నట్లు, ఆ ఘనతను దోచుకోవడానికి మోదీ ప్రభుత్వానికి వీలు కల్పించడంగా కనిపిస్తోంది. జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని ఇలాగే కొన్ని ప్రధానమంత్రి పథకాల సమూహంగా కొత్తపేర్లు పెట్టటం జరిగింది. ఉపాధి హామీ, కార్మికుల హక్కులు వెనక్కి నెట్టబడ్డాయి.

**(వ్యాసకర్త మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం రూపకర్తల్లో ఒకరు)**

**(ది హిందూ సౌజన్యంతో..)**

లేఖ

# అమానవీయ కనీస పెన్షన్... పెంచేదెప్పుడు?

పెన్షన్ అనేది ఒక కార్మికుడు పదవీ విరమణ చేసిన తర్వాత ప్రతి నెల కుటుంబ పోషణకు, వృద్ధాప్యంలో ఒకరిపై ఆధార పడకుండా జీవించడానికి పొందే సొమ్ము. ఉద్యోగ జీవితంలో సమాజానికి, సంస్థకు తోడ్పడిన తర్వాత పదవీ విరమణ చేసిన వ్యక్తులు వృద్ధాప్యంలో గౌరవంగా జీవించడానికి వీలు కల్పించడం దీని ఉద్దేశ్యం. 1952లో సృష్టించబడిన ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ స్వతంత్ర భారతదేశంలోని మొదటి పెన్షన్ పథకం, పదవీ విరమణ చేసిన కార్మికులకు జీవనోపాధి భద్రత కల్పించడం దీని లక్ష్యం. ఇది ఫ్యాక్టరీ కార్మికులు మరియు రిజిస్టర్డ్ కంపెనీల ద్వారా ఉద్యోగం చేస్తున్న ఇతరులను కవర్ చేసింది. 1972లో స్థాపించబడిన సివిల్ సర్వీస్ పెన్షన్ పథకం, దీనిని ఓల్డ్ పెన్షన్ పథకం అని పిలుస్తారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులను కవర్ చేస్తుంది. ప్రైవేట్ కంపెనీల ఉద్యోగులు తమ జీతంలో 10 నుండి 12% వరకు తమ ప్రావిడెంట్ ఫండ్‌కు నిర్ణీత వాటాను విరాళంగా ఇచ్చేవారు. వారిని నియమించిన కంపెనీ కూడా అంతే మొత్తాన్ని తమ వాటాగా చెల్లించింది.

బొగ్గు ఉద్యోగులైన కోల్ ఇండియా, సింగరేణి ఉద్యోగులకు కూడ పెన్షన్ పథకం అమలు పరుస్తున్నారు. బొగ్గు ఉద్యోగులకు కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ ద్వారా పెన్షన్ చెల్లిస్తున్నారు. ఈ పెన్షన్ ఫండ్ నిర్వహణ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్నారు. కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం1998 అనే చట్టం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నారు. ప్రతి నెల ఉద్యోగి వేతనం నుంచి 7 శాతం అంతే మొత్తం కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలు కోల్ మైన్స్ పెన్షన్ ఫండ్‌కు జమ చేస్తున్నారు. కోల్‌మైన్స్ పెన్షన్ ఫండ్ స్థిరత్వం కొరకు బొగ్గు యాజమాన్యాలు ప్రతి టన్ను బొగ్గు అమ్మకంపై 20 రూపాయ లు పెన్షన్ ఫండ్‌కు జమ చేసినను బొగ్గు విశ్రాంత ఉద్యోగులకు నేటి ధరలకు అనుగుణంగా పెన్షన్ పెరగక తల్లడిల్లుతున్నారు.

ప్రైవేట్ కంపెనీ ఉద్యోగుల నుంచి సేకరించిన నిధిలో ఒక నిర్దిష్ట శాతాన్ని ఉద్యోగుల పెన్షన్ పథకంలో జమ చేశారు. ఈ విధంగా సేకరించబడిన నిధిని ప్రభుత్వ బాండ్ల వంటి సురక్షిత సాధనాలలో పెట్టుబడి పెట్టారు, దీని ద్వారా స్థిర వడ్డీ రేటు లభిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల ఓల్డ్ పెన్షన్ స్కీం విషయంలో ఎటువంటి నిధి సృష్టించ బడలేదు. పెన్షన్లు ప్రభుత్వ బడ్జెట్ నుండి చెల్లించబడ్డాయి.

2004లో జాతీయ పెన్షన్ స్కీం ఏర్పాటుతో ప్రైవేట్ కంపెనీలు పెన్షన్ నిధుల నిర్వహణను ప్రారంభించడానికి మార్గం సుగమం అయింది. ప్రస్తుతం పెన్షన్ నిధుల నిర్వహణ ద్వారా లాభం పొందుతున్న కంపెనీలలో ఆదిత్య బిర్లా సన్ లైఫ్ పెన్షన్ మేనేజ్‌మెంట్, టాటా పెన్షన్ మేనేజ్‌మెంట్, కోటక్ మహీంద్రా పెన్షన్ ఫండ్ ఎచ్ డిఎఫ్‌సి పెన్షన్ మేనేజ్‌మెంట్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ పెన్షన్ ఫండ్ మేనేజ్‌మెంట్, యాక్సిస్ పెన్షన్ ఫండ్ మేనేజ్‌మెంట్ ఉన్నాయి. పదవీ విరమణ తర్వాత జీవనోపాధికి భద్రత కల్పించడానికి బదులుగా కార్మికులపై మార్కెట్ నష్టాల భారాన్ని మోపే విధంగా ప్రైవేట్ ఆర్థిక సంస్థలకు ప్రయోజనాల కోసం పెన్షన్ వ్యవస్థను నిర్వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేసిన వారు ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం(ఇ పి ఎస్)95 ద్వారా, బొగ్గు ఉద్యోగులు కోల్ మైన్స్ పెన్షన్ స్కీం(సిఎంపిఎస్)98 ద్వారా నేటి ధరలకు అనుగుణంగా కరువు భత్యం(డి. ఎ) లేకుండా కనీస పెన్షన్ రూ.1,000 ల తో జీవించడం అత్యంత బాధాకరం. రిటైర్డ్ ఉద్యోగ సంఘాలు గత కొన్ని సంవత్సరాల నుంచి కనీస పెన్షన్ పెంచుతూ కరువు భత్యం తో కూడిన పెన్షన్ కావాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు. సభ్య సమాజం వారికి అండగా ఉండాలి.

ఆళవందార్ వేణు మాధవ్

# ఎఐ తో ఉద్యోగుల భద్రతకు పెనుముప్పు

## ఇ-కామర్స్ సంస్థ 'అమెజాన్'లో... 16,000 మంది ఉద్యోగులు 'ఔట్'

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) మూలంగా ఉద్యోగుల భద్రతకు పెనుముప్పుగా మారిందనే ఆందోళన సర్వత్రా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం మరోవిడత వేలాది ఉద్యోగులపై వేటు పడింది. కోవిడ్ మహమ్మారి సమయంలో పెరిగిన శ్రామిక శక్తిని బాగా తగ్గించుకున్న విషయం తెలిసిందే. ఇదిలాఉంటే ప్రముఖ ఇకామర్స్ సంస్థ 'అమెజాన్' మరోసారి భారీ సంఖ్యలో లేఆఫ్ ప్రకటించింది. రెండవ రౌండ్ మాస్ లేఆఫ్‌లలో భాగంగా దాదాపు 16,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు అమెజాన్ తాజాగా తెలియజేసింది. 2023 తర్వాత ఉద్యోగులను ఈ స్థాయిలో తొలగించడం ఇదే తొలిసారి. అప్పుడు దాదాపు 27,000 మందికి అమెజాన్ లేఆఫ్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే. కార్పొరేట్ వర్కర్లను భర్తీ చేయడానికి జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించాలని యోచిస్తున్న నేపథ్యంలో ఈ తాజా నిర్ణయం అనివార్యమైందని తెలిపింది. అయితే మూడు నెలల వ్యవధిలోనే ఈ రెండవసారి లేఆఫ్‌లను ప్రకటించడం ఉద్యోగవర్గాలలో తీవ్ర కలవరం సృష్టిస్తోంది.అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెథ్ గలెట్టి బుధవారం తన బ్లాగ్ పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. 2025 అక్టోబర్ నెలలో 14,000 మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించిన విషయం విదితమే. కంపెనీ లేయర్స్‌ను తగ్గించుకోవడం, యాజమాన్యాన్ని పెంచుకోవడం, బ్యూరోక్రసీని తొలగించి వేసే దిశగా కంపెనీ చర్యలు తీసుకుంటున్నదని బెథ్ గలెట్టి వివరించారు.



## మేడారంలో మెరుగైన వైద్య సేవలు

**ప్రజాపక్షం/ములుగు :** వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఆరోగ్య ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగటు సూచనల, ఆదేశాల మేరకు సమ్మక్క సారలమ్మ ఆదివాసీ కుంభమేళ మహా జాతరలో భక్త మహాజనులు ఎటువంటి అనారోగ్య సమస్యలకు గురి కాకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఆరోగ్యశాఖ డిసెంబర్ 25వ తేదీ నుండి నేటి వరకు వైద్యసేవలు అందిస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు 5 పర్యాయాలు ములుగు జిల్లాలో పర్యటించి సంబంధిత అనుబంధ శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహించి 74 ప్రత్యేక వైద్య నిపుణులతో, 3942 వివిధ రకాల కేడర్ సిబ్బందితో మేడారం మహా జాతరలో పనిచేస్తున్నారని తెలిపారు. వాటితో పాటు 40 బైక్ అంబులెన్స్, 32 అంబులెన్స్‌ల ద్వారా విస్తృత వైద్య సేవలు అందిస్తున్నామని, ఇప్పటి వరకు 19851 మందికి సమ్మక్క సారలమ్మ మేడారం మహా జాతరలో వైద్యసేవలు అందించామని వీరిలో అధిక సంఖ్యలో బెల్లం కొబ్బరికాయలతో గాయాలయ్యాయని, ఈ ఆదివాసీ మహా కుంభమేళాలో మెరుగైన వైద్యసేవలు అందించి వైద్యారోగ్యశాఖ జన్మధన్యం అయ్యిందని ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యాధికారులు డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రవి రాథోడ్, డాక్టర్ మల్లికార్జున్, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ విపిన్ కుమార్, డాక్టర్ క్రాంతికుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ రణధీర్, డాక్టర్ శ్రీకాంత్‌లు ఎంతో శ్రమిస్తున్నారని వారిని, జాతర విధులకు ప్రత్యేకంగా నియమించిన అధికారులు, సిబ్బంది సేవలను ప్రశంసించారు.


## జంపన్న వాగులో కొట్టుకుపోయిన భక్తుడు

### గాలింపులో మృతదేహం లభ్యం

### అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

**ప్రజాపక్షం/తాడ్వాయి :** మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర మొదటి రోజే విషాద ఛాయలు అలుముకున్నాయి. జనవరి 28న పవిత్ర జంపన్నవాగులో స్నానం కోసం దిగిన ఓ భక్తుడు నీటి ప్రవాహంలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన జాతరలో పాల్గొన్న భక్తుల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. మంచిర్యాల జిల్లాకు చెందిన కిరణ్(45) అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం అమ్మవార్ల దర్శనానికి మేడారం వచ్చాడు. సంప్రదాయం ప్రకారం జంపన్నవాగులో పుణ్యస్నానం ఆచరించేందుకు వాగులోకి దిగిన సమయంలో నీటిలో గల్లంతయ్యాడు. కళ్లముందే జరిగిన ఘటనతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల భక్తులు షాక్కు గురయ్యారు.సమాచారం అందుకున్న వెంటనే ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. గంటల తరబడి జంపన్నవాగులో గాలింపు చర్యలు చేపట్టాయి. చివరకు మృతదేహాన్ని వెలికితీయడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వాగులో కొన్నిచోట్ల అకస్మాత్తుగా లోతు పెరగడం, ప్రవాహం బలంగా ఉండటమే ప్రమాదానికి కారణమని అధికారులు భావిస్తున్నారు. జాతర ప్రారంభంతో భక్తుల రద్దీ పెరగడంతో వాగు పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తత లోపమే ప్రాణాంతకంగా మారుతోందని హెచ్చరిస్తున్నారు.

## కాకతీయుల ప్రాచీన కట్టడాలు, శిల్ప కళ అద్భుతం



ఫ్రెంచ్ దంపతులు మేరీ– లోరియట్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** కాకతీయ రాజుల కాలానికి చెందిన ప్రాచీన కట్టడాలు, చెక్కిన శిల్పాలు అమోఘంగా ఉన్నాయని ఫ్రాన్స్ దేశానికి చెందిన మేరీ–లోరియట్ దంపతులు ప్రశంసించారు. భారతీయ సంస్కృతి, ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలోని చారిత్రక వారసత్వం తమను ఎంతో ఆకట్టుకుంటోందని వారు తెలిపారు. బుధవారం హనుమకొండ చౌరస్తాలోని మహేంద్ర వస్త్రాలయానికి కొనుగోలు నిమిత్తం వచ్చిన వారితో ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతదేశంలో లభించే వస్త్రాలు తమ దేశంతో పోలిస్తే ఎంతో మన్నికగా ఉండటమే కాక ధరలు, కుట్టుకూలీ కూడా తక్కువగా ఉంటాయని చెప్పారు. మహేంద్ర వస్త్రాలయ యజమాని సుమిత్ కపూర్ మాట్లాడుతూ, మేరీ–లోరియట్ దంపతులు ఇప్పటివరకు ఎనిమిది సార్లు తమ షాప్‌కు రావడం తమకు గర్వకారణమని తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** అనుమానాస్పదంగా సుమారు రెండు నెలల క్రితం మృతి చెందిన ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించినట్లు ఎస్ఐ దూదిమెట్ల నరేష్ యాదవ్ తెలిపారు. దీనిపై ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోవర్ధనగిరి గ్రామశివారులో హైదరాబాద్ –వరంగల్ జాతీయ రహదారి పక్కనే గల పెట్రోల్ బంక్ సమీపంలోని కందకంలో గుర్తు తెలియని 55 నుండి 80 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉన్న వ్యక్తి గుంతలో పడి మృతి చెంది ఉన్నాడని, ఎవరు చూడకపోవడంతో శవం అస్తిపంజరాన్ని తలపించే విధంగా ఉందని ఆయన తెలిపారు. మృతుని ఒంటిమీద షర్ట్ లేదని, కేవలం ఒక నెక్కర్ షాట్ ఉందని గ్రామ పంచాయితి కార్యదర్శి త్రివేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/పాలకుర్తి:** ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజల శ్రేయస్సు, రాష్ట్రాభివృద్ధి, ప్రాంతంలో శాంతిసమృద్ధి నెలకొనాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆలయ పరిరక్షణకు అవసరమైన సహకారం అందిస్తామని ఆమె అన్నారు. ఆమె వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

### అవినీతి అక్రమాలకు పాల్పడిన వారే మాట్లాడటం సిగ్గుచేటు : ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధి చేయకపోవడమే కాకుండా, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. సెంట్రల్ జైలు ఎదురుగా ఉన్న కల్పలత సూపర్ బజార్ సహా పలు విభాగాల్లో భారీ అవినీతి జరిగిందని ఎమ్మెల్యే ఆరోపించారు. గత పాలకుల కనుసన్నల్లో అవినీతి జరిగిందని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపించారు. వినయ్‌భాస్కర్ అభివృద్ధి నిరోధకుడిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఒక్క అభివృద్ధి పని కూడా నియోజకవర్గానికి తీసుకురాలేదని, భద్రకాళి ఆలయ టెండర్ ఇంకా పూర్తికాలేదని, అయినా అవినీతి జరిగిందంటూ కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. 26 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు డిపాజిట్లు కాపాడుకోవడానికే పరిమితమవుతాయని వ్యాఖ్యానించారు. అల్లర్లు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని, ఇవి సంఘ వ్యతిరేక చర్యలకంటే కూడా ప్రమాదకరమని హెచ్చరించారు. రాజకీయంగా శాశ్వత ఎమ్మెల్యేగా ఉండాలనే తాపత్రయం లేదన్నారు. ప్రజలకు జవాబుదారీగా పనిచేయడమే తన లక్ష్యమని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవి శ్రీనివాస్ రావు, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయ శ్రీ,బ్లాక్ అధ్యక్షులు నాయిని లక్ష్మి రెడ్డి, బంక సంపత్, అంబేద్కర్ రాజు, అనుబంధ సంఘాల చైర్మన్‌కు పెరుమాండ్ల రామకృష్ణ, రాజ్ కుమార్, శ్రవణ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## మొదటిరోజు నామినేషన్లు 'నిల్'

**ప్రజాపక్షం/కేసముద్రం :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థుల్లో మొదటిరోజు నామినేషన్ వేయుటకు ఒక్కరు కూడా ముందుకు రాకపోవడంతో అధికారులు ఎదురుచూపులు చూడాల్సివచ్చింది. మంగళవారం ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా అధికారులు బుధవారం నుండి నామినేషన్ దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. మూడు రోజులే గడువున్న నేపథ్యంలో మొదటిరోజు భారీగా నామినేషన్లు వస్తాయనుకుంటే ఒక్క నామినేషన్ దాఖలు కాకపోవడంతో అధికారులు ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. నూతనంగా ఏర్పడిన కేసముద్రం మున్సిపాలిటీని 16 వార్డులుగా విభజించారు. 16 వార్డులకు మున్సిపల్ కార్యాలయంలో 8 కౌంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ టి.శ్రీనివాస రావు నేతృత్వంలో ఏర్పాట్లు చేయగా మహబూబాబాద్ డిఎస్పి తిరుపతిరావు ఏర్పాట్లను పరిశీలించారు. కేసముద్రం సర్కిల్ ఎస్ఐలు భద్రతా పరమైన చర్యలు తీసుకున్నారు.

## పంచాయతీ పాలకవర్గ సమావేశం



**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలంలోని పీచర గ్రామపంచాయితీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ మరిజె అనితనర్సింగారావు ఆధ్వర్యంలో పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ అనిత మాట్లాడుతూ గ్రామంలో పలురకాల అభివృద్ధి పనులతోపాటు గ్రామశివారులోని వేములపల్లి నుండి కొండాపూర్‌కు వెళ్లే దారిలో మెంథా తుఫాన్ ప్రభావంతో రోడ్డు ధ్వంసం కావడం వలన ప్రయాణీకులకు, రైతులకు ఇబ్బందులు తలెత్తున్నాయని రోడ్డు మరమ్మతులు చేయించడం జరుగుతోంది. అలాగే గ్రామంలో చిన్నవీధిలైట్లతో ఇబ్బందులు ఏదురవుతున్నాయని వాటి స్థానంలో 50 వీధి లైట్లకు 36 వాట్స్ కెపాసిటీ కలిగిన వీధిలైట్లను వేయడమే కాకుండా గ్రామంలోని మహిళా సంఘాలకు రెండుమహిళా భవనాలను నిర్మించడం జరుగుతోందని ఒకటి వడ్డెర కాలనీ సమీపంలోని మిషన్ భగీరథ ట్యాంక్ వద్ద మరొకటి రైతు వేదిక వద్ద నిర్మించడం జరుగుతోందని గ్రామపంచాయితీ పాలకవర్గ సమావేశంలో తీర్మాణం చేయడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ మరిజె అనితనర్సింగారావు, గ్రామ ఉపసర్పంచ్ గుడికందుల ప్రశాంత్, గ్రామ పంచాయితీ కార్యదర్శి రాజిరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# కెటికె 5వ ఇంక్లైన్‌లో అగ్నిప్రమాదం

### షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ల్యాంప్ రూమ్

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఫైవ్ ఇంక్లైన్లో తెల్లవారు జామున సుమారు నాలుగు గంటలకు అగ్ని ప్రమాదం జరిగిన ఘటన భూపాలపల్లిలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో కేటీకే ఫైవ్ ఇంక్లైన్లోని ల్యాంప్ రూమ్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల అందులో ఉన్న కార్మికులకు సంబంధించిన బ్యాటరీలు ల్యాంపులు కాలి బూడిదైనాయి. ఇదిలా ఉంటే సమ్మక్క సారలమ్మ జాతర పనిలో రెస్క్యూటివ్‌లో ఉండడం వల్ల సకాలంలో స్పందించకపోవడంతో అందులో ఉన్న సామాగ్రి అంత ఖాళీ బూడిదయింది. వెంటనే గమనించిన కార్మికులు సింగరేణి యాజమాన్యానికి సమాచారం అందించడంతో వెంటనే సహాయక చర్యలు చేపట్టి మంటలను ఆర్పి ఎక్కడికి అక్కడ మంటలను ఆర్పి వేశారు.

**తక్షణ చర్యలు చేపట్టాలి : ఎఐటియుసి నాయకులు**

భూపాలపల్లిలోని కేటీకే5 ఇంక్లైన్ గనిలో నైట్ షిఫ్ట్ సమయంలో లాంప్ రూమ్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో లాంప్ రూమ్‌లో ఉన్న ల్యాంపులు, చార్జింగ్ సామాగ్రి మొత్తం పూర్తిగా కాలిపోయి బూడిదైంది. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్,అసిస్టెంట్ సెక్రటరీలు సుధాకర్ రెడ్డి, ఎండి అబ్దుల్ ఆసిఫ్ పాషా, యాక్టింగ్ ఫిట్ సెక్రటరీ నాగేంద్రబాబు లాంప్ రూమ్‌ను సందర్శించి, ప్రమాదం ఎలా జరిగింది, దానికి గల కారణాలు ఏమిటి అన్న విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం విధుల్లో ఉన్న కార్మికుల పనులకు ఎలాంటి అంతరాయం కలగకుండా వేరే గనుల నుంచి తాత్కాలికంగా ల్యాంపులు తెప్పించే ఏర్పాట్లు చేయాలని యాజమాన్యానికి సూచించారు. అలాగే ఇలాంటి ప్రమాదాలు మరల జరగకుండా తగిన భద్రతా చర్యలు, ముం దస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని యాజమాన్యానికి సూచించారు. కార్మికుల భద్రతకు సంబంధించి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించి తక్షణ చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బృందం, కార్మికులు పాల్గొన్నారు.

# జాతరలో మెరుగైన వైద్యసేవలు అందించాలి

### రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్ర నాయక్



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర, అగ్రం పహాడ్ జాతర వెళ్లే భక్తులకు ఎలాంటి వైద్య పరమైన సహాయం అవసరమైనా అందించడం మన బాధ్యత అని, చికిత్సకు అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్ర నాయక్ సూచించారు. బుధవారం ఆయన జాతర కోసం ప్రత్యేకంగా కటాక్షపూర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరమును సందర్శించి ఆత్మకూరు వైద్యాధికారి డాక్టర్ స్పందనతో మాట్లాడి క్యాంపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మేడారం ప్రధాన రహదారిలో ఉన్న ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24/7 సేవలు అందించాలని ,108 సిబ్బంది, ఇతర లైన్ డిపార్ట్మెంట్స్‌తో సమన్వయంతో పనిచేయాలన్నారు. హనుమకొండ జిల్లా అగ్రం పహాడ్ జరుగు మినీ సమ్మక్క సారలమ్మ జాతరతో పాటు బస్‌స్టేషన్ రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేసిన (22) వైద్య శిబిరాలలో భక్తులకు మెరుగైన సేవలందించాలన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచనలకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు డాక్టర్ స్పందన తెలియజేశారు. డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య అగ్రం పహాడ్ జాతరను సందర్శించి తగు సూచనలు అందించినట్లు అలాగే డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి ఆత్మకూరు మండలంలో నిర్వహిస్తున్న ఆరు వైద్య శిబిరాలను సందర్శించినట్లు డైరెక్టర్‌కు తెలియజేయడం జరిగింది. డిఎంహెచ్ఓ ఆదేశాల మేరకు జాతరలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి భక్తులకు సూచనలు ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించినట్లు అలాగే అగ్రం పహాడ్ ప్రధాన వైద్యశాలలో (10) పడకలు, అన్ని రకాల అత్యవసర మందులతో పాటు ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఆరోగ్య ప్రదర్శనశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డాక్టర్ నర్సింగరావు, డాక్టర్ స్పందన, జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టీ మాధవరెడ్డి ,జునేడి, హెచ్ఈఓ కే.సంపత్‌లు కావలసిన ఏర్పాట్లలో పాల్గొన్నారు.



## సమ్మక్క సారక్క జాతరలో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలంలోని పీచర గ్రామ శివారులోని మినీ మేడారం సమ్మక్క సారక్క జాతరకు వచ్చే భక్తుల కోసం మౌలిక వసతుల కల్పనకు 4.80 లక్షలరూపాయలతో చేపట్టిన త్రాగునీటి సరఫరా సౌకర్యాలను, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు, హైమాస్ ఫ్లడ్ లైట్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆలయ చైర్మన్ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకొని మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థమే ప్రభుత్వ లక్ష్యమని పీచర సమ్మక్క సారక్క జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా త్రాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ కోమి, ఎంపిడిఓ లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ వైశాలి, పిఆర్ఎఈ రూపావతి, ఎస్ఐ ఎ.సురేష్, చైర్మన్ రమేష్, వైస్ చైర్మన్ రవీందర్, సర్పంచ్‌లు మరిజె అనిత నర్సింగారావు, బిల్ల యాదగిరి, కూరపాటి అశోక్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధగ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# పుర పోరులో కాంగ్రెస్ ఘన విజయం



ఎమ్మెల్యే నాగరాజు ధీమా

**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల కార్యాలయంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా అధ్యక్షుడు అయూబ్ సమక్షంలో పట్టణ కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త, ఉన్నత విద్యావంతుడు ఈగ దామోదర్‌ను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గంలో ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు, నాయకులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. 12 వార్డుల్లో 12 వార్డులు గెలిచి వర్ధన్నపేట నుంచి సీఎం రేవంత్ రెడ్డికి ఘన విజయం గిఫ్ట్‌గా అందిస్తామని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అయూబ్ మాట్లాడుతూ వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయూబ్ కోరారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టెస్కాబ్ క్యాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, డివిజన్ కార్పొరేటర్ల తూర్పాటి సులోచన సారయ్య, జన్ను శీభరాణి అనిల్ కుమార్, మాజీ జడ్పీటిసి బానోతు సింగిలాల్, టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, డివిజన్ అధ్యక్షులు కొంక హరిబాబు, సయ్యద్ ఇంతియాజ్, కాంగ్రెస్ నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, గడ్డం శివరాం ప్రసాద్, దేవకరకొండ అనిల్, కట్కూరి స్వామి, రమేష్ యాదవ్‌తో టౌన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉభయ కమ్యూనిస్టులతో మున్సిపల్ చైర్మన్ కైవసం చేసుకుంటాం: గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఉభయ కమ్యూనిస్టుల సహకారంతో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ కైవసం చేసుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దీమా వ్యక్తం చేశారు. బుధవారం భూపాలపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఉభయ కమ్యూనిస్టు నేతలు సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి బంధు సాయిలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ముఖ్య నేతలతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ, గడిచిన రెండేళ్ల సమయంలో భూపాలపల్లి మున్సిపాలిటీ లోని అన్ని వార్డుల్లో సుమారు రూ.350 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మారుతుందని కొంతమంది నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఒకవేళ జిల్లా మారితే నేను(ఎమ్మెల్యే) రాబోయే ఎన్నికల్లో పోటీ చేయనని ఎమ్మెల్యే అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు మీకు బుద్ధి చెప్పి, 30 వార్డుల్లో కాంగ్రెస్,ఉమ్మడి కమ్యూ నిస్టుల పార్టీ ల అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీ ఇచ్చి గెలిపించుకోవడం ఖాయమన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ.. భూపాలపల్లి మున్సిపాలిటీలో అనేక సమస్యలు ఉన్నాయని ఆ సమస్యలు పరిష్కారం భూపాలపల్లి అభివృద్ధిని ఆకాంక్షించి కాంగ్రెస్ ప్రభుత్వంతో గుర్తుపెట్టుకోవడం జరిగిందని, వచ్చే నెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ వామపక్ష పార్టీల అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటరాజు బాబు, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, సిపిఐ జిల్లా నాయకులు మోటపలుకుల రమేష్, గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/జనగామ :** నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎన్నికల కమీషన్ నిబంధనలు పాటించాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం నుండి మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో జనగామలోని మున్సిపల్ కార్యాలయం, స్టేషన్‌ఘన్‌పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ జనగామ మున్సిపాల్టీ పరిధిలో 30 వార్డులు ఉండగా మూడు వార్డులకు ఒక కేంద్రం చొప్పున 10 నామినేషన్ల స్వీకరణ కౌంటర్లు ఏర్పాట్లు చేశామన్నారు. స్టేషన్ ఘనపూర్‌లో 18 వార్డులు ఉండగా 6 కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్యానరు. ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, నామినేషన్లు దాఖల్ చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనల సూచనల మేరకు అవసరమైన ధృవీకరణ పత్రాలు నామినేషనల్‌తో తప్పక సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్‌రెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఏ.నర్సింహ్మారెడ్డి, వ్యయ పరిశీలకులు యస్.జయశ్రీ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరపుటకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ తదితర అంశాలపై చర్చించారు. రిటర్నింగ్ అధికారులతో మరోసారి సమావేశం ఏర్పాటు చేసి కూలంకుశంగా చర్చించారు. ఎన్నికలు సజావుగా నిర్వయించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ కోరారు. మున్సిపల్ ఎన్నికల నిర్వాహణపై బుధవారం రాజకీయ పార్టీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. నామినేషన్లు, స్క్రూటిని, విత్‌డ్రా, పోలింగ్, కౌంటింగ్ తదితర వివరాలు వివరించారు.

**కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ప్రజలు ఎన్నికలకు సంబందించిన సమస్య, సందేహాలను నివృత్తి కోసం హెల్ప్ డెస్క్‌కు పోన్ చేసి సమాచారం తెలుసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో 9390 830087 నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.




## ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ముఖ్య నాయకులతో మున్సిపాలటీ ఎన్నికలకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులు మాట్లాడుతూ జిల్లాలో గతంలో మూడు మున్సిపాలిటీలు ఉన్నాయని ఇప్పుడు ఐదు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. ఎన్నికలు జరగనున్న అన్ని మున్సిపాలిటీలల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ, మాజీ ఎంఎల్‌సి, కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ల , ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు వడ్డెబోయిన నర్సింహారావు, రాష్ట్ర కాంగ్రె స్ మహిళా నాయకురాలు పగడాల మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి: విద్యాచందన



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** జిల్లాలో జరగనున్న మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలు సజావుగా, పారదర్శంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించడంలో జోనల్ అధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన తెలిపారు. స్థానిక ఐడిఓసిలో నిర్వహించిన అకౌంటింగ్ టీమ్‌ల శిక్షణా కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడారు. ప్రతీ జోనల్ అధికారులు ఎన్నికల నిర్వహణపై నేరుగా పర్యవేక్షణ చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, ఎన్నికల సిబ్బంది నియామకం, ఓటర్లకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కఠినంగా అమలు చేయాలని, ఎలాంటి ఉల్లంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం వాటిల్లకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విధులు, బాధ్యతలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి సుదీర్, రాజశేఖర్, ఎంపిడిఓలు, శ్రీనివాస్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## మిలటరీ సర్వీసు ఇంజనీరింగ్ అధికారుల పర్యటన

సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఆరా



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి మందెరికల పాడు గ్రామ పంచాయితీలో గత నాలుగు రోజులుగా మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసు అధికారులు బస చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత అక్కడి భౌగోళిక పరిస్థితులు, ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. గిరిజనుల జీవన విధానాలు, స్థితిగతులపై వివరాలు తెలుసుకొంటున్నారు. కేంద్ర, రా ష్ట్ర పథకాల అమలు, వినియోగంపై ప్రత్యక్షంగా లబ్దిదారులను అడిగి తెలుసుకొన్నారు. పర్యటనలో భాగంగా ఐదవ రోజు మందెరికల పాడు గ్రామ పంచాయితీలో స్వయం సహాయ సంఘాల మహిళలు, రైతులు, ప్రజలతో అటవీ, వ్యవసాయ, పశుసంవర్థక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పం చాయితీ సర్పంచ్ బానోత్ లక్ష్మి, ఉప సర్పంచ్ కందుకూరి శ్రీను, మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసు అధికారులు అనురాగ్ శ్రీవాత్సవ, ఎండి తస్కెనల్, మయాంకుచౌదరి, సునీల్, చందన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి శంభో శంకర్, పశుసంవర్థక శాఖ వైద్యులు తేజ, ఎపిఎం మీరాభీ, టిసీలు పద్మ, రవికుమార్, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు సునీత, అచ్చమ్మ, ఈరూలాల్, వెంకటేశ్వర్లు, మోజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యానికి ఏడేళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** నిర్లక్ష్యంగా వ్యవహరించి ఓ బాలుని మృతికి కారణమైన కేసులో ఇద్దరు వ్యక్తులకు ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.ఉమాదేవి సంచలన తీర్పును బుధవారం వెల్లడించారు. వివరాల్లోకి వెళితే... కల్లూరు మండలం శాంతినగర్ కాలనీలో కంచపు పెద్ద సత్యం ఇంట్లో 2022 ఆగస్టు 22న వివాహం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ స్తంభాల నుంచి విద్యుత్‌ను ఎటువంటి అనుమతి లేకుండా వినియోగించారు. నిర్లక్ష్యంగా విద్యుత్ వైర్లను అడ్డదిడ్డంగా ఏర్పాటు చేయడంతో ఆ విద్యుత్ తీగలు తగిలి కొత్తపల్లి రాణా హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ హుస్సేన్‌ను ఖమ్మం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడని కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్లూరు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి ఉమాదేవి కంచపు పెద్ద సత్యం, కంచపు లక్ష్మయ్యలకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్‌కుమార్‌రెడ్డి వాదించగా కోర్టు లైజనింగ్ అధికారులు శ్రీకాంత్, హోంగార్డ్ ఆయూబ్‌లు సహకరించారు.

## ఏజెన్సీ నుండి జాతీయ స్థాయి హాకీ జట్టుకు భవిత



**ప్రజాపక్షం/భద్రాచలం:** ఏజెన్సీకి చెందిన విద్యార్థినీ తడికల బప్పి భవిత అండర్ 17 జాతీయ హాకీ జట్టులో చోటు సాదించింది. పాల్వంచలోని సోషల్ వెల్ఫేర్ రెషిడెన్షియల్ పాఠశాల్లో 8వ తరగతి చదువుతున్న భవిత రాష్ట్రస్థాయిలో వనపర్తిలో జరిగిన హాకీ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ఆమెను అండర్ 17 జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. ప్రస్తుతం జార్ఖాండ్‌లోని రాంచీలో ఈనెల 29 నుండి 5 రోజుల పాటు జరుగుతున్న జాతీయ స్థాయి హాకీ క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లింది. జార్ఖాండ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయ దరహాసంతో తిరిగి రావాలని, రాబోయే రోజుల్లో భారత జాతీయ హాకీ ప్రధాన జట్టుకు ఎంపికై ఏజెన్సీకి పేరు తెచ్చి దేశ ప్రతిష్టను ప్రపంచం ముందు నిలపాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## సవరణ

ఐదు రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బ్యాంకు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించిన విషయం విదితమే. 'ప్రజాపక్షం' దినపత్రికలో ఐదు రోజుల పని దినాలకు బదులుగా ఐదు గంటల పని దినాలు అని పొరపాటుగా ప్రచురించడమైంది. దీనిని ఐదు గంటలకు బదులు ఐదు రోజుల పనిదినాలుగా భావించగలరు.

# మురుగు నీటికి శాశ్వత పరిష్కారం

- రూ.1250 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రతిపాదనలు
- అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మురుగు నీటికి శాశ్వత పరిష్కారం కోరకు ఖమ్మం నగరంలో రూ.1250 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని 21వ డివిజన్‌లో రూ.5.45 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరంలో మురుగు నీటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.1250 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడతామన్నారు. ఖమ్మం నగరంలో త్రాగునీటి సమస్య లేకుండా రూ.250 కోట్లతో త్రాగునీటి పథకం పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఖమ్మం నగరం క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండేందుకు నగర ప్రజలు సహకరించాలన్నారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు



నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కార్పొరేటర్ ఆళ్ల నిరీషా అంజిరెడ్డి, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదాం

ఫిబ్రవరి 12న జరిగే సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేంత వరకు పోరాటం కొనసాగించాలని కార్మిక సంఘాల సంయుక్త సమావేశం పిలుపునిచ్చింది. ఫిబ్రవరి 12న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మె జయప్రదం కోరుతూ ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో వివిధ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం బుధవారం జరిగింది. ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, టియుసిఐ, బిఆర్‌టియు సంఘాలు పాల్గొన్నాయి. సంయుక్త సమావేశంలో కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు కార్మిచ చట్టాలు లేని దేశంగా భారతదేశాన్ని మార్చాలని చూస్తుందని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తల కోసం కార్పొరేట్ల కోసం బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందని ఆరోపించారు. అనేక దశాబ్దాల పాటు పోరాటాలు సాగించి ఎందరో కార్మికుల త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని కార్మికుల పోరాట ఫలితంగా ప్రస్తుతానికి లేబర్ కోడ్‌ల అమలు ఆగిన తిరిగి ప్రభుత్వం అమలు చేసేందుకు పూనుకుందని వారు తెలిపారు. దీనికి సంబంధించి గడిచిన నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసిందని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి దాని స్థానంలో విబిజి రామ్‌జీ పథకాన్ని తీసుకు వచ్చిందని



దీని వల్ల గ్రామీణ పేదలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ఈ పథకాన్ని ఉపసంహరించుకుని గతం మాదిరి రాష్ట్రాలపై భారం వేయకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల కారణంగా 40 కోట్ల మంది సంఘటిత అసంఘటిత రంగ కార్మికులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. కార్మిక చట్టాలను మోడీ సర్కార్ నియంతృత్వ పద్ధతుల్లో రద్దు చేశారని అంతర్జాతీయ కార్మిక సంస్థ సూచనలను కూడా పట్టించుకోలేదని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, సిఐటియు నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, టియుసిఐ నాయకులు సూర్యం, ఐఎన్‌టియుసి నాయకులు పాషా, బిఆర్‌టియు నాయకులు జనార్ధన్ తదితరులు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, టియుసిఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సుభాన్, వివిధ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాపకొల్లు రోడ్డును వెడల్పు చేసి ట్రాఫిక్ సమస్య తీర్చాలి



ఆర్అండ్‌బి అధికారుల హామీతో ఆందోళన విరమణ

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలపరిధిలోని పాపకొల్లు రహదారి మూడు అడుగుల వెడల్పు పెంపు సరిపోదని ఏడు అడుగుల వెడల్పు పెంచితే ట్రాఫిక్ సమస్య లేకుండా ఉంటుందని, ఆర్అండ్‌బి అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి రోడ్డు వెడల్పు పెంచాలని కోరుతూ సిపిఐ జూలూరుపాడు మండల సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ మాట్లాడుతూ నిత్యం వందలాది వాహనాలు మెయిన్ రోడ్డుకి వస్తున్నాయని రహదారి మూడు అడుగులు వెడల్పు ఉంటే తరచూ ట్రాఫిక్ సమస్య వల్ల ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ప్రధానంగా ఎస్బిఐ, ఎపిజివిబి బ్యాంకులు ఇటు ఉండటంవల్ల వాహనదారులు అధిక సంఖ్యలో రావటం జరుగుతుందని, వాహనాలు బయట పార్కింగ్ చేస్తే తరచూ ట్రాఫిక్ సమస్య వల్ల ఆటో కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నప్పటికీ, అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు వెడల్పు పెంచి ఇబ్బందులు లేకుండా చూడాలని, కోరారు ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులకు ఆర్ అండ్ బి అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చారని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్కే నాగుల్ మీరా, యాలంకి మధు యాస రోశయ్య, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా, కొండా వీరయ్య, గార్ల పాటి వీరభద్రము, ఆటో వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కార్యదర్శి నిమ్మటూరి లచ్చయ్య, గార్లపాటి శివకృష్ణ, ఎస్కే బుడెన్ పాషా, మోదుగు దానేలు, గార్లపాటి కిరణ్ పటేలు కృష్ణ ఇల్లంగి సుందరావు కోటి వెంకటేశ్వర్లు రామకృష్ణ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాటరీ దొంగలు అరెస్ట్

రూ. 2.16 లక్షల విలువైన బ్యాటరీలు స్వాధీనం

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ట్రాక్టర్లు, జేసిబిలు, బస్సులకు ఉన్న బ్యాటరీలు చోరీ చేస్తున్న ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2.16 లక్షల విలువ చేసే బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు రఘునాథపాలెం ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. ఏసిపి రమణమూర్తి ఆదేశాల మేరకు సిఐ ఉస్మాన్ షరీఫ్ ఆధ్వర్యంలో ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ ఎదుట జింకలతండా క్రాస్ రోడ్డు వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపి28 బిఈ 6372 నెంబరు గల వ్యాగనార్ కారును తనిఖీ చేస్తుండగా కారు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పెనుబల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఎస్‌కె అక్బర్ వృత్తి కారు డ్రైవర్, మరొకరు ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లికి చెందిన షేక్ సైదులు వృత్తి కారు డ్రైవర్‌గా గుర్తించామన్నారు. వీరిరువురు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో బ్యాటరీల దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. రఘునాథపాలెం మండలం గడ్డికుంట గ్రామంలో ఆపి ఉన్న బస్సు నుంచి ఒక బ్యాటరీ, ఖమ్మం కోర్టు ఆవరణలో ఉన్న జనరేటర్ నుంచి ఒక బ్యాటరీ, కూసుమంచి మండలం జీళ్లచెరువు దగ్గర వ్యవ



సాయ భూమి వద్ద ఒక బ్యాటరీ, తైవాన్ పంపు దొంగిలించారు. రఘునాథపాలెం యాపిల్ సెంటర్ వద్ద ఫ్లైయాష్ బ్రిక్స్ ఫ్యాక్టరీలో మూడు ట్రాక్టర్ల నుంచి మూడు బ్యాటరీలను, వి.వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉన్న ఒక ట్రాక్టర్ నుంచి ఒక బ్యాటరీ, అదే గ్రామంలో మరో ట్రాక్టర్ నుంచి ఒక బ్యాటరీ, కామేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గోవింద్రాల గ్రామంలో పాఠశాలలో ఇన్వర్టర్ బ్యాటరీలు ఆరు, ఒక గ్యాస్‌బండ, డ్రాగన్ ఫ్రూట్ పొలంలో ఇనుప రాడ్లను, ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలపేట సమీపంలో జెవిడి వెంచర్‌లో మూడు టిప్పర్ల నుంచి ఆరు బ్యాటరీలను దొంగిలించినట్లు వారు అంగీకరించారని సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. దొంగిలించిన బ్యాటరీలను రఘునాథపాలెం పల్లె ప్రకృతి వనం చెట్ల పొదల్లో దాచి అట్టి బ్యాటరీలను ఖమ్మంలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు గుర్తించామన్నారు. వారి వద్ద నుంచి రూ.2.16 లక్షల విలువ చేసే బ్యాటరీలు, గ్యాస్‌బండ, ఇనుప వస్తువులు, వ్యాగనార్ కారును స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చినట్లు సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

# సర్వం 'కార్పొరేట్' మయం

మూతపడుతున్న చిన్న చిన్న వ్యాపారాలు

దినసరి కూలీలుగా మారిన చిరు వ్యాపారులు

వ్యవసాయంపైన కార్పొరేట్ పడగ

**ప్రజాపక్షం/ఖమ్మం :** సర్వం 'కార్పొరేట్' మయమవుతుంది. ఎప్పుడో చేతి వృత్తుల చేతులు విరగొట్టిన కార్పొరేట్ సంస్థలు ఇప్పుడు చిన్న, మధ్యతరహా వ్యాపారులతో పాటు సాంప్రదాయ వ్యాపారాలను మింగేశాయి. అనేక దశాబ్దాల పాటు వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది కుటుంబాలు వీధినపడుతున్నారు. దశాబ్దాల పాటు వ్యాపారాలు చేసిన వారు ఇప్పుడు కార్పొరేట్ సంస్థల్లో చిరుద్యోగులుగా, రోజు వారి కూలీలుగా పని చేస్తున్నారు. ఇప్పుడు చిన్న చిన్న బంగారు దుకాణాలు మటుమాయమయ్యాయి. గతంలో బంగారు దుకాణాలు జనాలతో కిటకిటలాడేవి. దుకాణాల పక్కనే కంసాలీలు బంగారం, వెండి వస్తువులకు మెరుగులు పెడుతూ చిన్న చిన్న మరమ్మతులు చేసేవారు. ఇప్పుడు ఖజానా, జోయాలుక్కాస్, భీమా, లలిత, చెన్నైయ్ షాపింగ్ మాల్ లాంటి కార్పొరేట్ సంస్థలు వచ్చి మొత్తం చిరు, మధ్యతరహా వ్యాపారాలను లేకుండా చేశాయి. వస్త్ర వ్యాపారానిది అదే పరిస్థితి. గతంలో గ్రామాల వెంట తిరుగుతూ బట్టలు విక్రయించే వారు. పట్టణాలలో సాంప్రదాయ వస్త్ర వ్యాపారం నిర్వహించే దుకాణాలు ఉండేవి ఇప్పుడు అవి మచ్చుకు కూడా కానరావటం లేదు. ఏటు చూసినా కార్పొరేట్ సంస్థలు కబలించి వేస్తున్నాయి. విద్యా రంగం గురించి అందరికీ తెలిసిందే. గతంలో ప్రభుత్వ విద్యా సంస్థలను కబళించిన కార్పొరేట్ విద్యా సంస్థలు ఇప్పుడు చిన్న చిన్న విద్యా సంస్థలు మూతపడే పరిస్థితులు తీసుకు వస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కార్పొరేట్ వైపే మొగ్గు చూపుతున్నారు. అన్ని వ్యాపారాలు ఇప్పుడు కార్పొరేట్ సంస్థల చేతిలో చిక్కి కనుమరుగవుతున్నాయి.

**వ్యవసాయంపై కార్పొరేట్ పడగ :**

వ్యాపార సంస్థలను కబళించిన కార్పొరేట్ రంగం ఇప్పుడు వ్యవసాయ రంగంపై కన్నేసింది. గ్రామాల్లో మునుపెన్నడు లేని రీతిలో పెద్ద పెద్ద భూ కమతాలు వెలుస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలు వందల ఎకరాల భూములను కొనేస్తున్నాయి. ఇప్పటికే మధ్యతరగతి, సన్న, చిన్నకారు రైతులు తమ భూములను అమ్ముకుని కార్పొరేట్ భూముల్లో కూలీలుగా పనిచేయడమో లేక కౌలుకు తీసుకుని పనిచేస్తున్నారు. వంద సంవత్సరాల నాటి తెలంగాణలోని భూస్వాములు భూ కమతాల మాదిరి ఇప్పుడు తెలంగాణలో భూ కమతాలు విస్తరిస్తున్నాయి. కేవలం ప్రధాన రోడ్లకు ఆనుకుని ఉన్న గ్రామాల్లోనే కాకుండా మారుమూల గ్రామాల్లో సైతం సంపన్న వర్గాలు, కార్పొరేట్ శక్తులు భూములను కొనుగోలు చేస్తున్నాయి. ఇది భవిష్యత్తులో పలు అనార్థాలకు దారి తీసే అవకాశం ఉంది. వ్యవసాయ రంగం కార్పొరేట్ పరమైతే గ్రామీణ వాతావరణం పూర్తిగా మారిపోతుంది.



**కార్పొరేట్‌తో దెబ్బతింటున్న మానవ సంబంధాలు :**

కార్పొరేట్ వ్యాపారాల పుణ్యమా అని మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి. గతంలో వ్యాపారి, వినియోగదారుని మధ్య విస్తృత స్థాయిలో సంబంధాలు ఉండేవి. అత్యవసర పరిస్థితుల్లో వ్యాపారులు అప్పులు ఇచ్చేందుకు కూడా వెనుకాడే వారు కాదు. కొనుగోళ్లకు వెళ్లినప్పుడు మంచి చెడు మాట్లాడుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితిలు పూర్తిగా దూరమయ్యాయి. కార్పొరేట్ సంస్థల పుణ్యమా అని మానవ సంబంధాలు బిల్లు, చెల్లింపు పద్ధతికి దిగజారాయి. కార్పొరేట్ విస్తరణ ప్రజా జీవితానికి ప్రతిబంధకంగా మారే అవకాశం ఉంది. ఇదే సమయంలో నిరుద్యోగం పెరగడంతో పాటు దేశ సంపద పోగుపడే అవకాశం ఉంది. వ్యాపారాలను తమ గుప్పెట్లో పెట్టుకుని వస్తు ధరలను నియంత్రించడం లేదా నిర్ణయించే అధికారానికి చేరుకోవచ్చు. ఇది వినియోగదారులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. కార్పొరేట్ ముప్పును తప్పించడంలో పాలక వర్గాలు దృష్టిసారించకపోగా మరింతగా ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవడం శోచనీయం.



## 50 కేజీల గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/భద్రాచలం:** ఒడిస్సా నుండి కేరళాకు అక్రమంగా తరలించుకు పోతున్న సుమారు 50.04కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు భద్రాచలం పట్టణ శివారులోని ఇసుర ర్యాంపు వద్ద కాపు గాసిన అధికారులు అటుగా వేగంగా వస్తున్న వాహనాన్ని ఆపి సోదాలు చేయగా గాంజాయి లభ్యమైంది. దీంతో నిందితులకు ఆరా తీసేందుకు ప్రయత్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అభయ్ సురేష్, మంజుమాన్, సురేంద్రమినాల్, అనంత కృష్ణ అనే నలుగురుని అదుపులోనికి తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడ్డగంజాయి విలువ సుమారు రూ.28లక్షల వరకు ఉంటుంది. వారు ఉపయోగించిన ఫీయట్ కారుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, రూ.17వేల నగదను కూడా స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరిలించారు. ఎన్ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఎంఏ కరీం, కానిస్టేబుల్ సుదీర్, వెంకట్, హనుమంతరావు, వీరబాబు, ఉపేందర్‌లున్నారు.



## బోధనలో సాంకేతికతను జోడించండి

జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్యజైని

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బోధనలో సాంకేతికతను జోడించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్యజైని తెలిపారు. పిఎంశ్రీ పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఐసిటి అంశాలపై రెండు రోజులు శిక్షణా తరగతులు బుధవారం జిల్లా విద్య శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కో డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్యజైని ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. కంటెంట్, పెడగాజీ, అసెస్మెంట్, కమ్యూనికేషన్ అంశాల్లో ఐసిటి వినియోగాన్ని పెంచడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మెరుగైన అభ్యాసన ఫలితాలు సాధించవచ్చునని ఉపాధ్యాయులకు సూచించారు. శిక్షణలో గూగుల్ అంశాలైన గూగుల్ పామ్స్, గూగుల్ షీట్లు, గూగుల్ డాక్యుమెంట్లు, గూగుల్ స్లైడ్‌లను ఎలా రూపొందించాలి, ఎలా వినియోగించుకోవాలి, వాటి అవసరం ఏమిటి, విద్యార్థులకు మెరుగైన బోధన, అభ్యాసన ప్రక్రియలను ఏవిధంగా జరపవచ్చో తదితర అంశాలపై ఇంటరాక్టివ్‌గా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులతో సాధన చేయించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ వల్ల విద్యార్థులకు మేలు కలుగుతుందని తెలిపారు.

## తొలి రోజు 14 నామినేషన్లు

**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా తొలి రోజున బుధవారం ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 14నామినేషన్లు దాఖలయ్యాయి. ఖమ్మం జిల్లాలో ఐదు మున్సిపాలిటీలకు గాను ఏడు నామినేషన్లు దాఖలు కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పోరేషన్‌తో పాటు రెండు మున్సిపాలిటీలలో ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. కొత్తగూడెం కార్పొరేషన్‌లో 56వ డివిజన్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి బండారు రజిత, 19వ డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా బోడా కృష్ణ, ఎనిమిదవ డివిజన్‌లో బిఆర్ఎస్ అభ్యర్థిగా కాంపల్లి సంధ్య నామినేషన్లు దాఖలు చేశారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలో 3వార్డు నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా ఉపాధ్యాయుల సూర్యప్రకాష్‌రావు, 22వ డివిజన్ నుండి బిజెపి అభ్యర్థి నార్ల వీరాంజనేయులు, మూడవ వార్డు నుండి బిజెపి అభ్యర్థిగా ఆంజనేయులు నామినేషన్ దాఖలు చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో 23వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా అనిత, 24వ వార్డు నుంచి సిపిఎం అభ్యర్థిగా హైమావతి నామినేషన్లు దాఖలు చేశారు. వైరాలో రెండు నామినేషన్లు దాఖలు కాగా సత్తుపల్లిలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. మధిర, కల్లూరు మున్సిపాలిటీలలో ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

**కొనసాగుతున్న పొత్తుల చర్చలు :**

వివిధ రాజకీయ పక్షాల మధ్య పొత్తుల విషయమై చర్చలు సాగుతున్నాయి. ఒక్కో మున్సిపాలిటీకి ఒక్కో రీతిలో చర్చలుకొనసాగుతున్నాయి. నామినేషన్ల ఘట్టానికి సంబంధించి తొలి రోజు పూర్తయిన చర్చలు కొలిక్కి రాలేదు. మధిర, ఏదులాపురం మున్సిపాలిటీలలో బిఆర్ఎస్, సిపిఎంల మధ్యఒప్పందం కుదిరినట్లు సమాచారం.

## మొదలైన నామినేషన్ల పర్వం

**ప్రజాపక్షం/కొత్తగూడెం:** జిల్లాలోని మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల హడావిడి మొదలైంది. ఇందులో భాగంగా తొలిరోజు కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలో మూడు నామినేషన్ల దాఖలు కాగా, ఇల్లెందు మున్సిపాలిటీలో 1, అశ్వారావుపేట మున్సిపాలిటీలో 3 నామినేషన్లు పడ్డాయి. కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని 19 డివిజన్‌లో ఇండిపెండెంట్ అభ్యర్థి బోడ కృష్ణ, 56 డివిజన్లో బిఆర్ఎస్ అభ్యర్థి బండారు రజిత, 8వ డివిజన్(పాల్వంచ)లో బిఆర్ఎస్ అభ్యర్థి కాంపెల్లి సంధ్య నామినేషన్లు సమర్పించారు. అదే విధంగా ఇల్లెందు 6 వార్డులో బిజెపి అభ్యర్థి నాయిని హైమావతి నామినేషన్ వేయగా, అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో వార్డు 3లో బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు, వార్డు 22లో బిజెపి అభ్యర్థి వారి నామినేషన్లు సమర్పించారు.



## ముగిసిన కివీస్ బ్యాటింగ్..
# భారత్ టార్గెట్ 216

విశాఖ వేదికగా భారత్‌తో జరుగుతున్న నాలుగో టి–20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 215 పరుగులు చేసింది. ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్ (62), డెవాన్ కాన్వే(42) మంచి శుభారంభాన్ని ఇచ్చారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరి అనంతరం వచ్చిన మిగిలిన బ్యాటర్లు ఆశించిన మేర రాణించకపోవడంతో కివీస్ 215 పరుగులకే పరిమితమైంది. ఐదు టి–20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం విశాఖ వేదికగా న్యూజిలాండ్, భారత్ మధ్య నాలుగో మ్యాచ్ జరుగుతుం ది. ఈ క్రమంలో టాస్‌ఓడిన కివీస్ మొదట బ్యా టింగ్ చేసింది. ఓపెనర్ టిమ్ సీఫెర్ట్(36 బంతుల్లో 62) అర్ధ సెంచరీతో రాణించాడు. అతడి తోడు మరో ఓపెనర్ కాన్వే(23 బంతుల్లో 44) చెలరేగి ఆడాడు. దీంతో వీరిద్దరు తొలి వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. 100 పరుగులకు కాన్వే తొలి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. అనంతరం రచిన్‌రవీంద్ర రెండు పరుగులు మాత్రమే చేసి బుమ్రా బౌలింగ్‌లో ఔటయ్యాడు.

## టి–20 ర్యాంకింగ్‌లతో సత్తాచాటిన
# టీమిండియా ప్లేయర్లు




అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) బుధవారం టి–20 ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. తాజాగా ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తాచాటారు. ముఖ్యంగా బ్యాటర్లు భారీగా తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. న్యూజిలాండ్ టి–20 సిరీస్‌లో తొలి మూడు టి–20ల్లో అద్భుత ప్రదర్శనలు చేసిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఏకంగా ఐదు స్థానాలు మెరుగుపర్చుకొని 12వ స్థానం నుంచి ఏకంగా 7వ స్థానంలోకి దూసుకొచ్చాడు. ప్రస్తుతం సూర్య 717 రేటింగ్ పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచాడు. టీమిండియా విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ చాలా కాలం నుంచి అగ్రస్థానంలోనే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ర్యాంకింగ్‌లో తన రేటింగ్ పాయింట్లను మరింత పెంచుకున్నాడు. ప్రస్తుతం 929 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మిగతా భారత బ్యాటర్ల విషయానికి వస్తే స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా 53, శివమ్ దూబే 59, రింకూ సింగ్ 68 స్థానాల్లో ఉన్నారు. గాయం కారణంగా న్యూజిలాండ్ సిరీస్‌కు దూరంగా ఉన్నా తిలక్ వర్మ తన మూడో స్థానాన్ని కాపాడుకున్నాడు. ఇక భారత బౌలర్ల విషయానికి వస్తే వరుణ్ చక్రవర్తి టాప్ ప్లేసులోనే కొనసాగుతున్నాడు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా 4 స్థానాలు ఎగబాకి 13కు, రవి బిష్ణోయ్ 13 స్థానాలు ఎగబాకి 19కి, హార్దిక్ పాండ్యా 18 స్థానాలు ఎగబాకి 59వ స్థానానికి చేరారు. మిగతా భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్ 16, కుల్దీప్ యాదవ్ 25 స్థానాల్లో కొనసాగుతున్నారు. ఇక ఆల్‌రౌండర్ల విషయానికొస్తే.. భారత ఆటగాళ్లు హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే ఒకటి, 6 స్థానాలు మెరుగుపర్చుకొని 3, 12 స్థానాలకు ఎగబాకారు. సికందర్ రజా, సైమ్ అయూబ్ టాప్ 2 ప్లేసుల్లో కొనసాగుతున్నారు.

## జెమీమా రోడ్రిగ్స్‌కు బిగ్ షాక్



భారత మహిళా జట్టు స్టార్ ప్లేయర్, ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్‌కు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. డబ్ల్యుపిఎల్–2026 డిసి జట్టు సారథిగా ప్రమోషన్ పొందిన జెమీమా.. కెప్టెన్‌గా ఆకట్టుకోలేకపోతోంది. ఇప్పటికే ఈ టీమిండియా స్టార్ సారథ్యంలో వరుస పరాజయాలు చవిచూసిన ఢిల్లీ జట్టు.. తాజాగా మంగళవారం గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ స్వల్ప పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఫలితంగా ఇప్పటికి ఏడు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఢిల్లీ ఖాతాలో నాలుగో పరాజయం నమోదైంది. గుజరాత్ చేతిలో ఓటమితో షాక్‌లో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్‌కు మరో బిగ్ షాక్ తగిలింది. స్లో ఓవర్ కారణంగా ఆమెకు జరిమానా పడింది. గుజరాత్తో మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో ఓవర్ల కోటా పూర్తి చేయనందున జెమీమాకు రూ. 12 లక్షల జరిమానా పడింది. ఈ విషయాన్ని డబ్ల్యుపిఎల్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. 'వడోదర వేదికగా మంగళవారం గుజరాత్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో స్లో ఓవర్ కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్‌కు జరిమానా విధించడమైనది. ఈ సీజన్లో ఆమె స్లో ఓవర్ రేట్ మెయింటెన్ చేయడం ఇదే తొలిసారి. కావున డబ్ల్యూపీఎల్ నిబంధనల ప్రకారం రూ. 12 లక్షల జరిమానాతో సరిపెట్టాము' అని డబ్ల్యుపిఎల్ యాజమాన్యం పేర్కొంది. ప్రపంచ కప్–2025 సెమీ ఫైనల్లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో జెమీమా (127 పరుగులు)అద్భుతమైన బ్యాటింగ్‌తో ఓవర్ నైట్ స్టార్ అయింది. ఇంకా చెప్పాలంటే.. ఆ మ్యాచ్‌తోనే జెమీమా గురించి ప్రపంచానికి తెలిసింది. ప్రపంచ కప్‌తో వచ్చిన గుర్తింపుతో ఆమెకు డబ్ల్యుపిఎల్లో ప్రమోషన్ వచ్చింది. ఢిల్లీ కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సీజన్‌లో ఢిల్లీకి కప్ అందించాలని జెమీమా భావించింది. అయితే అందుకు భిన్నంగా ఢిల్లీ ఓటములు చవిచూస్తుంది. ప్రస్తుతం పాయింట్స్ పట్టికలో డిసి నాలుగో స్థానంలో ఉంది. తన చివరి మ్యాచ్ యుపి వారియర్స్‌తో ఫిబ్రవరి 1న తలపడనుంది.

# మంచులో మనిషి ప్రస్థానం..





అమెరికాను మంచు దుప్పటి కప్పేసింది. సగానికిపైగా ప్రజలపై ఈ మంచుపులి దాడి చేస్తున్నది. చరిత్ర పుటలను తిరగేస్తే, ప్రకృతి వైపరీత్యాలను, ప్రత్యేకించి చలిని, మంచును ఎదుర్కొని జీవించడానికి మనిషి పడిన కష్టాలు, ప్రదర్శించిన ఆత్మవిశ్వాసం స్పష్టంగా కనిపిస్తుంది. 'చలికాలం ఒక ఋతువు కాదు, అది ఒక వృత్తి. చలి కాలం ఒక వృత్తి అయితే, మంచు దానికి కోటలాంటిది. మంచు తన అన్ని రూపాల్లో, అంటే, మంచుగా గడ్డకట్టినది, మృదువైనది, అంటుకునేది, జారిపోయేది... ఇలా అన్ని రూపాల్లో దర్శనమిస్తుంది. స్కీయర్లు, పిల్లల వంటి కొందరికి ఆనందాన్ని ఇస్తే, మరెందరికో అది దాటాల్సిన, తొలగించాల్సిన ఒక అడ్డంకిగా మారుతుంది' అంటాడు మిన్నెసోటాలో జన్మించిన నవలా రచయిత, వ్యంగ్యకారుడు సింక్లేర్ లూయిస్. నిజమే. ప్రాచీన స్కీల నుంచి ఆధునిక మంచు తొలగించే యంత్రాల వరకూ, యుగాలుగా మనుషులు మంచుతో ఎలా మమేకమయ్యారో... ఎలా ఎదుర్కొన్నారో.. గమనిస్తే మన పూర్వీకుల ప్రయాణం ఎంతటి సంక్లిష్టమైనదో స్పష్టమవుతుంది.

క్రీస్తుపూర్వం సుమారు 2500 నాటి స్కీయర్ గుహా చిత్రణను, 1929లో నార్వేలోని రోడోయ్ ద్వీపంలో కనుగొన్నారు. తర్వాతి కాలంలో ఒక క్రీడగా అభివృద్ధి చెందినప్పటికీ, స్కీయింగ్ అనేది తొలుత, మంచులో వేగంగా ముందుకు వెళ్లడానికి ఉపయోగించేవారు. స్కీయింగ్ మొదటిగా వేల సంవత్సరాల క్రితమే జీవనోపాధి కోసం ఆవిష్కరించబడింది. స్కీలకు సంబంధించిన తొలి నాటి ఆధారాలు ప్రాగైతిహాసిక శిలాచిత్రాలు, పురావస్తు కనుగొళ్లలో లభించాయి. ఇవి పాలియోలిథిక్ యుగాంతం, చివరి హిమయుగానికి చెందినవి. తొలి నమూనాలుగా వాడిన చెక్క పలకలు గడ్డకట్టిన భూభాగంపై ప్రయాణానికి మాత్రమే కాదు, వేటకు కూడా ఎంతో ఉపయుక్తంగా ఉండేవి. చలికాల దృశ్యాన్ని చిత్రించిన మొదటి ల్యాండ్‌స్కేప్ చిత్రంగా భావించబడే 'హంటర్స్ ఇన్ ది స్నో'ను పీటర్ బ్రూగెల్ ది ఎల్డర్ 1564–65 మధ్య వచ్చిన కఠినమైన శీతాకాలంలో చిత్రించాడు. 'లిటిల్ ఐస్ ఏజ్' అని కూడా పిలిచే ఆ కాలంలో, యూరప్ గత శతాబ్దానికి పైగా చూడని అత్యంత దీర్ఘమైన, తీవ్రమైన శీతాకాలాల్లో ఒకటి. తన తొలి మంచు దృశ్యానంతరం బ్రూగెల్ మంచు, హిమంతో చిత్రణ ఆపలేకపోయాడు. కురుస్తున్న మంచును చూపిన తొలి చిత్రం, మంచుతో కూడిన తొలి నాటివిటీ దృశ్యాన్ని కూడా ఆయనే చిత్రించాడు.




ఆయన కళాఖండాలు డచ్ చిత్రకారుల్లో సుమారు 150 సంవత్సరాలు కొనసాగిన శీతాకాల థీమ్ ధోరణికి నాంది పలికాయి. న్యూ ఇంగ్లాండ్ వాసుల తరాలకు, 1717లో జరిగిన 'ది గ్రేట్ స్నో'కు ముందు లేదా తర్వాతనే సంఘటనలు గుర్తించబడేవి. ఆ ఏడాది ఫిబ్రవరి చివర్లో మొదలైన వరుస తుఫాన్లు ప్రాంతమంతా ఆరు అడుగుల వరకు మంచు కురిసింది. కొన్ని చోట్ల మంచు గుట్టలు 20 అడుగుల ఎత్తుకు చేరాయి. న్యూ హాంప్‌షైర్, మసాచుసెట్స్, కనెక్టికట్ రాష్ట్రాలు అత్యధికంగా ప్రభావితమయ్యాయి. ఇళ్లు పూర్తిగా మంచులో కూరుకుపోయాయి, పశువులు మృతి చెందాయి, న్యూ ఇంగ్లాండ్ హిస్టారికల్ సొసైటీ ప్రకారం, తపాలా సేవలు ఆలస్యం అయినప్పటికీ, తపాలా బోయ్స్ మంచు చెప్పులతో డెలివరీలు కొనసాగించారు.



కాగా, 'బ్లిజార్డ్' అనే పదానికి ఖచ్చితమైన మూలాలు స్పష్టంగా తెలియకపోయినా, మొదట ఇది మంచుతో సంబంధం లేని నామవాచకంగా ఉద్భవించినట్లు తెలుస్తుంది. 1829లో వర్జీనియా లిటరరీ మ్యూజియం అనే వారపత్రికలో దీనిని తీవ్రమైన దెబ్బ.. బహుశా జర్మన్ పదమైన బ్లిట్జ్ (మెరుపు) నుంచి వచ్చి ఉండవచ్చు అని నిర్వచించారు. 1834లో తన స్మృతిగ్రంథంలో సరిహద్దు ప్రాంత వాసి డేవీ క్రాకెట్ ఈ పదాన్ని మాటల ఉధృతిని సూచించేందుకు వాడాడు. 'విందులో ఒక సార్ నన్ను టోస్ట్ అడిగాడు.. నన్ను సరదాగా ఆటపట్టించాలనుకున్నాడని భావించి, ముందుకు వెళ్లి అతనికీ అతని వంటివారికీ ఒక 'బ్లిజార్డ్ ఇచ్చేశాను' అన్నాడు. తర్వాతి కాలంలో ఈ పదం తీవ్రమైన మంచు తుఫాను అర్థంలో ప్రాచుర్యంలోకి వచ్చింది. పదవ్యుత్పత్తి నిపుణుడు అలెన్ వాకర్ రీడ్ అభిప్రాయం ప్రకారం, బ్లిజార్డ్ అనే పదం ఈ అర్థంలో మొదటిసారి 1870 ఏప్రిల్‌లో ఐోవా రాష్ట్రం ఎస్టర్విల్లేలో ప్రచురితమైన నార్తన్ విండికేటర్ పత్రికలో కనిపించింది.

**స్నోమొమైల్స్..** నేడు స్నోమొబైల్స్ చలికాలంలో సాధారణ దృశ్యమే. కానీ ఒకప్పుడు మంచులో ప్రయాణం చేయాలంటే మరింత సృజనాత్మకత అవసరమయ్యేది. 19వ శతాబ్దం మధ్య నాటికి, అమెరికా నగరాల్లోని వీధులు, నడక మార్గాలను శుభ్రం చేయడానికి గుర్రాలతో లాగే స్నో ప్లౌల పేటెంట్లు అనేకం వచ్చాయి. 1862లో మిల్వాకీ ఈ తరహా ప్లౌను ఉపయోగించిన తొలి ప్రధాన నగరంగా నిలిచింది. అక్కడి నుంచి గ్రేట్ లేక్స్ ప్రాంతం నుంచి మైన్ వరకు విస్తరించిన స్నో బెల్ట్ అంతటా దీని వినియోగం వేగంగా వ్యాపించింది. ప్రతి పండుగ సీజన్‌లో మనసులను నింపే శీతాకాల అద్భుతానికి ప్రతీకగా నిలిచే స్నో గ్లోబ్ తొలిసారిగా 1878లో ఫ్రాన్స్‌లో జరిగిన పారిస్ యూనివర్సల్ ఎక్స్‌పోజిషన్‌లో కనిపించింది. అయితే అప్పట్లో పెద్దగా ఆకర్షణ పొందలేదు. 1900లో ఎడ్విన్ పర్జీ సీనియర్ అనే మెకానిక్ ఒక మసక వెలుగుతో ఉన్న బల్బును సరిచేయాలన్న ప్రయత్నంలో యాదృచ్ఛికంగా స్నో గ్లోబ్‌ను సృష్టించాడు. కొవ్వొత్తి ముందు నీటితో నిండిన గాజు గోళాలను ఉంచితే గది మొత్తం వెలుగుతో నిండుతుందని గమనించి, అదే పద్ధతిని బల్బుతో ప్రయత్నించాడు. ఆశించిన ఫలితం రాకపోవడంతో, వెలుగును ప్రతిబింబించాలనే ఉద్దేశంతో సేమోలినా కణాలను గోళంలో వేసాడు. అవే అతనికి తదుపరి ప్రయోగాలకు పునాదులు. గ్లోబ్‌ను సృష్టించిన తర్వాత, పర్జీ స్నో గ్లోబ్‌కు పేటెంట్ తీసుకున్నాడు.. చరిత్ర నిర్మాణంలో, అభివృద్ధి క్రమంలో సామాన్యులు చేసిన శ్రమ అనితర సామాన్యం. మంచు తుఫాన్లు వచ్చినప్పటికీ, చాలా వరకూ ఎలాంటి అపాయం లేకుండా బయటపడుతున్న నేటి తరం మొత్తం, చరిత్రలో ఎవరికీ పట్టని లక్షలాది మంది కృషిని గుర్తుచేసుకోవాలి. కృతజ్ఞతలు తెలుపుకోవాలి.

## కూనంనేని సమక్షంలో సిపిఐలో 50 కుటుంబాల చేరిక



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కార్పొరేషన్ ఎన్నికల నగారా మోగడంతో నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో పాల్వంచ పట్టణ పరిధిలోని కరకవాగు 34వ డివిజన్‌కు చెందిన సుమారు 50 కుటుంబాల వారు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్ష్యంలో పార్టీలో చేరారు. వీరందరికీ కూనంనేని ఎర్ర కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సిపిఐ నాయకులు జక్కా వెంకటేశ్వర్లు, బోడ భీమా నాయక్ సమన్వయంతో ఈ భారీ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ 34వ డివిజన్ నుండి సిపిఐ అభ్యర్థిగా బరిలో ఉన్న భట్టు విజయను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే ఎర్రజెండానే మనందరికీ అండగా ఉంటుందని నూతనంగా పార్టీలో చేరిన వారికి కూనంనేని దిశానిర్దేశం చేశారు. పార్టీలో చేరిన వారిలో భట్టు విజయ, భట్టు హరి, అజ్మీరా భీమా, సీతారామ్, వీరన్న, మధు, కృష్ణ, ఫజిల్, సక్రి, నీలతో పాటు తదితరులు ఉన్నారు.

## మున్సి'పోల్'లో అన్నివార్డుల్లో పోటీ
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్




**ప్రజాపక్షం /రామకృష్ణాపూర్/మంచిర్యాల :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల నుండి సిపిఐ అభ్యర్థులు పోటీకి సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ తెలిపారు. బుధవారం సిపిఐ రామకృష్ణాపూర్ పట్టణ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉన్నప్పటికీ స్థానిక ఎన్నికల్లో మిత్రధర్మాన్ని పాటించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ మిత్రధర్మాన్ని విస్మరిస్తే కలిసి వచ్చే సెక్యులర్ పార్టీలతో ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. సింగరేణి గడ్డపై సిపిఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల హక్కుల కోసం అనేక చారిత్రాత్మక పోరాటాలు సాగాయని గుర్తు చేశారు. గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కార్మికుల సంక్షేమం, వేతన సవరణ కోసం ఎన్నో త్యాగాలు చేసిన చరిత్ర తమ పార్టీకి ఉందని వివరించారు. ఈ ప్రాంత ప్రజలు, కార్మికులు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచింది ఎర్రజెండానే అని శంకర్ పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాంత ప్రజలు సిపిఐని ఆదరించి అన్ని ఎన్నికల్లో గెలిపించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కార్మికుల, సామాన్యుల పక్షపాతిగా నిలిచే సిపిఐ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. మున్సిపాలిటీపై కమ్యూనిస్టు జెండా ఎగురవేయడం ద్వారానే పట్టణ అభివృద్ధి, కార్మిక సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల రక్షణకు పోరాటాలు

### కార్మిక చట్టాలు కాలరాస్తున్న మోదీ
### ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె
### జాతీయ కార్మిక సంఘాల పిలుపు



కొత్తగూడెం..

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కాలరాస్తోందని, కార్మిక హక్కుల రక్షణకు పోరాటాలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్ ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన జాతీయ కార్మిక సంఘాలు ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, ఇఫ్టు, టియుసిఐ, బిఆర్‌టియూ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు జరిగింది. సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రాణాలు పణంగాపెట్టి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను అదానీ, అంబానీ లాంటి బడా కార్పోరేట్ కంపెనీలకు అనుకూలంగా ప్రధాని నరేంద్రమోదీ వాటిని నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారని, దేశంలో 50 కోట్ల మంది కార్మికులకు మేలు చేసే చట్టాలను తాకట్టుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరికార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులకు పిలుపునిచ్చారు. సదస్సులో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు జలీల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజె. రమేష్, టియుసిఐ జిల్లా అధ్యక్షుడులు మధుసూధన్ రెడ్డి, ఇఫ్టు జిల్లా ప్రధాన కార్యదర్శి జే సీతారామయ్య, సురేందర్, బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షులు, కార్మిక సంఘాల నాయకులు నాగభూషణం, గెద్దాడు నగేష్, గోనె మణి, వంగ వెంటక్, కందుల భాస్కర్, ఎండూరి ప్రభావతి, బ్రహ్మాచారి, భూక్యా రమేష, జి పద్మ, నూపా భాస్కర్, సంజీవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

**బెజ్జంకి :** ఫిబ్రవరి 12 జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి సిద్దిపేట జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ కోరారు. బుధవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జరిగిన హమాలీ కార్మికుల సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట రెడ్డి, మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, సహయ కార్యదర్శి సంగెం మధు, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్, ఎఐటియుసి నాయకులు పందుగ పర్శరాములు, కుంట లక్ష్మణ్, గంగుల బాలయ్య, కనండ్ల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఫిబ్రవరి 12న కార్మిక సంఘాల సమ్మె

**హనుమకొండ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక రైతు వ్యవసాయ కూలీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, ఎఐసిటియు కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్ణయించింది. బుధవారం హనుమకొండ జిల్లా రాంనగర్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో టి.ఉప్పలయ్య అధ్యక్షతన కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి మొగిలి శ్రీనివాసరావు, ఐఎన్‌టియుసి జిల్లా ఉపాధ్యక్షులు కస్తూరి రవి, కార్మిక సంఘాల నాయకులు దాసరి నరేష్, బత్తిని సదానందం గౌడ్, గుంటి రాజేందర్ సోమగోటి రాజగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా కార్మికవర్గం సమ్మె చేయాలని కార్మికవర్గ సంఘాలు పిలుపునిచ్చాయి. వరంగల్ జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్స్ సమావేశం శివనగర్ తమ్మెర భవన్‌లో బుధవారం నిర్వహించారు. సదస్సులో ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటాద్రి గంగుల దయాకర్, చుంచు జగదీశ్వర్, ఎఐసిటియు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి, అకెనపెల్లి యాదగిరి, ఎఐసిటియు జిల్లా అధ్యక్షులు, ఎండి. యాకోబ్, తదితరులు పాల్గొన్నారు.



వరంగల్..



హనుమకొండ...


సిద్ధిపేట..బెజ్జంకి

## మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో
# సిపిఐ అభ్యర్థుల నామినేషన్లు



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 57వ డివిజన్ కార్పొరేటర్ సిపిఐ అభ్యర్థిగా బుధవారం లతశ్రీ కసిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగా మొదటి రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో నగరంలోని గణేష్ నగర్, దోభి వాడ ప్రాంతానికి సంబంధించిన 57వ డివిజన్‌లో సిపిఐ అభ్యర్థిగా లతశ్రీ కసిరెడ్డి పోటీ చేస్తున్నారు. డివిజన్ ప్రజలు ఆదరించి, ఆశ్వర్వదించి కార్పొరేటర్‌గా గెలిపిస్తే డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని ఈ సందర్భంగా లతశ్రీ తెలిపారు.






**జనగామ :** జనగామ మున్సిపల్ 11వ వార్డు సిపిఐ అభ్యర్థిగా ఆకుల సరస్వతి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆది సాయన్నతో కలిసి ఒక సెట్ నామినేషన్‌ను ఎన్నికల అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ 11వ వార్డు నుండి బుధవారం నామినేషన్ దాఖలు చేయగా అధికారికంగా గురువారం చర్చల అనంతరం ప్రకటిస్తామన్నారు.

**భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 24వ వార్డు కౌన్సిలర్‌గా సిపిఐ, కాంగ్రెస్ పార్టీల పొత్తులో భాగంగా బలపరిచిన సిపిఐ అభ్యర్థి వేముల జ్యోతి శ్రీకాంత్ మొదటి రోజు నామినేషన్ వేశారు. భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ కాంగ్రెస్ పార్టీ పొత్తులో భాగంగా ఐదు వార్డులు కేటాయించగా ముందుగా మొదటి రోజు వేముల జ్యోతి శ్రీకాంత్ నామినేషన్ దాఖలు చేశారు.

## నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా హుజురాబాద్, జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించుకుని, వెంటవెంటనే రోజు వారీగా టీ.పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని సూచించారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలన జరిపేలా అవసరమైన సిబ్బందిని నియమించామని అన్నారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి. ఆయాజ్, హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ ఉన్నారు.

## సమ్మక్క జాతరకు 'ఎల్లంపల్లి' నీరు విడుదల!



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలాశయం నుంచి గేట్లు ఎత్తి మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువన గోదావరినది ఒడ్డును అనుకొని పెద్దపల్లి జిల్లా గోయల్‌వాడ, గోదావరిఖని జనగామ గంగానగర్, మంచిర్యాల వద్ద శ్రీసమ్మక్క, సారాలమ్మల జాతరలు జరగుతున్నాయి. ఈ జాతరలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. అయితే ఈ జాతరల ప్రదేశాల వద్ద గోదావరినదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో భక్తులు స్నానాలు చేసేందుకు అవసరమైన నీటిని వదలాలని జాతరల కమిటీల నిర్వాహకులు ప్రాజెక్టు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఒక గేటు ఎత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని గోదావరినదిలోకి విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రవీంద్రచారి తెలిపారు. నదిలో నీటి ప్రవాహం పెరిగి లోతు ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున స్నానాలు చేసే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జాతర కమిటీల నిర్వాహకులు, సంబంధిత అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## హెల్ప్ లైన్ సెంటర్, కంట్రోల్ రూమ్, మీడియా సెల్ ఏర్పాటు

కంట్రోల్ రూమ్ నెంబర్ 1800 233 1495



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ సెంటర్, మీడియా సెల్ ను ఏర్పాటు చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ సెంటర్ ను జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, మీడియా సెల్ ను అదనపు కలెక్టర్ బుధవారం ప్రారంభించారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా.. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో పెయిడ్ న్యూస్, ఫేక్ న్యూస్ ప్రసారమైన, ఓటర్లు ఏదైనా సందేహాల నివృత్తికి, సమాచారం కోసం సంప్రదించిన వెంటనే స్పందించాలని సూచించారు.ఎన్నికల ఫిర్యాదుల ఉంటే ప్రజలు కంట్రోల్ రూం నెంబర్ 1800 233 1495 అందుబాటులో ఉంటుందని, ఫోన్ చేసి చెప్పవచ్చని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారులు గీత, శ్రీనివాసాచారి, నవీన్, భారతి తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మున్సిపాలిటీల్లో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. నామినేషన్ల దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్ప్ డెస్క్‌వద్ద అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, శాంతియుత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని, వెనువెంటనే టీ పోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. చొప్పదండి మున్సిపల్ పరిధిలోని వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ వివరాలను ఎన్నికల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

# విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి

రెండు సంవత్సరాల కాలంలో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులు
పార్లమెంట్ పరిధిలో మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా కృషి చేయాలి
రానున్న రోజుల్లో రూ.21 కోట్లతో మరింత అభివృద్ధి
కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ శ్రేణులకు కండువా కప్పిన మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులు





**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** మున్సిపల్‌ల అభివృద్ధికి కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించేలా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని మున్సిపల్ ల పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయ రమణారావు పేర్కొన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పిటిసి ఐల రమేష్ తన భారీ అనుచర గణంతో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి మంత్రులు ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ముందుగా పట్టణంలో ద్విచక్ర వాహన, మహిళలతో బాణాసంచా పేలుస్తూ భారీ ర్యాలీ స్థానిక యశోద నరహరి ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ రెండు సంవత్సరాల కాలంలో పెద్దపల్లి లో 63 కోట్లు సుల్తానాబాద్ 15 కోట్ల రూపాయలతో మున్సిపాలిటీలలో అభివృద్ధి పరిచమని తెలిపారు పెద్దపల్లి సుల్తానాబాద్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. 53 కోట్లతో ఆసుపత్రి నిర్మాణం 80 కోట్లతో కోర్టు నూతన భవనం వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని 21 నర కోట్లతో రానున్న రోజుల్లో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచామని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి లక్ష్యంగా శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు పనిచేస్తున్నారని రెండు సంవత్సరాల కాలంలో పెద్దపల్లికి 4 పోలీస్ స్టేషన్‌లు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే దేనిని ఈ ప్రాంత అభివృద్ధిపై ఎమ్మెల్యేకు ప్రత్యేక ప్రేమ ఉందని ముఖ్యమంత్రికి అత్యంత సన్నిధిగా ఉంటూ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సుల్తానాబాద్ చెరువు ప్రాంతానివి ఎనిమిది కోట్ల రూపాయలతో మినీ ట్యాంక్ బండ్ గా నిర్మాంచేందుకు ఎమ్మెల్యే నిర్విరామ కృషి చేశారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేసి ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పరిచేలా సహకరించాలన్నారు. టూరిజం మంత్రి కృష్ణారావు ఈ బిప్రాంతాన్ని టూరిజం ప్రాంతంగా మార్చేందుకు సహకరిస్తున్నారని చారిత్రాత్మక కట్టడాలైన రామగిరి కీల తో పాటు అనేక చారిత్రాత్మక ప్రాంతాలు ఉన్నాయని వాటిని అభివృద్ధి పరిచేందుకు మంత్రి ప్రత్యేక చొరవ చూపెడుతున్నారని అన్నారు. గత పాలకులు ఈ ప్రాంతాన్ని బ్రష్టు పట్టించారని ప్రస్తుతం ఉన్న శాసనసభ్యులు విజయ రమణారావు అనేక అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు పోతున్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు గెలుపు గుర్రాలకు టికెట్లు కేటాయిస్తామని ఆశవాహులు నిరాశ చెందకుండా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి రానున్న రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. రెండు సంవత్సరాల కాలంలోనే 1000 కోట్ల రూపాయలను తీసుకువచ్చి అభివృద్ధి పరచడం సామాన్య విషయం కాదని అభివృద్ధికి మారుపేరు పెద్దపల్లి శాసన సభ్యులు విజయ రామారావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు మినుపాల ప్రకాష్ రావు, ఈర్ల స్వరూప, సారయ్య గౌడ్, సాయిరి మహేందర్, ముండయ్య, శ్రీగిరి శ్రీనివాస్, వేగోళం అబ్బయ్య గౌడ్, బిరుదు సమత రాజు, పెద్ద సంఖ్యలో మహిళలు కాంగ్రెస్ శ్రేణులు పలువురు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో కొనసాగుతున్న చేరికలు

కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ మున్సిపల్ 28 వార్డుకు చెందిన గోపన్నగారి మాధవి లత బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని విప్ సూచించారు. గత పది సంవత్సరాలలో గత ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని విస్మరించిందని అన్నారు. వేములవాడ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పవన్‌వాణి పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు: ఇన్‌చార్జి కలెక్టర్

వేములవాడ నామినేషన్ కేంద్రంలో పరిశీలన



**ప్రజాపక్షం/వేములవాడ:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన నేపథ్యంలో వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో ఓటర్ జాబితా, రిజర్వేషన్ జాబితా, నో డ్యూ సర్టిఫికెట్, ఇతర ఏర్పాట్లను పరిశీలించి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరగకుండా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశించారు. నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. ఈ నెల 28వ నుండి 30వ వరకు ఉదయం 10.30 గంటల నుంచి 05.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద 100 మీటర్ల వరకు రెండు వాహనాలకు అనుమతి ఉంటుందని తెలిపారు. వేములవాడలో 28 వార్డులకు సంబంధించి.10 మంది ఆర్ఓలు, 10 మంది ఏఆర్ఓలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నియమించామని తెలిపారు. ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ టీం లను నియమించామని విచారించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో తొలిరోజే నామినేషన్ల సందడి



**ప్రజాపక్షం/ధర్మపురి :** తెలంగాణ రాష్ట్రంలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు2026 ఎన్నికల షెడ్యూల్ మంగళవారం వెలువడగా తొలిరోజైన బుధవారం ధర్మపురి బల్దియాలో నామినేషన్ల సందడి నెలకొంది. మొదటిరోజు బుధవారం 9 మంది అభ్యర్థులు 10 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో ఇందారపు వాసు,జక్కు పద్మ,బాకి చంద్రశేఖర్, గుర్రాల సుధాకర్, సంగి సత్తెమ్మ, సంగి రేఖ,వొడ్నాల మదన్ కుమార్,చీపిరిశెట్టి రాజేష్,కొంపల పద్మ లు ఉన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలక సంఘం పరిధిలో మొత్తం 15 వార్డులు ఉండగా మొత్తం 14035 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 6722,మహిళా ఓటర్లు 7310, ట్రాన్స్ జెండర్స్ 3 ఉన్నారు.15 వార్డులకు గాను 29 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆయా వార్డుల్లో జనాభా ప్రాతిపదికన అధికారులు రిజర్వేషన్లు ఖరారు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ స్థానాన్ని జనరల్ మహిళకు కేటాయించగా అధ్యక్ష పీఠంపై కన్నేసిన ఆశావహులు ఈసారి పెద్దఎత్తున బరిలో వుండేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.ప్రధాన పార్టీల గుర్తుపై పోటీచేసేందుకు అత్యధికులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నుండి ఒక్కో వార్డుకు ముగ్గురు ఆశావహులు ముందుకు వస్తూండటంతో అభ్యర్థుల ఎంపికలో మంత్రి అడ్లూరికి తలనొప్పి తెచ్చిపెడుతోంది. కాగా ధర్మపురి పురపాలక సంఘంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని బుధవారం జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ఆర్డీఓ మధుసూదన్ లు వేరువేరుగా సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరుగుతుందా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు కేంద్రాలవద్ద అన్ని ఫారాలు అందుబాటులో ఉంచాలని ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.జిల్లా అదనపు ఎన్నికల అధికారి మామిల్ల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించగా ధర్మపురి పోలీస్ సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు జి.మహేష్,పి.ఉదయ్ కుమార్ ల ఆధ్వర్యంలో కేంద్రం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నామినేషన్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ సెక్షన్ అమలు: సిపి

**ప్రజాపక్షం/సిద్దిపేట:** పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2వ సాధరణ ఎన్నికలు ప్రశాంతంగా,శాంతిభద్రతల నడుమజరిగేందుకు మున్సిపల్ ఎన్నికల జరుగు దుబ్బాక, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ పరిధిలోని నామినేషన్ కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ 2023 అమలు చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మీ పేరుమాల్ తెలిపారు. నామినేషన్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలోపు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిధంగా ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది గూమిగూడటం కర్రలు, లాఠీలు, రాళ్లు,కొడవళ్లు, గొడ్డళ్లు ఇతర ప్రాణాంతక ఆయుధాలు కలిగి ఉండటం చట్టం పరంగా నిషేధం అన్నారు. ఈ ఆంక్షలు నామినేషన్ కేంద్రాలు చేర్యాల ఓల్డ్ సామాజిక కేంద్రం. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం, దుబ్బాక మున్సిపల్ కార్యాలయం, ఐవోసి బిల్డింగ్,సిబ్లాక్ గజ్వేల్ వద్ద అమలులో ఉంటాయన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే ఏ వ్యక్తినైన చట్టం ప్రకారం ప్రాసిక్యూట్ చేసే శిక్షార్హులుగా పరిగణించబడుతుందని ప్రజలకు తెలిపారు.

## పేదల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ



**ప్రజాపక్షం/బెజ్జంకి:** పేదల హక్కులను కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం కాలరాస్తుందని టీపీసీసీ ఎస్‌సి సెల్ చైర్మెన్ మానకొండూర్ ఎంఎల్ఏ డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉపాధి హామీ పేరు మార్పు,నిధులు కోత విధించి కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఉపాధి హామీ కార్మికులతో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వారు హజరై మాట్లాడారు పేదలకు ఉపాధి కల్పించి వారికి అండగా నిలబడేందుకు గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పేరును కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం మార్చడం దుర్మార్గమని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాలను నీరుగారేలా అమలు చేయడం సరి కాదని అన్నారు.ఉపాధి హామీ పథకం కింద కేంద్రం 90 శాతం నిధులు ఇస్తుండగా రాష్ట్రం 10 శాతం నిధులను ఇచ్చేదని అన్నారు. ప్రస్తుతం 90 శాతాన్ని 60 శాతానికి కుదిస్తూ 40 శాతం నిధులను రాష్ట్రంపై మోపిందన్నారు. కార్యక్రమంలో టిపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నమిండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రెహ్మత్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, నర్సయ్య, అక్కరవేణి పోచయ్య, ప్రభాకర్, మధుసుదన్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచ్‌లు,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కోల్‌బెల్ట్‌లో వనదేవతల జాతర ప్రారంభం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతమైన గోదావరిఖని జనగామ సమీపాన గంగానగర్ వద్ద గోదావరినది ఒడ్డున శ్రీసమ్మక్క, సారాలమ్మ జాతర బుధవారం వైభవంగా ప్రారంభమైంది. రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్, మనాలి ఠాకూర్ దంపతులు అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. వనదేవతల గద్దెల వద్ద పూజారులు చేపట్టిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. మొక్కులు సమర్పించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ అమ్మవార్లను వారు పూజించారు. సాయంత్రం కోయ పూజారులు సారాలమ్మను గద్దె వద్దకు చేర్చారు. జాతర ప్రారంభం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఇక్కడి గోదావరినదిలో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. సాయంత్రం విద్యుత్తు వెలుగుల్లో జాతర ప్రాంగణమంతా మెరిసిపోవడంతో చూసేందుకు ప్రజలు జాతర ప్రదేశం వద్దకు తరలివస్తున్నారు.

## మొదటి రోజు 18 నామినేషన్లు



కారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/సిద్దిపేట/దుబ్బాక:**దుబ్బాక మున్సిపాలిటీలో నామినేషన్ పర్వం మొదలైంది. మొదటి రోజు 18 నామినేషన్లు దాఖలైనట్లు మున్సిపాలిటీ కమిషన్ రమేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. అంతకు ముందు నామినేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. 20 వార్డులో 41 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధల ప్రకారం నామినేషన్ కేంద్రం వద్ద 100 మీటర్ల పరిధిలోని 144 సెక్షన్‌అమలులో ఉంటుందని, నామినేషన్ అభ్యర్థితో పాటు ఇద్దరికీ మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఉంటుందని అధికారులు తెలిపారు. నామినేషన్ ప్రక్రియమొత్తం వీడియో రికార్డింగ్ చేయాలని, నామినేషన్ కేంద్రాల్లోమొబైల్ ఫోన్లుకు అనుమతి లేదన్నారు.

రైటప్:28డిబికె01, నామినేన్ కేంద్రంలో అధి

### ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో మెట్రిక్ విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం బ్యాంక్ అకౌంట్ ఆధార్ సీడింగ్ త్వరగా పూర్తి చేయాలి

ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో చదివే ప్రీ మెట్రిక్ విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు కొరకు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థులు బ్యాంక్ అకౌంట్లను అధార్ సీడింగ్ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్సీ సంక్షేమ వసతి గృహాల సంక్షేమఅధికారులు,విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ఎస్సీ హాస్టల్‌లో చదువుతున్న ప్రీ మెట్రిక్ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లపై సమీక్షించారు.వెంటనే జిల్లా కలెక్టర్ విద్యార్థుల బ్యాంక్ అకౌంట్లకు ఆదార్ సీడింగ్ చేసేందుకు కలెక్టరెట్ లోని ఎన్ఐసి వారితో ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. వేగంగా బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి హమీద్. మండల విద్యాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్సీ వసతి సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కండ్లపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి తెలంగాణ మోడల్ స్కూల్లో 6 తరగతి మరియు 7 నుండి 10వ తరగతి మిగిలి పోయిన సీట్ల కొరకు ఆన్లైన్లో దరఖాస్తులు ప్రారంభించబడింది. ఆనెన్లైన్లో దరఖాస్తులు చేసుకోవడానికి ఫిబ్రవరి 28 వ చివరి తేదీ అని ఈ క్రింది వెబ్సైట్ ద్వారా దరఖాస్తులను స్వీకరించబడును. https://telanganams.cgg.gov.in/ అన్ని సదుపాయాలు మరియు అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందం ఉన్న మోడల్ స్కూల్లో విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కొరకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి. సరితా దేవి ఓ ప్రకటనలో తెలియజేశారు.

# ఏడుపాయల జాతరకు ఏర్పాట్లు పూర్తి

## భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి.. అధికారులను ఆదేశించిన కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :** పవిత్ర ఏడుపాయల వరదుర్గా మాత జాతర ఎల్లలు దాటేలా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని,భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పవిత్ర ఏడుపాయల వనదుర్గా మాత జాతరను ఘనంగా నిర్వహించాలని, జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, పార్కింగ్, విద్యుత్ ,తాగునీరు భారీకేట్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. జాతర పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు, చిత్త సేకరణ, బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణకు ఫాగింగ్ లాంటివి ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు .వివిధ సైన్ బోర్డులు, అంబులెన్స్, మందులు, అంటూ వ్యాధులు రాకుండా చర్యలు, కోవిడ్ 19 కు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రవాణా, బస్సులు, వాహనాలు, గజ ఈతగాళ్లు, అన్ని చోట్ల సీసీ కెమెరాలు, పోలీస్ కంట్రోల్ రూమ్, వివిధ స్టాల్స్, పకడ్బందీగా దర్శనానికి క్యూలైన్ ఏర్పాటు, అగ్ని ప్రమాదాల నివారణకు అగ్ని మాపక యంత్రాలు, స్వయం సహాయక మహిళల ఉత్పత్తుల కోసం ప్రత్యేక స్టాల్స్ లను ఏర్పాటు చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. జాతరలో ఏ వస్తువులైన ఎక్కువ ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని, జాతరలో అమ్మే తినుబండారాలలో ఎలాంటి రంగులు కలపకుండా చూడాలని, జాతరలో 18 సంవత్సరాల వయస్సు నిండని వారికి ఎలాంటి మత్తు పదార్థాలు విక్రయించరాదన్నారు.అధికారుల సమన్వయంతో జాతరను ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.అధికారు లు క్షేత్రస్థాయిలో ఏడుపాయలకు వెళ్లి శనివారం వరకు జాతరకు సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారుచేసి ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** రాష్ట్ర స్థాయి ఇంగ్లీషు ఒలింపియాడ్‌లో మంచిర్యాలకు చెందిన ఆదర్శపాఠశాల విద్యార్థులు రాణించడంతో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఇంగ్లీషు ఒలంపియాడ్‌లో జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో గల తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంగ్లీషు భాషా ఉపాధ్యాయుల అసోసియేషన్ (ఈ ఎల్ టి ఎ) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్ వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో ప్రతిభ చాటారు. జూనియర్ స్థాయి విభాగంలో భవిత, సీనియర్ స్థాయి విభాగంలో సంజన విద్యార్థినీలు ప్రతిభ చాటారని, వారితో పాటు గైడ్ టీచర్లుగా వ్యవహరించిన దైద సరిత, రమేష్, రజినిలను కూడా కలెక్టర్ అభినందించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం కృషికి ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు రాణించడం మరింత మందికి ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మంచిర్యాల గోదావరి ఘాట్‌లో వైద్య శిబిరం



**ప్రజాపక్షం / మంచిర్యాల :** మంచిర్యాల గోదావరి ఘాట్‌లోని సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తుల సౌకర్యార్థం 24 గంటల పాటు సేవలందించే వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ అనిత బుధవారం ప్రారంభించారు. జాతరకు వచ్చే భక్తులకు వైద్య ఆరోగ్యశాఖ తరఫున అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు, ఆర్‌బిఎస్‌కె సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు అందుబాటులో ఉంటారని, అత్యవసర సేవల కోసం 108 అంబులెన్స్ సర్వీసులను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. జాతరలో ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలని జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్‌ను డిఎంహెచ్ఓ ఆదేశించారు. భక్తులు పరిశుభ్రమైన నీటిని తాగాలని, ఆహార పదార్థాలపై ఈగలు, దుమ్ము పడకుండా మూతలు ఉంచాలని సూచించారు. బహిరంగ మలవిసర్జన చేయకూడదని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భవతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ పద్మ మార్తా, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు నిర్మల్‌లో సిఎం కప్ క్రీడా సంబరం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం వేదికగా గురువారం నిర్వహించనున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.ఈ పోటీల కోసం స్టేడియంలో ఖోఖో,కబడ్డీ,వాలీబాల్ కోర్టులతో పాటు అథ్లెటిక్స్ ట్రాక్‌లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.జిల్లా యువజన,క్రీడల అధికారి(డివైఎస్ఓ) శ్రీకాంత్ రెడ్డి బుధవారం స్వయంగా మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో,పోటీల కన్వీనర్ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ క్రీడా వేడుకలు జరగనున్నాయి. ఇప్పటివరకు ఆన్‌లైన్ ద్వారా సుమారు 450 మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోగా,ఆసక్తి ఉన్న క్రీడాకారులు కూడా గురువారం ఉదయం లోపు రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ పోటీల్లో పాల్గొనాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో టీజీ పేట ప్రెసిడెంట్ సత్తయ్య,వన్నెల భూమన్న,సంజీవ్,సాయిరాజు, అలహాజ్ ,విజయలక్ష్మి ,శ్రీకాంత్ ఖాన్, గోపా ల్,శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొని క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను పరిశీలించారు.

## చదువుతోనే ఉన్నత స్థాయి సాధ్యం

### మెదక్ సైబర్ క్రైమ్ డిఎస్‌పి సుభాష్ చంద్రబోస్




**ప్రజాపక్షం/టేక్మాల్ :** విద్యార్థులు కష్టపడి చదువుతేనే జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడగలరని మెదక్ జిల్లా సైబర్ క్రైమ్ డిఎస్‌పి సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం ధవారం మోడల్ కళాశాలలో నిర్వహించిన ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడుకోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో చదువుకోవాలని, చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని హితవు పలికారు. గ్రామ సర్పంచ్ సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, మోడల్ కళాశాల ప్రిన్సిపల్ సాయిలు, ఉపాధ్యాయులు మురళీధర్ రావు,పార్థ సారథి, భారతి, అపరంజితపాల్గొన్నారు.

## యువతకు సైబర్ మోసాలపై అవగాహన

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** డిజిటల్ మోసాలు భయంకరంగా పెరుగుతున్నాయని, ధృవీకరణ లేని చైనాయాప్‌ల ద్వారా తక్షణ లోన్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ మోకీద్ అన్నారు. బుధవారం ఖలీల్‌వాడిలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో బజాజ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో 100 నగరాల సైబర్ భద్రతా కార్యక్రమంలో భాగంగా నాక్ అవుట్ డిజిటల్ ఫ్రాడ్ పేరుతో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని సైబర్ మోసాల రకాలు, ఆర్థిక భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పౌరులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.తెలియని లింక్‌లపై క్లిక్ చేయకండి, అపరిచితులతో ఓటిపిలను పంచుకోకండి. మీరు ఏదైనా ఆన్‌లైన్ మోసానికి గురైతే, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబరు 1930 కి నివేదించాలన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ పోలీసు మహమ్మద్ మొకీద్ పాషా, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బసవరాయ మనోహర, కళాశాల ఛైర్మన్ ఎం. మారయ్య గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రేరణ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

### ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కలెక్టర్, ఎస్‌పి



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బాలికలు బోథ్ లో బుధవారం ప్రేరణ స్పోర్ట్స్ అండ్ కల్చర్ మీట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్,కలెక్టర్ రాజర్షి షా,ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరయ్యారు.జాతీయ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.విద్యార్థినిలు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలని,క్రీడల వల్ల మానసిక ఆనందం సంతోషం కలుగుతాయి అని తెలిపారు.క్రీడలతో పాటు,చదువుపైదృష్టి పెట్టాలని అన్నారు.ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని వాటికోసం కృషి చేయాలని విద్యార్థులకు తెలిపారు.విద్యార్థులు సైబర్ క్రైమ్ నేరాలపై ప్రతి ఒక్క విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతోనే పేదలకు విద్య

### ప్రొఫసర్ కె.లక్ష్మీనారాయణ




**ప్రజాపక్షం/మెదక్ :** తెలంగాణలో ప్రభుత్వ విద్యా రంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫసర్ కె. లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.బుధవారం సాయంత్రం మెదక్ పట్టణంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ మెదక్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 15శాతం నిధులు కేటాయించాలని, అప్పుడే మౌలిక సదుపాయాల కల్పన సాధ్యమవుతుందని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు అరకొర వసతులతో, ఒకరిద్దరు ఉపాధ్యాయులతోనే నడవడం దురదృష్టకరమని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని పేర్కొన్నారు. కమిటీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై.అశోక్ కుమార్ రాష్ట్ర కార్యదర్శి కె.రవి చందర్, టీపిటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బి. కొండల్ రెడ్డిలు మాట్లాడుతూ, విద్యా రంగంలో ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న అశాస్త్రీయ ధోరణులను ఎండగట్టాలని, శాస్త్రీయ విద్యా విధానాల కోసం పోరాడాలని కార్యకర్తలకు సూచించారు. సీనియర్ నాయకులు డా॥ పిడి ఆనందం, జె.రాంచంద్రం, బి.ముత్యాలు, విద్యాసాగర్, రాజేందర్, హీరాలాల్, రెసిడెన్సియల్ టీచర్స్, పిడిఎస్ యూ విద్యార్థులు, టీపిటీఎఫ్ జిల్లాకమిటి సభ్యులు, విద్యాభిమానులు పాల్గొన్నారు.

### మెదక్ జిల్లా కమిటీ ఎన్నిక

మెదక్ జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాంకిషన్, భుజంగరెడ్డి, జోజప్ప, ప్రధాన కార్యదర్శిగా హీరాలాల్, అసోసియేట్ ప్రధాన కార్యదర్శిగా, రాజేంద్ర ప్రసాద్ కార్యదర్శులుగా మహేష్, ఉదయ్, జీవరత్నం, విద్యా సాగర్ ఉషారాణి ఎన్నికయ్యారు.

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బంధీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల జాగరూకతతో వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ బుధవారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలోని కంఠేశ్వర్ మున్సిపల్ జోన్ ఆఫీస్, టీటీడీ కళ్యాణ మండపంలలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, నామినేషన్ ఫారంలు, రిజిస్ట్రర్లను పరిశీలించారు. అదేవిధంగా కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా కొనసాగుతున్న నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదటి ఆరోజు ఆయా డివిజన్లు, వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియ లు పకడ్బంధీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి, మున్సిపల్ ఎ న్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్ర శాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నిక లు జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని, క్షేత్రస్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. 30 వరకు ఉదయం 10.30 నుండి 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చ ని సూచించారు. అయితే ప్రతిపాదకులు (ప్రపోజర్స్) మాత్రం అదే డివిజన్/వార్డుకు చెందిన ఓటరై ఉండాలని కలెక్టర్ స్ప ష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అన్ని నా మినేషన్ స్వీకరణ కేంద్రాలలో ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచామని, నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలన జరిపేలా అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించటం జరుగుతుందని, ఎవరు కూడా ఎలాంటి అపోహాలు, సందేహాలకు గురి కావద్దని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, బాన్సువాడ మున్సిపల్ కమీషనర్ శ్రీహరిరాజు ఉన్నారు.

## పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ


### కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / మంచిర్యాల :** మున్సిపల్ ఎన్నికల కార్యాచరణ నేపథ్యంలో నా మినేషన్ల ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, గడువు ముగిసిన తర్వాత ఎవరినీ అనుమతించబోమని స్పష్టం చేశారు. 100 మీటర్ల నిబంధన అమలు చేస్తున్నామని, అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వివరిస్తూ ఈ నెల 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3న ఉపసంహరణ అనంతరం అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం మంచిర్యాల కలెక్టరేట్ లో 08736 250501 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

## పార్టీల వైఫల్యాలను ఎండగడతాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి భుక్యా రమేష్




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** రాబోయే మున్సిపల్ ఎన్నికల వేళ జిల్లా రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. నిర్మల్,బైంసా,ఖానాపూర్ మున్సిపాలిటీల బరిలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(సీపీఐ) నిలవబోతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి భుక్య రమేష్ అధికారికంగా ప్రకటించారు.ప్రస్తుత రాజకీయాల్లో కాంగ్రెస్.బీజేపీ.బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకుంటున్నాయని తీవ్రస్థాయిలో విమర్శించారు.ఈ మూడు పార్టీలు మాటాలతో కోటలు కడుతున్నాయే తప్ప,సామాన్య ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు తీసుకురావడం లేదని,వారి ద్వంద్వ విధానాలను ,మోసపూరిత హామీలను ప్రజల ముందు ఎండగట్టడమే లక్ష్యంగా తాము ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని స్పష్టం చేశారు.జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా తాము అభ్యర్థులను కౌన్సిలర్లుగా బరిలోకి దించుతున్నామని,ముఖ్యంగా పార్టీకి పట్టున్న ప్రాంతంల్లో, ప్రజా సమస్యలు ఎక్కువగా ఉన్న వార్డులపై ప్రత్యేక దృష్టి సారించామని రమేష్ తెలిపారు.మౌలిక సదుపాయాల కల్పనలో అధికార,ప్రతిపక్ష పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు.కేవలం ఎన్నికల సమయంలోనే కనిపించే పార్టీలకు కాకుండా,నిత్యం ప్రజల మధ్య ఉంటూ పోరాటాలు చే స్తున్న సిపిఐకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు ప్రచారాన్ని ఉధృతం చేస్తామని, ప్రతి వార్డులో పార్టీ శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లి తమ అజెండాను వివరిస్తారని పేర్కొన్నారు.

## సమగ్రాభివృద్ధి సంక్షేమమే ప్రాధాన్యత

### ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**ప్రజాఫక్షం/పటాన్‌చెరు :** నియోజకవర్గ కేంద్రమైన పటాన్చెరు డివిజన్ సమగ్ర అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలో మూడు కోట్ల 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు ప్రహరీ గోడల నిర్మాణ పనులకు బుదవారం ఉదయం శంకుస్థాపన చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పూర్తి పారదర్శకతతో సంక్షేమ పథకాలు అందిస్తున్నామన తెలిపారు. ప్రధానంగా సిసి రోడ్లు యూజిడిలు ,పార్కు అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని చోటీ మసీద్ కమిటీ ఆద్వర్యంలో గల స్థలంలో 30లక్షల రూపాయల సొంత నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ముస్లీం ,మైనార్టీల సంక్షేమానికి ఎల్లప్పుడు తాను ముందుంటానని తెలిపారు. పటాన్చెరు డిప్యూటీ కమీషనర్ జ్యోతి రెడ్డి, మాజీ ఎంపిపి యాదగిరి యాదవ్ ,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు ,గూడెం మధుసూదన్‌రెడ్డి పట్టణ పుర ప్రముఖులు, మైనార్టీ మత పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గనుల మూసివేత ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రత్యేక చర్యలు




**ప్రజాపక్షం / మంచిర్యాల :** బొగ్గు గనులు మూసివేసిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆదేశించారు. బుధవారం వివిధ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, బొగ్గు కంపెనీల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మైన్స్ క్లోజింగ్ యాక్టివిటీలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. క్రీడా ప్రాంగణాలు, పారిశ్రామి క పార్కుల నిర్మాణం వంటి చర్యలు తీసుకోవాలని, మైనింగ్ ప్రభావిత ప్రాం తాల్లో ప్రకృతి దెబ్బతింటుందనే భావన తొలగించేలా మౌలిక సదుపాయాలు క ల్పించాలని, అభివృద్ధి పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. అభివృద్ధి కోసం 115 కోట్ల రూపాయలు కేటాయించినట్లు వెల్లడించారు. హాస్పిటల్, ఇండస్ట్రియల్ పార్క్ ఏ ర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వివరించారు.జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, గనులు భూగర్భ శాఖ ఏ డి జగన్ మోహన్, సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా ఇన్చార్జి జీఎం సిహెచ్. వెంకటేశ్వర్లు, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి , పర్యావరణ విభాగం అడిషనల్ మేనేజర్ హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.

## నిర్మల్‌లో మున్సిపల్ ఎన్నికల వేడి

### బిజెపికి అయ్యన్న గారి రాజేందర్ షాక్

### అభ్యర్థుల వేటలో పార్టీలు..!



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నిక ల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా పతాక స్థాయికి చేరుకుంది.రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో,బుధవారం నుంచే నామినేషన్ల పర్వం మొదలైంది.జిల్లాలోని నిర్మల్, బైంసా,ఖానాపూర్ మున్సిపాలిటీల్లో గెలుపు జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ ,బీ జేపీ,బీఆర్ఎస్ వ్యూహప్రతివ్యూహాలకు పదును పెడుతున్నాయి.అయితే,ఎన్నికల హడావుడి ప్రారంభమైన తొలిరోజే జిల్లా రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకున్నాయి.నిర్మల్ మున్సిపాలిటీలో 'హ్యాట్రిక్ కౌన్సిలర్'గా వరుసగా మూడుసార్లు విజయం సాధించిన బలమైన నాయకుడిగా పేరున్న అయ్యన్న గారి రాజేందర్ బీ జేపీకి రాజీనామా చేయడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా పె ను సంచలనంగా మారింది.పాత తరం నాయకులకు,కొత్తగా పార్టీలోకి వచ్చిన వర్గాలకు మధ్య సాగుతున్న ఆధిపత్య పోరులో తనకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని రాజేందర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం,సీనియర్ నాయకుడు,క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ ఉన్న నేతను కోల్పోవడం బీజేపీకి ఈ ఎన్నికల్లో తీరని నష్టమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు,రాజేందర్ తదుపరి అడుగు ఎటువైపు అనేది ఇప్పుడు అత్యంత ఉత్కంఠ రేపుతోంది. ఆయన అధికార కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తారా లేక బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటారా అనే విషయంలో ఆయన అనుచరుల్లోనూ సందిగ్ధత నెలకొంది.ఆయన ఏ పార్టీలో చేరినా,నిర్మల్ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకునే దిశగా ఆ పార్టీకి పెద్ద ఎ త్తున బలం చే కూరుతుందనడంలో సందేహం లేదు.రాజేందర్ వ ంటి ప్రజాదరణ కలిగిన నేత దూరమవ్వడం, బీజేపీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో జాప్యానికి దారితీసేలా కనిపిస్తోంది.ఇదే సమయంలో కాం గ్రెస్ పార్టీ తన అభ్యర్థుల ఖారరులో దూ కుడు ప్రదర్శిస్తోంది.నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు అప్పల గణేష్ సతీమణి పేరు దాదాపు ఖరారైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం మున్సిపల్ చైర్మన్ పదవి మహిళకు రిజర్వ్ కావడం తో,స్థానికంగా మంచి పట్టున్న అప్పల గణేష్ కుటుంబా న్ని బరిలోకి దిం పితే విజయం సులభమవుతుందని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది .ఇప్పటికే బీఆర్ఎస్ తన చైర్మన్ అభ్యర్థిగా మార్గుండ యోగిత పేరును ప్రకటించి ప్రచారంలో ముందంజలో ఉండగా,బీజేపీ లో నెలకొన్న అనిశ్చితి ఆ పార్టీ అభ్యర్థుల ఎంపికను మ రింత జాప్యం చేస్తోంది.మరి ఫిబ్రవరి 13న వెలువడే ఫలితా ల్లో నిర్మల్ ఓటరు నాడి ఏ పార్టీకి పట్టం కడుతుందో చూడాలి.

12
ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
గురువారం
29-01-2026
www.prajapaksham.in

'టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు యన్ శంకర్ తల్లి నిమ్మల సక్కుబాయమ్మ (78) హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమెకు ముగ్గురుకుమారులు, కుమార్తెలు ఉన్నారు. గురువారం హైదరాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నామని దర్శకుడు యన్. శంకర్ తెలిపారు.'

రీల్

# 'గాంధీ టాక్స్' ట్రైలర్ విడుదల



డిజిటల్ క్యూరియస్ ప్రైవేట్ లిమిటెడ్, పింక్మూన్ మెటా స్టూడియోస్, మూవీ మిల్ ఎంటర్‌టైన్‌మెంట్ కలిసి జీ స్టూడియోస్ రూపొందిస్తోన్న మూవీ 'గాంధీ టాక్స్' ట్రైలర్ విడుదలైంది. 'గాంధీ టాక్స్' నిశ్శబ్దంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ట్రైలర్‌లో ఎలాంటి డైలాగ్స్ లేవు. అయినప్పటికీ బలమైన దృశ్యాలు, భావోద్వేగంతో నిండిన నిశ్శబ్దం అన్నీ చాలా విషయాలను చెబుతున్నాయి. ప్రేక్షకులు సినిమాను చెవులతోనే కాదు.. మనసుతో వినాలని అంటున్నారు నిర్మాత. గాంధీ టాక్స్ చిత్రంలో విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి, అదితి రావు హైదరి, సిద్ధార్థ్ జాధవ్ లాంటి అద్భుతమైన నటీనటులు కీలక పాత్రల్లో కనిపించారు. విజయ్ సేతుపతి మాట్లాడుతూ ''గాంధీ టాక్స్'లో నటించటం నటుడిగా నాకొక పెద్ద చాలెంజ్‌గా మారింది. మౌనమే ఇందులో అత్యంత బలమైన డైలాగ్‌గా ఉన్న అరుదైన సినిమా ఇది' అన్నారు. అరవిందస్వామి మాట్లాడుతూ 'శబ్దాలతో నిండిన ఈ ప్రపంచంలో మౌనం కూడా మన అంతరాత్మను కదిలించగలదనిమనకు గుర్తు చేస్తుంది. మాటలు లేకుండా నిజం నిశ్శబ్దంగా బయటకు వచ్చే సినిమా. దీనికి ఎ.ఆర్.రెహమాన్ గారి అద్భుతమైన సంగీతమే కథను చెప్పే గొప్ప భాషగా మారింది' అన్నారు. కిషోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వంలో రూపొందిన ' గాంధీ టాక్స్' సినిమాకు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం అందిస్తున్నారు. జనవరి 30న 'గాంధీ టాక్స్' సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతుంది.

# ఘనంగా 'ఓం శాంతి శాంతి శాంతిః' ప్రీ రిలీజ్



తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా నటించిన విలేజ్ కామెడీ ఎంటర్ టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతిః. సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు ఈ వెంచర్ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఓం శాంతి శాంతి శాంతిః జనవరి 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.ప్రీరిలీజ్ ఈవెంట్ లో హీరోయిన్ ఈషా రెబ్బా మాట్లాడుతూ తరుణ్ డైరెక్షన్‌లో వర్క్ చేయాలని ఉండేది. ఆయన యాక్టింగ్ కూడా చక్కగా చేస్తారని తెలుసు. కానీ ఆయనకి గోదావరి యాస రావడం చాలా చాలా కష్టం. దాని కోసం చాలా ప్రిపేర్ అయ్యా రు. అంబటి ఓంకార్ నాయుడు పాత్రకి ప్రాణం పోశారు. ఆయనతో వర్క్ చేసిన ందుకు ఆనందంగా ఉంది. ఆయన డైరెక్షన్‌లో కూడా పని చేస్తాననే నమ్మక ం ఉంది. ఇందులో నా క్యారెక్టర్‌తో ప్రతి అమ్మాయి రిలేట్ అవుతుంది. ఫ్యామిలీ అందరికీ నచ్చే సినిమా ఇది అన్నారు. హీరో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ ఇం దులో గోదారి యాస చక్కగా పలికాను. దానికి కారణం తనే. ఈ కథని ఒరిజిన ల్‌గా ప్రజెంట్ చేయడానికి నిదర్శనమే ఆ పాట. జై క్రిష్ వజ్రం లాంటి సాంగ్ ఇచ్చాడు. ధీరజ్ బ్రహ్మాజీ అందరు కూడా పాత్రలో ఇమిడిపోయారు. ఈ నగరానికి ఏమైంది బాయ్స్ అందరికీ థాంక్ యూ. వాళ్ళకి షూటింగ్ అని చెప్పాను. ఈ సినిమా తప్పకుండా మిమ్మల్ని అందరిని ఎంటర్‌టైన్ చేస్తుందని నమ్మకం ఉంది అందరూ థియేటర్స్‌లో వెళ్లి సినిమా చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సజీవ్ , బివిఎస్ రవి , హీరో విశ్వక్ సేన్, హీరో ప్రియదర్శి , నిర్మాతలు సృజన్ , అనూప్ , వివేక్ పాల్గొన్నారు.

# 'హే భగవాన్' టీజర్ విడుదల




నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వరక్స్ బ్యానర్స్‌పై 'హే భగవాన్' అనే ఫుల్లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకరానున్నారు. ఫిబ్రవరి 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. వైవిధ్యమైన చిత్రాల కథానాయకుడు సుహాస్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో 'లిటిహట్స్ ఫేమ్ శివానీ నగరం నాయిక. సీనియర్ నటుడు నరేష్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో యాంకర్ స్రవంతి చొక్కారపు ఓ ప్రముఖ పాత్రలో కనిపించనుంది ఈ సందర్భంగా జరిగిన ఈ చిత్ర వేడుకలో చిత్ర నిర్మాత బి.నరేంద్ర రెడ్డి. దర్శకుడు గోపీ ప్రొడక్షన్ డిజైనర్ రాము్కుమార్, ఎడిటర్ విప్లవ్, డీవోపీ వంశీ, స్రవంతి చొక్కారపు, హీరో అఖిల్రాజ్, హీరోయిన్ తేజస్వీరావు, హీరో సుహాస్, హీరోయిన్ శివానీ నగరం, దర్శకుడు సాయి మార్తండ్, నటుడు సుదర్శన్, నిర్మాత రమణా రెడ్డిలు పాల్గొన్నారు.

# 'గోట్' సాంగ్ వీడియో విడుదల



హాస్యనటుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం గో ట్ . గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్ అనేది ట్యాగ్. దివ్యభారతి హీరోయిన్గా నటిస్తున్న ఈ చి త్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సం యుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటో న్న ఈ చిత్రం ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముం దుకు రానుంది. ఇటీవల ఈ చిత్రం నుంచి వచ్చిన టీజర్కు, సాంగ్స్కు అనూహ్య స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం నుంచి రైజ్ ఆఫ్ గణ అనే లిరికల్ వీడియోను విడుదల చేశారు. ఇటీవల సీఎమ్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఓ ఈవెంట్లో ఈ వీడియో సాంగ్ను విడుదల చేశారు. లియోన్ జేమ్స్ సంగీతం అందించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సంగీతం అందించారు. చిత్రంలో హీరో క్యారెక్టరైజేషన్ను తెలిపే విధంగా ఎంతో పవర్ఫుల్ మాస్గా ఈ సాంగ్గా ఉంది. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. టెక్నికల్గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్లో ఈ చిత్రం మైల్స్టోన్గా నిలుస్తుందని నిర్మాత చంద్రశేఖర్ తెలిపారు . సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. చిత్రం తప్పకుండా అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. సుడిగాలి సుధీర్, దివ్యభారతి, సర్వధమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, బ్రహ్మాజీ, పృథ్వీ, ఆడుకాలం నరేష్, రాజేంద్రన్, ఆనంద్ రామరాజ్, చమ్మక్ చంద్ర, పమ్మీ సాయి, నవీన్ నేని, తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, నేపథ్య సంగీతం: మణిశర్మ, డీఓపీ: రసూల్ ఎల్లోర్, ఆడిషనల్ డీఓపీ: సన్నీ కూరపాటి, ఎడిటర్: విజయ్ ముక్తవరపు, కో ప్రొడ్యూసర్: సమైరా రెడ్డి.ఎన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ప్రసూన మండవ, దర్శకత్వం: వేదవ్యాస్, నిర్మాత: చంద్రశేఖర్ మొగుళ్ళ.

# 'మళ్లీ మళ్లీ' పాట ఆవిష్కరణ



చంద్రహాస్ హీరోగా వస్తున్న నూతన చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. సంపత్ రుద్ర దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీలో మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘన ముఖర్జీ హీరోయిన్గా నటించారు. అర్జున్ మహీ ప్రతినాయకుడిగా నటించారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 6న రిలీజ్ చేయబోతోన్నారు. తాజాగా 'మళ్లీ మళ్లీ' పాటను రిలీజ్ చేశారు. ప్రముఖ దర్శకుడు జయంత్ సి పరాన్జి విడుదల చేసిన ఈ రొమాంటిక్ మెలోడియస్ పాటలో చంద్రహాస్, మేఘన కెమిస్ట్రీ హైలెట్గా నిలిచింది. ఆర్ఆర్ ధ్రువన్ బాణీ తో పాటు పాట సాహిత్యం కూడా అందించారు. మహమ్మద్ ఇర్ఫాన్ ఆలపించిన ఈ పాటను చూస్తే ఇట్టే ఆకట్టుకునే యుగళ గీతంగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి వైఆర్ శేఖర్ కెమెరామెన్గా, బొంతల నాగేశ్వర్ రెడ్డి ఎడిటర్గా పని చేశారు. ఇతర పాత్రల్లో మురళీధర్ గౌడ్, లక్ష్మ ణ్ మీసాల, మధునందన్, అభయ్ నవీన్, రాజశేఖర్ అనింగి, డాక్టర్ భతిని, కీర్తిలతా గౌడ్, సునీత మనోహర్ ముఖ్య పాత్రలను పోషించారు.

# 'ప్రేం' షూటింగ్ పూర్తి



సమాజంలో జరిగిన ఒక యదార్థ గాథను ఆధారంగా తీసుకుని శివమ్మీడియా పతాకంపై 'ప్రేం' అనే సినిమా తెరకెక్కిస్తున్నారు. నూతన నటీనటులు పవన్ తాత, డాక్టర్ చమిందా వర్మ జంటగా నటించారు. హారర్ థ్రిల్లర్గా తెరకెక్కిన ఈ చిత్రం వరంగల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకుంది. ' ప్రేం' చిత్రానికి రాజేష్ రావూరి దర్శకుడు. శ్రీమతి సుజాత మల్లాల సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివమల్లాల నిర్మాత. వరంగల్ దగ్గరలోని పెద్ద పెండ్యాల గ్రామంలో తొలి షెడ్యూల్, హైదరాబాద్ హెచ్యంటీ కాలనీలోని ఫారెస్ట్ లొకేషన్ సెకండ్ షెడ్యూల్ని పూర్తి చేసుకుంది.

# 'గాబరా గాబరా సాంగ్ రిలీజ్



హీరో ప్రభాస్ వర్షం సినిమా రూపొందించిన దర్శకుడు సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్గా నటిస్తోంది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా నుంచి 'గాబరా గాబరా' లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యం అందించగా ఆదిత్య రవీంద్రన్ సంగీతం సమకూర్చారు. సంతోష్ నారాయణన్ పాడారు. 'గాబరా గాబరా' పాట ఎలా ఉందో చూస్తే 'గాబరా గాబరా సోదరా లైఫ్ మొత్తం, కాలమే తన్నెరా లక్ ని ఆమడ దూరం, బంతి భోజనంలో బంతిని వడ్డిస్తారా, చేపను వేపాక చెరువులో వేస్తారా, సంబంధం లేని పనులనే, చేస్తున్నాం సిగ్గే పడకనే, చెత్త చేరింది లోనే, 'గాబరా గాబరా సోదరా లైఫ్ మొత్తం, కాలమే తన్నెరా లక్ ని ఆమడ దూరం, జానెడుగా పైనకి ఎక్కుదమంటే, బారెడుగా జీవితం కిందకు జారిపోతుందే...అంటూ కలిసి రాని లైఫ్ కు ఫేట్ ఇచ్చే ట్విస్ట్ లు, ఎంత ప్రయత్నించినా ఎదురయ్యే రెడ్ లక్ లు ఎలా ఉంటాయో చూపిస్తూ ఈ పాట సాగుతుంది. ఆర్ట్ మైఖేల్ బీఎఫ్ఏ, ఎడిటర్ గణేష్ శివ, డీవోపీ దినేష్ పురుషోత్తమన్, మ్యూజిక్ ఆదిత్య రవీంద్రన్ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎస్ఎస్ వర్మ, రచన, దర్శకత్వం అశ్విన్ చంద్రశేఖర్.

# కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి, నూతన టెండర్లను ఆహ్వానించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ డిమాండ్ చేశారు. ఆసుపత్రి బ్రాంచ్ అధ్యక్షురాలు ఎం.లక్ష్మీ బాయి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కాంట్రాక్టు కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడున్నర సంవత్సరాల క్రితం టెండర్లు పిలిచి, మూడు సంవత్సరాల కాల పరిమితికి కాంట్రాక్టులు ఇచ్చారని, గడువు ముగిసినప్పటికీ నూతన టెండర్లను ఆహ్వానించకుండా, కార్మికుల కనీస వేతనాలు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం కిందిస్థాయి కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని వారు విమర్శించారు. ప్రస్తుతం ఉన్నటువంటి కాంట్రాక్టు సంస్థల్లో పనిచేస్తున్నటువంటి కార్మికులు అతి తక్కువ జీతాలతో పని చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు వచ్చే విధంగా నూతన టెండర్లను ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం కార్మికులకు నాలుగు పండుగ సెలవులతో పాటు నాలుగు జాతీయ సెలవులు, 20 రోజుల పనికి ఒక రోజు వేతనంతో కూడిన ఆర్జిత సెలవులు రావాల్సి ఉన్న అవి అమలు కావటం లేదని, కాంట్రాక్టు యాక్ట్ ప్రకారం ప్రతి సంవత్సరం ఒక నెల బోనస్ అదనంగా చెల్లించాలని, కార్మికులకు ప్రతి సంవత్సరం రెండు జతల యూనిఫారం బూట్లు అందజేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభ ఫిబ్రవరి 8వ తేదీన వరంగల్ పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ మహాసభలో ప్రభుత్వాసుపత్రుల శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల జీతాల పెంపుదలకు పోరాట కార్యక్రమాన్ని రూపొందించినట్లు వారు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా మెడికల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఎ.పార్వతి, ఆసుపత్రి బ్రాంచ్ నాయకులు టి.మదన్ సింగ్, ఎం.శంకర్, పి.అనిత, ఎం.సుభాష్, ఎం.స్వరూప, కె.రాధిక తదితరులు పాల్గొన్నారు.

# పతంజలి ఫుడ్స్ జోన్ ఏర్పాటు అనుమతుల రద్దు సబబే

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆయిల్ పామ్ సాగు కోసం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్‌కు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఫ్యాక్టరీ జోన్ ఏర్పాటు అనుమతులను రద్దు ఉత్తర్వుల అమలును నిలిపివేసేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది. ఈ మేరకు గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. పతంజలికి ఉపశమనం కల్పిస్తూ ఆదేశాలివ్వలేమని స్పష్టం చేసింది. ఉపశమనం కోరుతూ పతంజలి దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసింది. పామాయిల్ ఉత్పత్తిని పెంచడానికి నేషనల్ మిషన్ ఆఫ్ ఎడిబుల్ ఆయిల్స్—ఆయిల్ పామ్(ఎన్ఎంఈవో—ఓపీ) పథకం కింద పతంజలి (గతంలో రుచి సోయా ఇండస్ట్రీస్ లిమిటెడ్)కి 2012లో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగు, ప్రాసెసింగ్ కోసం ఫ్యాక్టరీ జోన్లను కేటాయించారు. ఒప్పందం ప్రకారం 24 నెలల్లో ప్రాసెసింగ్ మిల్లు ప్రారంభించాలన్న షరతు అమలు చేయలేదంటూ సూర్యాపేట ఫ్యాక్టరీ జోన్ కేటాయింపును రద్దు చేస్తూ గతేడాది మార్చి 15న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చర్యను సవాల్ చేసిన పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టివేశారు. దీంతో పతంజలి అప్పీల్ దాఖలు చేస్తూ మధ్యంతర పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం కొట్టివేసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ప్రధాన పిటిషన్‌పై విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

# ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చెల్లదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అటవీశాఖ అధికారులు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (ఐపిసి) యాక్ట్ కింద కేసులు నమోదు చేయడం చెల్లదని హైకోర్టు తీర్పు చెప్పింది. ఐపీసీ కింద కేసుల నమోదు అధికారం పోలీసులకు మాత్రమే ఉందంది. అటవీ అధికారులకు వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసులను నమోదు చేసి దర్యాప్తు చేసే అధికారం ఉందని తెలిపింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో అక్రమంగా ప్రవేశించి అధికారిపై దాడి చేశారంటూ తమపై ఉన్న కేసును కొట్టేయాలని కోరుతూ హైదరాబాద్ నగరానికి చెందిన సాయి రోహిత్ ఇతరులు వేసిన పిటిషన్‌లో న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరావు ఈ తీర్పు చెప్పారు. ఐపిసి సెక్షన్ల కింద పెట్టిన కేసుల్ని కొట్టివేశారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద పెట్టిన కేసులను కొట్టివేసేందుకు నిరాకరించారు. చట్ట ప్రకారం పిటిషనర్లపై ఐపిసి కింద పోలీసుల ద్వారా కేసులు నమోదు చేయవచ్చునని తీర్పులో పేర్కొన్నారు.

# భారత్‌కు హానికరం

(మొదటి పేజీ తరువాయి)

వంటి ఈయూ డిమాండ్ల ద్వారా దేశాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి, ప్రజా సంక్షేమం వంటివి శాశ్వతంగా నియంత్రించే పరిస్థితి నెలకొంటుందని సిపిఐ ఆందోళన వ్యక్తం చేసింది. అదే జరిగితే దేశ సార్వభౌమత్వం దెబ్బతింటుందని హెచ్చరించింది. దేశీయ వ్యవసాయ రంగానికి ఈ ఒప్పందం హానికరమని నొక్కిచెప్పింది. దేశీయ మార్కెట్లలోకి ఈయూ వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తులకు ద్వారాలు తెరవడంతో మన రైతాంగం నష్టాల్లో కూరుకుపోతుందని, ఆహార భద్రత దెబ్బతింటుందని సీపీఐ హెచ్చరించింది. సుంకాలు మినహాయిస్తే యూరప్ ఉత్పత్తులతో భారతదేశ మార్కెట్లు నిండిపోతాయని, దీంతో మన పరిశ్రమలు దెబ్బతింటాయని, అనేక మంది ఉపాధి కోల్పోతారని, లఘు, చిన్న, మధ్యశ్రేణి పరిశ్రమలు (ఎంఎస్ఎంఈల)కు కోలుకోలేని దెబ్బ తప్పబోదని సీపీఐ పేర్కొంది. ఈయూ ప్రతిపాదించినట్లు మేధో సంపతి విధానంతో భారత్ జెనరిక్ మెడిసిన్ రంగం కుదేలవుతుందని హెచ్చరించింది. అదే జరిగితే అత్యవసర మందులు కొనలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది అంతర్జాతీయ ప్రజారోగ్యానికి మోసమే అవుతుందని తెలిపింది. భారత్ పశ్చిమాసియా యూరప్ ఆర్థిక కారిడార్ (ఐఎంఈసీ) బలోపేతాన్ని ఎఫ్‌టీఏ కోరుతుండటం ద్వారా ఇజ్రాయిల్‌లోని హైఫా పోర్టు హబ్‌గా మారుతుందని పేర్కొంది. గజాపై మారణహోమం, దురాక్రమణ దృష్ట్యా ఇజ్రాయిల్‌పై ఆంక్షల కోసం ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉన్న పరిస్థితుల్లో ఇజ్రాయిల్‌తో భారత్ ఆర్థికవ్యూహాత్మక బంధం మరింత బలపడేలా కేంద్రం నిర్ణయం తీసుకోవడం ఆమోదయోగ్యం కాదని సీపీఐ పేర్కొంది. ఎఫ్‌టీఐ కోసం సంప్రదింపులను నిలిపివేయాలని, అన్ని ముసాయిదాలను పార్లమెంటరీ స్థాయి సంఘాలు క్షుణ్ణంగా పరిశీలించాలని డిమాండ్ చేసింది. భారతీయ కార్మికులు/శ్రామికులు, రైతుల ప్రయోజనాలు పణంగా పెడుతూ విదేశీ సంస్థల ఊడిగం చేస్తూ, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రతి ఒప్పందాన్ని ప్రతిఘటిస్తామని సంకల్పించింది. హానికరమైన ఒప్పందానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు ప్రజాస్వామిక శక్తులు, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, పౌర సంఘాలు కలిసి రావాలని సీపీఐ పిలుపునిచ్చింది.

# ఎన్నికల ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

అధికార కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. దీనికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణను కూడా రూపొందించుకున్నది. ఇందులోభాగంగానే సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ను ఖారారు చేశారు. ఈ ప్రచారంలో ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు మున్సిపాలిటీలలో గత ప్రభుత్వ హాయంలో జరిగిన అన్యాయం, తప్పిదాలను విస్తృతంగా ప్రచారం చేయాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించింది.




# ఉద్యోగం ఊస్ట్

(మొదటి పేజీ తరువాయి)

వివరాలను బ్లాక్ లిస్టులో పెడుతున్నామన్నారు. పేదలకు శాశ్వతమైన లబ్ధి చేకూర్చే బృహత్తరమైన సంక్షేమ కార్యక్రమంలో అవినీతికి పాల్పడుతూ, లంచాలను డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎండి గౌతం హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల విడుదల నిమిత్తం ఇంటి ఫోటోలు అప్ లోడ్ చేయడానికి అధికారులెవరైనా నిరాకరిస్తే, ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా లబ్ధిదారులే స్వయంగా ఫోటోలను అప్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. లబ్ధిదారులు తమ మొబైల్ ఫోన్‌లో ఇందిరమ్మ ఇండ్ల యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని, అందులో తమ ఫోన్ నెంబర్‌తో (ఒటిపి ద్వారా) లబ్ధిదారునిగా లాగిన్ కావాలని, ఆ తర్వాత డ్యాష్ బోర్డులో వారికి సంబంధించిన వివరాలన్నీ కనిపిస్తాయని, ఇంటికి సంబంధించి 'క్యాప్చర్ స్టేజ్ వైజ్ ఫోటో గ్రాఫ్స్' అని ఇంటి నిర్మాణ దశలు కూడా ఉంటాయని ఆయన పేర్కొన్నారు గ్రౌండింగ్, బేస్ మెంట్, వాలింగ్, శ్లాబ్ లెయిడ్, కంప్లీషన్ అని కూడా ఉంటాయని, వాటిలో ఏ దశ ఫోటోలు అప్ లోడ్ చేయాల్సి ఉంటుందో దానిపైన క్లిక్ చేసి, ఆ దశకు తగినట్లుగా నిర్దేశించిన వివరాలను పొందుపర్చి, ఇంటి ఫోటోలను తీసి లబ్ధిదారులే స్వయంగా అప్ లోడ్ చేయవచ్చని గౌతం వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో వివిధ రకాల విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ సిబ్బంది, డిప్యూటేషన్‌పైన వచ్చిన అధికారులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఎవరైనప్పటికీ అవినీతికి పాల్పడితే కేసులు ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలు ఫిర్యాదు చేయాలనుకుంటే 1800 599 5991 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

# నామినేషన్లు షురూ

(మొదటి పేజీ తరువాయి)

దాఖలు చేయగా, ఇందులో కొందరు ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేయడంతో నామినేషన్ల సంఖ్య 902కు చేరింది. పార్టీల వారిగా కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 382 నామినేషన్లు దాఖలు చేసి ముందంజలో నిలిచింది. ఆ తరువాత బిఆర్ఎస్ నుంచి 258, బిజెపి 169, సిపిఐ 7, సిపిఐ(ఎం) 8, ఎఐఎంఐఎం 3 నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్ర పార్టీలుగా గుర్తింపు పొందిన, టిఎస్ఇసి వద్ద నమోదైన రాజకీయ పార్టీల నుంచి మరో 19 నామినేషన్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థులు 55 నామినేషన్లు దాఖలు చేశారు.నామినేషన్ల తొలి రోజే పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు కావడంతో రాజకీయ పార్టీల మధ్య పోటీ తీవ్రతను ప్రతిబింబింస్తోంది. ముఖ్యంగా అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి భారీ సంఖ్యలో అభ్యర్థులను రంగంలోకి దింపడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com